SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక

తెలుగు దినపత్రిక

సంపుటి: 19 | సంచిక: 154 | ఎడిటర్ : విక్రం కుమార్ | బుధవారం 8 ఏప్రిల్ 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 14 | వెల:రూ.10 |

విలేకరులు కావలెను

ఫోన్ నెం : 99483 13985/ 89789 80131

## ఇరాన్ అంతం ఖాయం



- ఇష్టం లేకపోయినా చర్యలు తప్పడం లేదు
- హార్ముజ్‌ను తెరవకపోతే విధ్వంసం తప్పదు
- మరోమారు ఘాటుగా హెచ్చరించిన ట్రంప్

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి ఇరాన్‌కు తీవ్ర హెచ్చరికలు చేశారు. ఇరాన్ నాగరికత మొత్తం నేటి రాత్రితో అంతమైపోతుందని అన్నారు. దానిని మళ్లీ ఎప్పటికీ పునరుద్ధరించలేరని 'ట్రూత్ సోషల్' వేదికగా పోస్టు పెట్టారు. ఇరాన్‌లో 47 ఏళ్లుగా ఉన్న అవినీతి, అరాచక పాలన అంతం కానుందని.. ప్రపంచ చరిత్రలో ఈ రాత్రి ఓ మైలురాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. 3

## రెడ్ లైన్స్ దాటొద్దు



- అమెరికాకు తలుపులు మూసేసిన ఇరాన్
- తమ ఇంధన వనరులపై దాడి చేస్ఏ బాబ్-అల్-మండేబ్ మూసేస్తామని హెచ్చరిక

3

# బెంగాల్‌పై కన్నేస్తే.. పాక్ ముక్కలే

- పాక్ రక్షణ మంత్రి ఖవాజా వ్యాఖ్యలకు కౌంటర్
- రెచ్చగొట్టే ప్రకటనలై మండిపడ్డ రాజ్‌నాథ్ సింగ్



పాకిస్థాన్‌కు రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్ట్రాంరగ్ వార్నింగ్ ఇచ్చారు. బెంగాల్‌పై కన్నేస్తే ఈసారి పాక్ ఎన్ని ముక్కలవుతుందో ఆ దేవుడికే తెలియాలంటూ హెచ్చరికలు చేశారు. భవిష్యత్తులో భారత్ ఏమైనా దాడులకు పాల్పడితే.. కోల్‌కతానూ లక్ష్యంగా చేసుకుంటామని పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ ఇటీవల కవ్వింపులకు పాల్పడ్డారు. 4

## రాబోయే 48 గంటలు గడపదాటొద్దు

### ఇరాన్‌లోని భారత పౌరులకు కేంద్రం ఎమర్జెన్సీ అలర్ట్

ట్రంప్ హెచ్చరికతో టెహ్రాన్‌లో ఉత్కంఠ

ఎక్కడివారు అక్కడే ఉండాలని ఎంబసీ ఆదేశం

2



# కేరళ ఎన్నికల్లో కాంగ్రెస్ సునామీ

## విజయన్, మోడీ మంచి మిత్రులు



### రేవంత్‌తో నాకేం పని?

- తెలంగాణ నేతలే సమాధానం చెప్తారు
- పినరయి ఘాటు వ్యాఖ్యలు!

2

- రాష్ట్ర యువతను మోసం చేస్తున్న పినరయ్
- కేరళంలో ఇక ఎల్‌డీఎఫ్‌కు కాలం చెల్లింది
- ప్రచారంలో సీఎం రేవంత్ రెడ్డి విమర్శలు

కేరళలో పినరయి విజయన్, ఢిల్లీలో నరేంద్ర మోదీ ఇద్దరూ 'పొలిటికల్ బ్రదర్స్' అని రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. మోదీ సూచనల మేరకే కేరళలో పాలన సాగుతోందని, కేంద్రంలోని కేసుల నుండి తప్పించుకోవడానికే విజయన్ అగ్రనేతలతో ఒప్పందం కుదుర్చుకున్నారని ఆరోపించారు.

**తిరువనంతపురం, ఏప్రిల్ 7 :** కేరళ ప్రజలను పినరయి విజయన్ మోసం చేస్తున్నారని కేరళ ఎన్నికల ప్రచారంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరోమారు విమర్శలు గుప్పించారు. ఈ విషయంలో తాను చర్చకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. పినరయి విజయన్.. మోదీ నుంచి సూచనలు తీసుకుంటున్నారు. వారి

మిగతా 2 లో

## పథకాల అమలులో జాప్యం వద్దు

- నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాల్సిందే
- ఉచిత ఇళ్ల స్థలాల పంపిణీ వేగవంతం కావాలి
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం
- కాలేజీ విద్యలో సమూల మార్పులకు శ్రీకారం



5



## జల సంరక్షణ మనందరి బాధ్యత

### భవిష్యత్తు తరాల కోసం నీటిని కాపాడుకుందాం


100 రోజుల స్పెషల్ డ్రైవ్ ప్రారంభం

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

2

'జలమే జీవం.. జీవమే జల సంరక్షణకు మూలం' అనే స్పృహ ప్రతి ఒక్కరిలో కలగాలని, నీటిని సంరక్షించుకోవడం ద్వారానే భవిష్యత్తు తరాలకు మనం భరోసా ఇవ్వగలమని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి గోదావరి, కృష్ణా, పెన్నా, వంశధార వంటి నదులే జీవనాధారమని పేర్కొన్నారు.

## వచ్చే మూడ్రోజులు తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు



.. వివరాలు 2లో



## మావోయిస్టుల శకం ముగిసింది

### కర్రెగట్టుల్లో స్వేచ్ఛగా తిరిగే వెసలుబాటు

మావోయిస్టు అడ్డాల్‌ఓ అభివృద్ధి పరుగులు

రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి వెల్లడి

ఒకప్పుడు దట్టమైన అడవుల్లో సమాంతర ప్రభుత్వాన్ని నడిపిన మావోయిస్టుల ఉనికి ఇప్పుడు తెలంగాణలో లేదని డీజీపీ శివధర్ రెడ్డి స్పష్టం చేశారు. ఆపరేషన్ కగార్ విజయవంతం కావడంతో పాటు, కీలక నాయకత్వం, సైన్యాధ్యక్షులు సైతం బయటకు రావడంతో ఆ వ్యవస్థ పూర్తిగా కొలాప్స్ అయిందని ఆయన పేర్కొన్నారు.

వివరాలు 6వ పేజీలో



# రాబోయే 48 గంటలు గడపదాటొద్దు

## ఇరాన్‌లోని భారత పౌరులకు కేంద్రం ఎమర్జెన్సీ అలర్ట్

## ట్రంప్ హెచ్చరికతో టెహ్రాన్‌లో ఉత్కంఠ


## ఎక్కడివారు అక్కడే ఉండాలని ఎంబసీ ఆదేశం

**ఢిల్లీ:** ఈ రాత్రి తాము చేయబోయే దాడులతో ఓ నాగరికత ముగిసిపోతుందని, ఈ రాత్రి ప్రపంచ చరిత్రలో కీలక ఘట్టంగా నిలిచిపోతుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్ కు తీవ్ర హెచ్చరిక జారీ చేయడం పట్ల భారత కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఇరాన్‌లో నివసిస్తున్న భారత పౌరుల భద్రతపై కేంద్ర ప్రభుత్వం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయం అత్యవసర హెచ్చరికలను జారీ చేసింది. రాబోయే 48 గంటల పాటు భారతీయులందరూ అత్యంత అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడివారు అక్కడే ఇళ్లకు పరిమితం కావాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన డెడ్‌లైన్ సమీపిస్తుండటంతో ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు తారస్థాయికి చేరాయి. ఈ హెచ్చరికలను భారతీయులందరూ తక్షణం పాటించాలని ప్రభుత్వం కోరింది. రాయబార కార్యాలయం జారీ చేసిన సలహాలో పలు కీలకమైన సూచనలు ఉన్నాయి. "తదుపరి 48 గంటల పాటు మీరు ఎక్కడ ఉన్నారో అక్కడే ఉండండి. అనవసరంగా బయటకు రావద్దు. ముఖ్యంగా విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, సైనిక స్థావరాలు, ప్రభుత్వ కార్యాలయాలు వంటి సున్నితమైన ప్రాంతాలకు పూర్తిగా దూరంగా ఉండాలి. బహుళ అంతస్తుల భవనాల్లో నివసించే వారు పై అంతస్తుల్లో ఉండవద్దు" అని స్పష్టం చేసింది. అత్యవసరంగా రహదారి ప్రయాణాలు చేయాల్సి వస్తే, తప్పనిసరిగా రాయబార కార్యాలయ అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించింది. ఇప్పటికే ఎంబసీ ఏర్పాటు చేసిన వసతి గృహాలు, హోటళ్లలో ఉన్నవారు తమ గదులను విడిచి బయటకు వెళ్లవద్దని, అధికారులతో నిరంతరం టచ్‌లో ఉండాలని కోరింది. హార్మూజ్ జలసంధిని తిరిగి తెరవాలని లేదా ఒప్పందానికి రావాలని, లేనిపక్షంలో ఏప్రిల్ 7-8 తేదీల్లోగా ఇరాన్‌లోని విద్యుత్ ప్లాంట్లు, వంతెనలపై తీవ్ర దాడులు తప్పవని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించిన విషయం తెలిసిందే. ఈ రాత్రికి ఇరాన్ జాతి మొత్తం తుడిచిపెట్టుకుపోతుందని కూడా ట్రంప్ వార్నింగ్ ఇచ్చారు. ఈ క్రమంలోనే భారత ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యలు చేపట్టింది. ఇరాన్‌లో ఉన్న విద్యార్థులు, వ్యాపారులు, యాత్రికులు సహా భారతీయులందరి భద్రతకే తమ ప్రథమ ప్రాధాన్యత అని ప్రభుత్వం స్పష్టం చేసింది. అత్యవసర సహాయం కోసం రాయబార కార్యాలయం 24 గంటలూ పనిచేసేలా ప్రత్యేక మొబైల్ నంబర్లను (+989128109115, +989128109102, +989128109109, +989932179359) అందుబాటులోకి తెచ్చింది. అలాగే cons.tehran@mea.gov.in ఈ-మెయిల్ ద్వారా కూడా సంప్రదించవచ్చని తెలిపింది. పరిస్థితి వేగంగా మారే అవకాశం ఉన్నందున, పౌరులందరూ అధికారిక ప్రకటనలను నిరంతరం గమనిస్తూ ఉండాలని విజ్ఞప్తి చేసింది.

# వచ్చే మూడ్రోజులు తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు

## పిడుగులతో కూడిన వర్షాలు పడే అవకాశం

**హైదరాబాద్, ఏప్రిల్ 7:** తెలుగు రాష్ట్రాల్లో వచ్చే మూడు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. తాజా వివరాల ప్రకారం.. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉంది. ఉత్తరాంధ్ర, కోస్తాంధ్ర ప్రాంతాల్లో మేఘావృత వాతావరణంతో పాటు ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయి. ఇక తెలంగాణలోనూ పలు జిల్లాల్లో వర్షాలు పడనున్నాయి. భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి, నల్గొండ, ఖమ్మం జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉండగా, సూర్యాపేట, వరంగల్, జనగామ, సిద్దిపేట జిల్లాల్లో మోస్తరు వర్షాలు పడే సూచనలు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. పిడుగులు పడే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఉరుములు, మెరుపులు ఉన్న సమయంలో బహిరంగ ప్రదేశాల్లో తిరగకూడదని సూచించారు. రైతులు, ప్రయాణికులు సైతం వాతావరణ పరిస్థితులను గమనించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు. పిడుగులు తాటి చెట్లు, విద్యుత్ స్తంభాల మీద ఎకువగా పడుతుంటాయి. కాబట్టి వర్షం పడుతున్న సమయంలో విద్యుత్ తీగల కింద, ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో ఉండకూడదు. ఒక్కోసారి పిడుగు పడ్డ ప్రదేశంలోనే మరోసారి పడే అవకాశం ఉంటుంది. కాబట్టి ఆ ప్రాంతానికి వెళ్లకూడదు. వర్ష సూచన ఉన్నప్పుడు గొడుగులపై ఇనుప బోర్డులు, కెమెరాలు, సెల్‌ఫోన్లు దగ్గర ఉంచుకోకపోవడం చాలా మంచిది. పశువులను గుడిసెలు, కొట్టాలు, షెడ్లలో కట్టివేయాలి. చెట్ల కింద ఉంచొద్దు. ఉరుములు, మెరుపులతో వర్షం పడినప్పుడు రైతులు పొలాల వద్ద ఉండకూడదు.



# కేరళలో కాంగ్రెస్ సునామీ ఖాయం

మొదటి పేజీ తరువాయి

మధ్య ఒప్పందం ఉంది. కేసుల నుంచి మోదీ ఆయనను రక్షిస్తున్నారు. రాష్ట్రంలో యువతను విజయన్ మోసం చేస్తున్నారు. కేరళ ప్రజల నుంచి నాకు ఫీడ్‌బ్యాక్ వచ్చింది. విజయన్‌కు కేసీఆర్ మంచి మిత్రుడు. కేసీఆర్ పాలన గురించి విజయన్ ప్రస్తావించారని రేవంత్ అన్నారు. కేరళం యువత హార్డ్ వర్కింగ్ పీపుల్ అని సీఎం రేవంత్‌రెడ్డి కొనియాడారు. తాజాగా కేరళం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న సీఎం రేవంత్ అక్కడి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. గల్ఫ్ దేశాల అభివృద్ధిలో కేరళం యువత పాత్ర కీలకమన్నారు. కేరళంలోనే విషాద స్టోరీలకు యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ ప్రభుత్వం చరమాంకం పలుకుందన్నారు. యూడీఎఫ్ గవర్నమెంట్ వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పినరయి విజయన్ అంటే తనకు గౌరవమని.. కానీ ఆయన



ప్రభుత్వం అంటే తనకు నచ్చదన్నారు. ఊమెన్ చాండీ కరుణాకరన్ ఆధ్వర్యంలో కేరళ అభివృద్ధి చెందిందన్నారు. కేరళంకు పినరయి విజయన్, మోడీలు వద్దు. పినరయి విజయన్ జ్యోతి బసు, సోమనాథ్ చటర్జీలను మరచిపోయి చాలా కాలం అయ్యింది. ఎన్డీఏ తరపున పినరయి విజయన్ కేరళంలో పని చేస్తున్నారు. కేరళంలో ప్రతి సమస్యకు కారణం పినరయి విజయన్. గత పదేళ్లుగా పినరయి విజయన్ కాకుండా మరో వామపక్ష నేత లీడర్‌గా లేరు. 2023కు ముందు తెలంగాణను తాను తప్ప ఎవరు నడిపించ లేరు అని పినరయి విజయన్ స్నేహితుడు కేసీఆర్ అనుకున్నారు. కానీ కాంగ్రెస్ వచ్చి తెలంగాణలో అభివృద్ధి చేస్తోంది. కేరళంలో యూడీఎఫ్ వచ్చి పినరయి విజయన్ కోటను బద్దలు కొడుతుంది. మోడీ పినరయి విజయన్ పేరుతో కేరళంలోకి ఎంటర్ అవుతున్నారు. మోడీ, పినరయి విజయన్ ఇద్దరూ బ్రదర్స్. కేరళంలో పినరయి, ఢిల్లీలో మోడీ మంచి మిత్రులని సీఎం రేవంత్ విమర్శలు గుప్పించారు.

# రేవంత్‌తో నాకేం పని?

## తెలంగాణలో మా పార్టీ వారు చూసుకుంటారని ఎద్దేవా

**తిరువనంతపురం, ఏప్రిల్ 7:** తనతో చర్చకు రావాలన్న సీఎం రేవంత్‌రెడ్డి సవాల్‌పై కేరళం ముఖ్యమంత్రి పినరయి విజయన్ తిప్పికొట్టారు. ఆయనతో చర్చకు దిగే ఉద్దేశం తనకు లేదన్నారు. రేవంత్‌తో చర్చకు దిగేందుకు తెలంగాణలో పార్టీలు ఉన్నాయని, ఆయన ప్రభుత్వ పనితీరుపై అక్కడి ప్రజలే తీర్పునివ్వాలని వ్యాఖ్యానించారు. తమ పార్టీ నేతలు అక్కడ రేవంత్ వ్యవహారంపై మాట్లాడుతారని అన్నారు. నీతి ఆయోగ్ 2023-24 సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సూచీలో కేరళ తొలి స్థానంలో ఉందని పినరయి విజయన్ అంటున్నారని, ఇది కేరళలో ఏడు దశాబ్దాల ప్రభుత్వాలన్నింటి కృషి అని సోమవారం సీఎం రేవంత్ పేర్కొన్న సంగతి తెలిసిందే. అందులో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూడా ఉందని గుర్తించాలన్నారు. అందరి కష్టాన్నీ సొంత ఖాతాలో వేసుకోవడం సరికాదని హితవు పలికారు. ఈ అంశంపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నానని, చర్చకు రావాలని పినరయి విజయన్‌కు సవాల్ విసిరారు. తెలంగాణ ప్రభుత్వ పనితీరును విమర్శిస్తూ కేరళ సీఎం పినరయి విజయన్ రాసిన లేఖపై సీఎం రేవంత్‌రెడ్డి మరోసారి స్పందించారు. కేరళ ప్రభుత్వ పనితీరుపై తన విమర్శలను ఎంతో గౌరవప్రదంగా, హుందాగా వ్యక్తం చేశానని అన్నారు. విజయన్ మాత్రం తక్కువ స్థాయి భాషను ఉపయోగించాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. ' మీ అసహనపూరిత వ్యాఖ్యలకు నేను అదే రీతిలో స్పందించను.



మీరు నా రాష్ట్రానికి వచ్చినప్పుడు, ఒక అతిథికి చేయాల్సిన అన్ని మర్యాదలు చేస్తానని మాట ఇస్తున్నా. ప్రస్తుత తెలంగాణ పరిస్థితికి మీరు నీతి ఆయోగ్ ఎస్డీజీ ఇండెక్స్ 2023-24ని ప్రామాణికంగా చూపిస్తున్నారు. ఆ సూచీ డిసెంబర్ 2023తో ముగిసిన బీఆర్ఎస్ పదేళ్ల దుష్పరిపాలనను ప్రతిబింబిస్తుంది. మా ప్రభుత్వం 28 నెలలు పూర్తి చేసుకుంది. 2024-25లో తెలంగాణ జీఎస్డీపీ రూ.16.12 లక్షల కోట్లుగా ఉండి.. 10.7 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఇది జాతీయ సగటు 9.9 శాతం కంటే ఎక్కువ. కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, కేరళలను అధిగమించి భారత్‌లోనే అత్యధిక తలసరి ఆదాయం ఉన్న రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. కేరళ ప్రజలకు మీ హయాంలో ఏం జరిగిందో చూపించండి' అని ఎక్స్‌లో పేర్కొన్నారు.

# తెలంగాణలో మావోయిస్టుల శకం ముగిసింది

- కర్రెగుట్టల్లో స్వేచ్ఛగా తిరిగే వెసలుబాటు
- మావోయిస్టు అడ్డాల్‌ఓ అభివృద్ధి పరుగులు
- రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి వెల్లడి

**ములుగు, ఏప్రిల్ 7:** తెలంగాణలో మావోయిస్టుల శకం ముగిసిందని డీజీపీ శివధర్ రెడ్డి అన్నారు. ఒకప్పుడు తుపాకుల మోతతో, అశాంతితో నిండిన తెలంగాణ అటవీ ప్రాంతాల్లో ఇప్పుడు శాంతి గీతం వినిపిస్తోంది. దశాబ్దాల కాలంగా మావోయిస్టులకు అడ్డాగా ఉన్న ప్రాంతాల్లో ఇప్పుడు అభివృద్ధి పరుగులు తీస్తోంది. తెలంగాణలో మావోయిజం పూర్తిగా అంతరించిందని రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి అధికారికంగా ప్రకటించారు. 'ఫేస్ టు ఫేస్' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, కర్రెగుట్టల వంటి మారుమూల ప్రాంతాల్లో మారుతున్న పరిస్థితులను వివరించారు. ఒకప్పుడు దట్టమైన అడవుల్లో సమాంతర ప్రభుత్వాన్ని నడిపిన మావోయిస్టుల ఉనికి ఇప్పుడు తెలంగాణలో లేదని డీజీపీ స్పష్టం చేశారు. ఆపరేషన్ కగార్ విజయవంతం కావడంతో పాటు, కీలక నాయకత్వం, సైన్యాధ్యక్షులు సైతం బయటకు రావడంతో ఆ వ్యవస్థ పూర్తిగా కొలాప్స్ అయిందని ఆయన పేర్కొన్నారు. ఇప్పుడు ఈ ప్రాంతాలు నక్సల్ రహిత జోన్లుగా మారాయని, ప్రజలు స్వేచ్ఛగా తిరుగుతున్నారని తెలిపారు. గతంలో కనీస సౌకర్యాలు లేకపోవడమే నక్సలిజం పెరగడానికి ప్రధాన కారణమని గుర్తించిన ప్రభుత్వం, ఇప్పుడు ఆ లోటును భర్తీ చేస్తోంది. బాహ్య ప్రపంచంతో సంబంధం లేని కర్రెగుట్టల వంటి ప్రాంతాలకు ఇప్పుడు బిటి రోడ్ల నిర్మాణం జరుగుతోంది. దీనివల్ల ఆదివాసీలకు రవాణా



సౌకర్యం మెరుగుపడింది. అత్యవసర సమయాల్లో ఆసుపత్రికి వెళ్లడానికి గ్రామస్తుల కోసం ప్రభుత్వం ఒక ఆటో, టూ వీలర్‌ను కమ్యూనిటీ వాహనాలుగా అందజేసింది. గతంలో 12-13 కిలోమీటర్లు కాలినడకన వెళ్లాల్సిన దుస్థితి ఇప్పుడు తొలగిపోయింది. ఇప్పటికీ విద్యుత్ సౌకర్యం లేని మారుమూల ఇళ్లకు సోలార్ కందిళ్లను పంపిణీ చేయడం ద్వారా ప్రభుత్వం చీకట్లను తొలగిస్తోంది. కనీసం ఆధార్ కార్డులు, ఓటు హక్కు వంటి కనీస గుర్తింపు కూడా లేని ఆదివాసీలకు ఇప్పుడు అన్ని ప్రభుత్వ ఫలాలను అందించడమే లక్ష్యంగా పోలీస్ బాస్ స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దే అవకాశం ఉందని, అటవీ వనరులను కాపాడుకుంటూనే అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తామని డీజీపీ భరోసా ఇచ్చారు. తుపాకీ గొట్టం ద్వారా కాకుండా, అభివృద్ధి ద్వారానే మార్పు సాధ్యమని తెలంగాణ ప్రభుత్వం నిరూపిస్తోంది. కర్రెగుట్టల వంటి ప్రాంతాల్లో వేసిన రోడ్లు కేవలం రవాణా కోసమే కాదు, ఆ ప్రజల ఉజ్వల భవిష్యత్తు కోసం వేసిన బాటలు అని చెప్పవచ్చున్నారు.

# ఐటీ కారిడార్‌లో హైడ్రా భారీ ఆపరేషన్

## 12 వందల కోట్ల విలువైన 8 ఎకరాలు స్వాధీనం

**హైదరాబాద్, ఏప్రిల్ 7:** ఐటీ కారిడార్ లో హైడ్రా భారీ ఆపరేషన్ నిర్వహించింది . మంగళవారం ఖానామెట్ లో రూ. 12 వందల కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కబ్జా చెర నుంచి కాపాడింది. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి..ఐటీ కారిడార్ కు చేరువలోని ఖానామెట్ లో 8 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు తొలగించింది హైడ్రా. స్థానికుల ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు ఆక్రమణల కూల్చివేత చేపట్టారు. హైడ్రా కాపాడిన ప్రభుత్వ భూమి విలువ సుమారు రూ. 12 వందల కోట్లు ఉంటుందని అంచనా వేస్తున్నారు అధికారులు. ఖానామెట్ లోని సర్వే నంబర్ 55లో ఉన్న ప్రభుత్వ భూమిలో భారీ ఆపరేషన్ చేపట్టారు హైడ్రా అధికారులు. ఈ స్థలంలో తాత్కాలిక షెడ్లు, నిర్మాణాలు తొలగించారు హైడ్రా అధికారులు. హైడ్రా వార్నింగ్ తో ఆర్‌సీసీ ప్లాంట్‌ను స్వయంగా తొలగించింది ప్రభుత్వ భూమిని ఆక్రమించిన నిర్మాణ సంస్థ. ప్రభుత్వ భూమిలో కార్మికుల కోసం ఏర్పాటు చేసిన షెడ్లను తొలగించిన హైడ్రా.. మొత్తం భూమి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది. ప్రభుత్వ భూమిగా బోర్డులు ఏర్పాటు చేసి..అసైన్డ్ ల్యాండ్‌గా గుర్తించి, ప్రొహిబిటెడ్ లిస్ట్‌లో నమోదు చేసినట్లు తెలిపారు అధికారులు. రియల్ ఎస్టేట్ సంస్థల తప్పుడు ÷-లకెయిమ్‌లపై చర్యలు తీసుకుంటామని తెలిపారు అధికారులు.





# దేశానికే దిక్సూచి తెలంగాణ ఆడిట్ మోడల్!

- ఆడిటింగ్‌లో హ్యాట్రిక్ సాధించడం గర్వకారణం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- సచివాలయంలో కలిసిన గుజరాత్ ఆడిట్ బృందం

**హైదరాబాద్, ఏప్రిల్ 7:** తెలంగాణ ఆడిట్ శాఖ దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలవడం రాష్ట్రానికే గర్వకారణమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఆన్లైన్ ఆడిటింగ్‌లో అత్యుత్తమ ప్రమాణాలు పాటిస్తూ వరుసగా మూడుసార్లు జాతీయ స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించడం ప్రభుత్వ పారదర్శకతకు, సమర్థవంతమైన పాలనకు నిదర్శనమని పేర్కొన్నారు. మంగళవారం సచివాలయంలో భట్టి విక్రమార్కను గుజరాత్ రాష్ట్ర ఆడిట్ శాఖ ఉన్నతాధికారుల బృందం కలిసింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో అమలవుతున్న ఆడిటింగ్ విధానాలను ఆయన వారికి వివరించారు. తెలంగాణ ఆడిటింగ్ విధానాలను, ఇక్కడి ఆన్లైన్ వ్యవస్థను అధ్యయనం చేసేందుకు వచ్చిన గుజరాత్ బృందం రాష్ట్ర ప్రగతిని అభినందించింది. మన రాష్ట్రంలోని ఉత్తమ విధానాలు దేశానికే ఆదర్శంగా నిలవడం శుభపరిణామమని భట్టి విక్రమార్క ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. తెలంగాణ మోడల్ పాలనను పరిశీలించేందుకు వచ్చే ఇతర రాష్ట్రాల బృందాలకు ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని స్పష్టం చేశారు. ఇక్కడి సాంకేతిక పరిజ్ఞానం, ఆడిటింగ్ ప్రక్రియలో పాటిస్తున్న వేగం తమకు ఎంతో నచ్చిందని గుజరాత్ ప్రతినిధులు పేర్కొన్నారు. సాంకేతికతను జోడించి ఆడిటింగ్ ప్రక్రియలో జవాబుదారీతనం పెంచడం వల్లే ఈ అరుదైన విజయాలు సాధ్యమవుతున్నాయని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు. నిధుల వినియోగంలో పక్కాగా ఆడిటింగ్ నిర్వహించడం ద్వారా ప్రజా ధనం దుర్వినియోగం కాకుండా చూస్తున్నామని తెలిపారు. తెలంగాణలో అమలవుతున్న ఈ విధానాలను దేశంలోని ఇతర రాష్ట్రాలు కూడా అనుసరించడం సంతోషకరమన్నారు. భవిష్యత్తులో ఈ వ్యవస్థను మరింత బలోపేతం చేసి, పారదర్శకతలో రాష్ట్రం అగ్రస్థానంలో కొనసాగేలా చర్యలు తీసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆడిట్ శాఖ ఉన్నతాధికారులు, గుజరాత్ బృందం సభ్యులు పాల్గొన్నారు.

# ఆటో గ్యాస్ కష్టాలకు చెక్!

## కొరత లేకుండా చూడాలి.. కంపెనీలకు కమిషనర్ ఆదేశం

## 17 బంకులు మళ్ళీ షురూ.. పనితీరుపై స్టీఫెన్ సమీక్ష



**హైదరాబాద్, ఏప్రిల్ 7:** ఆటో ఎల్పీజీని నిరంతరాయంగా తెప్పించి బంకుల్లో ఎక్కడా కొరత లేకుండా చూడాలని కంపెనీలకు తెలంగాణ పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర స్పష్టం చేశారు. గత వారం రోజులుగా కంపెనీలు మంచి పనితీరు కనబరిచాయని కొనియాడారు. మంగళవారం హైదరాబాద్‌లో ఆటో ఎల్పీజీ సరఫరా చేసే ప్రైవేట్ మార్కెటింగ్ కంపెనీలతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. గత వారం రోజుల్లో మొత్తం 363 మెట్రిక్ టన్నుల ఆటో ఎల్పీజీని తెప్పించి సరఫరా చేశారని వివరించారు. ఈ క్రమంలోనే మూతపడిన 17 బంకులను మళ్ళీ తెరిపించినట్లు పేర్కొన్నారు. గ్యాస్ సరఫరాను పెంచి మూతపడిన బంకులను పునఃప్రారంభించడంలో సూపర్ గ్యాస్, గో గ్యాస్, టోటల్ ఎనర్జీస్, ప్రైమ్ ఫ్యూయల్ కంపెనీలు చేసిన కృషిని కమిషనర్ అభినందించారు. అయితే పనితీరు ఏమాత్రం మెరుగుపరుచుకోని పలు కంపెనీల పట్ల స్టీఫెన్ రవీంద్ర తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆటో ఎల్పీజీని అధికంగా తెప్పించి అన్ని బంకుల్లో సరఫరా చేయాలని కీలక ఆదేశాలు జారీ చేశారు. ఆటో డ్రైవర్ల ఉపాధి దెబ్బతినకుండా ఉండాలంటే గ్యాస్ సరఫరా ఆగకుండా చూడాలని ఆయిల్ కంపెనీలకు స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో ఆటో గ్యాస్ కొరత రాకుండా ఉండేందుకు అన్ని చర్యలు చేపట్టామని వెల్లడించారు. బంకులకు వస్తున్న గ్యాస్ లెక్కలను పౌరసరఫరాల శాఖ ప్రతిరోజు పర్యవేక్షిస్తుందని చెప్పారు. ఏదైనా సమస్య ఉంటే హెల్ప్ లైన్ నంబర్ 1967కు ఫోన్ చేయాలని సూచించారు.

# మణిపూర్‌లో మరోసారి ఉద్రిక్తత

## నిరసనకారులకు, పోలీసులకు మధ్య ఘర్షణ

**ఇంఫాల్, ఏప్రిల్ 7:** మణిపూర్‌లో మరోసారి ఉద్రిక్తపరిస్థితులు నెలకొన్నాయి. బిష్ణుపూర్ జిల్లాలో నిరసనకారులకు, పోలీసులకు మధ్య ఘర్షణ చెలరేగినట్లు అధికారులు మంగళవారం తెలిపారు. ఆగ్రహించిన పోలీసులు ఆందోళనకారులపై కాల్పులకు దిగారన్నారు. మంగళవారం తెల్లవారుజామున మొయిరాంగ్ ట్రోంగ్లాబి ప్రాంతంలో ఒక నివాసంపై అనుమానిత వ్యక్తులు జరిపిన బాంబుదాడిలో ఐదేళ్ల బాలుడు, ఆరు నెలల చిన్నారి మరణించగా, తల్లికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటనపై ఆగ్రహించిన గ్రామస్తులు ఇంఫాల్ సహా పలు ప్రాంతాల్లో ఆందోళన చేపట్టారు. రహదారులను దిగ్బంధించారు. ఈ ప్రాంతంలో పెట్రోల్ బంక్ సమీపంలోని రెండు ఆయిల్ ట్యాంకర్స్, ట్రక్‌కు నిప్పటించారు. మోయిరాంగ్ పోలీస్ స్టేషన్ సహా ఇంఫాల్ ఈస్ట్, ఇంఫాల్ వెస్ట్ జిల్లాల్లో టైర్లను తగుల బెట్టి నిరసన వ్యక్తం చేశారు. బిష్ణుపూర్ జిల్లాలోని కేంద్ర బలగాల శిబిరంపై దాడి చేశారు. ట్రోంగ్లాయోబికి 200 మీటర్ల దూరంలో ఈ శిబిరం ఉంది. ఆగ్రహించిన పోలీసులు వారిపై కాల్పులకు దిగడంతో నలుగురు వ్యక్తులు గాయపడ్డారు.



# గ్యారెంటీలు ఏవీ? రేవంత్‌పై హరీష్ ఫైర్!

- పరిగిలో భూముల దోపిడీపై ధ్వజం
- అప్పా జంక్షన్ వద్ద బీఆర్ఎస్ నేతల అరెస్ట్
- తమ్ముడి కోసం రైతుల భూములా?
- రేవంత్ ఓ రావణాసురుడు: హరీష్ రావు
- కాంగ్రెస్‌కు ప్రతిపక్ష హోదా కూడా దక్కదు



**హైదరాబాద్, ఏప్రిల్ 7:** వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు ఏమయ్యాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మాజీ మంత్రి హరీష్ రావు ప్రశ్నించారు. తొమ్మిది వందల రోజులైనా హామీలు నెరవేర్చలేదని విమర్శించారు. వికారాబాద్ జిల్లా పరిగిలో భూములు కోల్పోతున్న రైతులను పలకరించేందుకు వెళ్తున్న హరీష్ రావును పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేశారు. రేవంత్ సర్కార్ తీరుపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

### అప్పా జంక్షన్ వద్ద ఉద్రిక్తత

పరిగికి వెళ్తున్న హరీష్ రావు కాన్వాయ్ ను అప్పా జంక్షన్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. లారీలను అడ్డంగా పెట్టి నేతలను నిలువరించారు. ఈ క్రమంలో పోలీసులు, బీఆర్ఎస్ నేతల మధ్య వాగ్వాదం జరిగింది. హరీష్ రావుతో పాటు మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావును అరెస్ట్ చేసి శంషాబాద్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. పోలీసు నిర్బంధాల మధ్యే రైతులకు అండగా పోరాటం కొనసాగిస్తామని నేతలు స్పష్టం చేశారు.

### పేద రైతుల భూములపై కన్ను

పరిగిలో ఎస్సీ, ఎస్టీ రైతులు సాగు చేసుకుంటున్న భూములను లాక్కొని సీఎం తన సోదరుడికి కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని హరీష్ రావు ఆరోపించారు. రేవంత్ పాలనను రాక్షస పాలన, గడీల పాలనగా అభివర్ణించారు. సాగుకు పనికిరాని భూముల్లో పరిశ్రమలు పెట్టాలి కానీ రైతుల పొట్ట కొట్టడం ఏంటని నిలదీశారు. ప్రభుత్వం చేసేది అంతా బోగస్ పాలన అని ఎద్దేవా చేశారు.

### అరెస్టులతో అణచలేరు

ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తున్నారని హరీష్ రావు మండిపడ్డారు. కష్టాల్లో ఉన్న రైతులను పలకరించేందుకు కూడా అనుమతించకపోవడం దారుణమన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ సింగిల్ డిజిట్‌కే పరిమితం అవుతుందని ఎద్దేవా చేశారు. ఆ పార్టీకి కనీసం ప్రతిపక్ష హోదా రాదని జోస్యం చెప్పారు. మళ్ళీ కేసీఆర్ నాయకత్వంలో రామరాజ్యం వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

# ప్రశ్నించే గొంతులను నొక్కడం దుర్మార్గం

- ఇండస్ట్రియల్ పార్క్ పేరుతో భూముల కబ్జా
- బీఆర్ఎస్ నేతల అరెస్ట్ పిరికిపంద చర్య
- హామీలు పక్కనపెట్టి పేదల భూములపై కన్నేస్తారా?
- భూ దందాపై కేటీఆర్ ఫైర్!
- నిర్బంధాలను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్



**హైదరాబాద్, ఏప్రిల్ 7:** ప్రశ్నించే గొంతులను పోలీసు బలంతో నొక్కాలని చూడటం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. పరిగి నియోజకవర్గంలోని కాళ్లాపూర్, రాపోలు గ్రామాల్లో ఇండస్ట్రియల్ పార్క్ పేరుతో రైతుల నుంచి 1200 ఎకరాల భూమిని బలవంతంగా లాక్కోవడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను గాలికొదిలేసి, పేదల భూములపై పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### అరెస్టులు పిరికిపంద చర్య

బీఆర్ఎస్ నేతలు హరీష్ రావు, సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యేల అరెస్టులపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ భూమిని కాపాడుకోవాలని పోరాడుతున్న రైతులకు బాసటగా నిలిచేందుకు వెళ్తున్న నేతలను అక్రమంగా నిర్బంధించడం కాంగ్రెస్ ప్రభుత్వ పిరికిపంద చర్య అని అభివర్ణించారు. రైతు భరోసా, రుణమాఫీ, ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా రైతులను ఇబ్బంది పెడుతున్న ప్రభుత్వం, ఇప్పుడు పరిశ్రమల పేరుతో భూ సేకరణకు దిగడం దుర్మార్గమని పేర్కొన్నారు. గత రెండున్నరేళ్లలో ఒక్క పరిశ్రమను కూడా తీసుకురాని ఈ సర్కార్, భూములను దోచుకోవడంలో మాత్రం విపరీతమైన ఆసక్తి చూపిస్తోందని మండిపడ్డారు.

### దొంగల్లా ఊళ్లు పంచుకుంటున్నారు

కాంగ్రెస్ నేతలు దొంగల్లా ఊళ్లు పంచుకుంటున్నట్లు భూములను కబ్జా చేస్తున్నారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అరెస్టులు, జైళ్లు, అక్రమ కేసులు బీఆర్ఎస్ నాయకులకు కొత్త కాదని, ఉద్యమ కాలం నుంచే ఇవన్నీ ఎదుర్కొని ప్రజల పక్షాన నిలబడ్డామని స్పష్టం చేశారు. ప్రభుత్వం చేసే తాటాకు చప్పుళ్లకు, బెదిరింపులకు ఎవరూ భయపడరని, ప్రజల పక్షాన పోరాటం ఆగదని హెచ్చరించారు. ప్రభుత్వం ఎంత అణచివేతకు పాల్పడినా బాధితులకు అండగా ఉంటామని స్పష్టం చేశారు. అక్రమంగా నిర్బంధించిన నాయకులను వెంటనే విడుదల చేయాలని, భూ సేకరణను తక్షణమే నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. నిరుపేద రైతుల ఆస్తులను కాపాడే వరకు తమ పోరాటం విశ్రమించదని కేటీఆర్ తేల్చి చెప్పారు.

# ఇరాన్ నాగరికత అంతమైపోవడం ఖాయం

- ఇష్టం లేకపోయినా చర్యలు తప్పడం లేదు
- హర్మూజ్‌ను తెరవకపోతే విధ్వంసం తప్పదు
- మరోమారు ఘాటుగా హెచ్చరించిన ట్రంప్



**వాషింగ్టన్, ఏప్రిల్ 7:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి ఇరాన్‌కు తీవ్ర హెచ్చరికలు చేశారు. ఇరాన్ నాగరికత మొత్తం నేటి రాత్రితో అంతమైపోతుందని అన్నారు. దానిని మళ్లీ ఎప్పటికీ పునరుద్ధరించలేరని 'ట్రూత్ సోషల్' వేదికగా పోస్టు పెట్టారు. ఇరాన్‌లో 47 ఏళ్లుగా ఉన్న అవినీతి, అరాచక పాలన అంతం కానుందని.. ప్రపంచ చరిత్రలో ఈ రాత్రి ఓ మైలురాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. ఆ దేశాన్ని తుడిచిపెట్టడం నిజానికి తనకు ఇష్టం లేదని.. కానీ ఆ విధంగా చేయక తప్పట్లేదని పేర్కొన్నారు. అయితే, ఇరాన్‌లో కొత్త, తెలివైన నాయకత్వం వచ్చిందని, దాని వల్ల అద్భుతాలు జరిగే అవకాశం కూడా ఉందన్నారు. మరికొన్ని గంటల్లో ఇరాన్ హర్మూజ్‌ను తెరవకపోతే ఆ దేశంలోని ఇరాన్‌లో వంతెనలు, విద్యుత్ కేంద్రాలను లక్ష్యం చేసుకుంటామని సోమవారం ట్రంప్ హెచ్చరించిన విషయం తెలిసిందే. అయినప్పటికీ అమెరికా ప్రతిపాదనలను ఇరాన్ తిరస్కరించడంతో.. ట్రంప్ తాజాగా మరోసారి హెచ్చరికలు చేశారు. ఇరాన్‌లోని పౌర, మౌలిక సదుపాయాలపై దాడులు చేస్తే.. అంతర్జాతీయ నేరంగా పరిగణిస్తామని ఐక్యరాజ్య సమితి చీఫ్ ఆంటోనియో గుటెరస్ హెచ్చరించినప్పటికీ అమెరికా దాడులు కొనసాగిస్తోంది. ఇరాన్‌లోని ఖర్గ్ ఐలాండ్ లో ఉన్న దాదాపు 50 లక్ష్యాలపై తమ దళాలు దాడులు జరిపినట్లు అమెరికా వెల్లడించింది. అక్కడి రక్షణ వ్యవస్థలపై కూడా దాడులు చేసినట్లు తెలిపింది. ఈ ద్వీపాన్ని స్వాధీనం చేసుకోవడానికి మెరైన్‌లతో ఆపరేషన్ చేపట్టడానికి అగ్రరాజ్యం యోచిస్తున్నట్లు సమాచారం. ఇరాన్‌లోని పలు ప్రాంతాల్లోనూ అమెరికా-ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్నాయి. ట్రంప్ వ్యాఖ్యలపై ఇరాన్ స్పందించింది. ఈ రాత్రికి ఇరాన్ నాగరికత తుడిచి పెట్టుకోబోతోందంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలను తిప్పికొట్టింది. అమెరికా, దాని మిత్రదేశాలే పురాతన నాగరికత కలిగిన ఇరాన్ నుంచి మరిచిపోలేని దెబ్బను రుచి చూస్తారంటూ పేర్కొంది. ఈ మేరకు దక్షిణ ఆఫ్రికాలోని ఇరాన్ ఎంబసీ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టింది.

# రెడ్ లైన్స్ దాటొద్దు

- అమెరికాకు తలుపులు మూసేసిన ఇరాన్



**టెహ్రాన్/వాషింగ్టన్, ఏప్రిల్ 7:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరుకున్నాయి. అటు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇటు ఇరాన్ మధ్య జరుగుతోన్న సవాళ్లు, ప్రతి సవాళ్లతో యుద్ధభూమి మరింత వేడెక్కింది. హర్మూజ్ జలసంధిని తెరవడానికి ట్రంప్ విధించిన గడువు సమీపిస్తున్న తరుణంలో ఇరాన్ కీలక నిర్ణయం తీసుకుంది. అగ్రరాజ్యంతో జరుగుతున్న సంప్రదింపులు, శాంతి చర్చలకు తలుపులు మూసేసింది. ఈ మేరకు ఇరాన్ ప్రభుత్వ పత్రిక టెహ్రాన్ టైమ్స్ సోషల్ మీడియాలో ప్రకటన చేసింది. "అమెరికాతో ఉన్న అన్ని దౌత్య, పరోక్ష సంప్రదింపులు, చర్చల మార్గాల నుంచి ఇరాన్ వైదొలగింది. ఇరు దేశాల మధ్య సందేశాల మార్పిడిని కూడా ముగించింది" ఎక్స్ (ట్విట్టర్) వేదికగా వెల్లడించింది. ఇరాన్ నాగరికత మొత్తం నేటి రాత్రితో అంతమైపోతుందన్న ట్రంప్ బెదిరింపులకు ఇరాన్ దీటుగానే కౌంటర్ ఇచ్చింది. అమెరికా, దాని మిత్రులు కూడా తమ దెబ్బ ఎలా ఉంటుందో రుచి చూస్తాయని హెచ్చరించింది. ఈ క్రమంలోనే పాకిస్థాన్, టర్కీ, ఈజిప్ట్ మధ్యవర్తిత్వంతో అమెరికాతో జరుగుతున్న చర్చలకు ఇరాన్ ముగింపు పలికింది. తమ 'రెడ్ లైన్స్' (హద్దులు) దాటితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని, తమ స్పందన పశ్చిమాసియా దాటి విస్తరిస్తుందని ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ వార్నింగ్ ఇచ్చింది. ఇప్పటికే గల్ఫ్‌లోని అమెరికా సైనిక స్థావరాలు, ఇజ్రాయెల్‌పై బాలిస్టిక్, క్రూయిజ్ క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేసినట్లు రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ ప్రకటించింది. సౌదీ అరేబియాలో అమెరికాకు చెందిన రెండు పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌లు, ఇజ్రాయెల్ సైనిక సామాగ్రి తరలించే నౌకపై కూడా కచ్చితమైన దాడులు చేశామని పేర్కొంది. పౌర లక్ష్యాలను తాము టార్గెట్ చేసుకోమని, కానీ తమ పౌర మౌలిక సదుపాయాలపై దాడులు చేస్తే మాత్రం వెనకడుగు వేసే ప్రసక్తేలేదని, ప్రతీకారం తీర్చుకుంటామని పునరుద్ఘాటించింది.



### మరో బాంబ్ పేల్చిన ఇరాన్

ఓ సైకో తమని ఏం చేయాలేదని చెప్పిన ఇరాన్.. ఇప్పటికే చర్చల ప్రక్రియని నిలిపివేసింది. 'మా ఇంధన వనరులు, బ్రిడ్జిలపై దాడి చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయి. ప్రపంచ చమురు రవాణా మొత్తాన్ని అస్తవ్యస్తం చేస్తాం' అని ఇరాన్ అల్టిమేటం జారీ చేసింది. ఇకపోతే ఆసియా, యూరప్, ఉత్తర అమెరికా, పశ్చిమాసియా నౌకలకు గేట్‌వేగా ఉండే బాబ్ అల్ మండేబ్ మార్గాన్ని మూసేస్తామని ఇరాన్ వార్నింగ్ ఇచ్చింది. ఈ రూట్‌లో నిత్యం 45లక్షల బ్యారెళ్ల చమురు రవాణా జరుగుతుంది. ప్రపంచ చమురు వాణిజ్యంలో 12శాతం ఈ మార్గంలోనే రవాణా జరుగుతుంది. ఒకవేళ ఇది మూసుకుపోతే మరింత ఇంధన సంక్షోభం తలెత్తడం గ్యారంటీ. ఇప్పటికే హర్మూజ్ జలసంధి మూతపడగా.. ఇప్పుడు బాబ్ అల్ మండేబ్ మార్గాన్ని కూడా మూసేస్తే ఆఫ్రికా దేశాల చుట్టూ తిరిగి రావడానికి 14 రోజులు పడుతుంది.




సంపాదకీయం

# అభివృద్ధికి 'రాజకీయ' గ్రహణం

## తెలుగు రాష్ట్రాల్లో సాగుతున్న వింత పోకడలు

రాజకీయాలు ఎన్నికల వరకే పరిమితం కావాలి. కానీ, అధికార పీఠం కోసం రాష్ట్ర ప్రయోజనాలను, అభివృద్ధి ప్రాజెక్టులను పణంగా పెట్టడం పాలకులకు పరిపాటిగా మారింది. తెలంగాణలో మూసీ ప్రక్షాళన నుంచి ఆంధ్రప్రదేశ్‌లో అమరావతి నిర్మాణం వరకు.. అన్నీ రాజకీయ చదరంగంలో పావులుగా మారుతుండటం ఆందోళనకరం. రాజకీయాలు వేరు.. అభివృద్ధి వేరు. ఈ రెండింటినీ వేర్వేరు ధ్రువాలుగా చూడనంత కాలం వ్యవస్థలో మార్పు రాదు. ఈ రెండింటిని కలగలిపి చూడటం వల్లనే అభివృద్ధి కుంటుపడుతుంది. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో ఇదే పరిస్థితి కనిపిస్తోంది. అభివృద్ధి పథంలో దూసుకుపోవాల్సిన రాష్ట్రాలు, రాజకీయ కక్షలు మరియు సంకుచిత ప్రయోజనాల వల్ల వెనక్కి నెట్టబడుతున్నాయి.

### మూసీ ప్రక్షాళన: పట్టుదల - ప్రతిఘటన

తెలంగాణ రాజధాని హైదరాబాద్‌కు తలమానికంగా ఉండాల్సిన మూసీ నది నేడు మురుగు కూపంగా మారింది. దీనిని ప్రక్షాళన చేసి తీరుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్టుదలతో ఉన్నారు. ఇది ఆహ్వానించదగ్గ పరిణామమే. అయితే, ఈ ప్రాజెక్టులో అత్యంత కీలకమైన అంశం 'నిర్వాసితుల సంక్షేమం'. ఇల్లు కోల్పోయిన వారికి ఇల్లు, స్థలం కోల్పోయిన వారికి స్థలం ఇచ్చి, వారు ఆనందపడేలా ఉత్తమ ప్యాకేజీని అమలు చేయాలి. ప్రభుత్వం చూపిన నమూనా ప్రకారం ముందుకు వెళ్లడం మంచిదే, కానీ క్షేత్రస్థాయిలో ప్రజల మనోభావాలను గౌరవించాలి. మరోవైపు, నగర మురుగునీటిని మళ్ళించే ప్రత్యామ్నాయ మార్గాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి. ఇంతకాలం హైదరాబాద్ మురుగునంతా మూసీలోనే పారబోశారు, దానికి శాశ్వత పరిష్కారం చూపకుండా కేవలం సౌందర్యీకరణ చేస్తే ఫలితం ఉండదు. అయితే, ఈ ప్రాజెక్టును వ్యతిరేకిస్తున్న బిఆర్ఎస్, బిజెపిలు కేవలం రాజకీయ విమర్శలకే పరిమితమవుతున్నాయి తప్ప, 'ఇలా చేస్తే బాగుంటుంది' అని ఎందుకు సలహాలు ఇవ్వడం లేదు? పదేళ్ల పాలనలో తెలంగాణను అప్పుల పాలు చేశారనే విమర్శలు ఎదుర్కొంటున్న పాత పాలకులు, ఇప్పుడైనా నిర్మాణాత్మక పాత్ర పోషించాల్సిన అవసరం ఉంది. అభివృద్ధిని రాజకీయంతో ముడిపెట్టడం వల్ల రాష్ట్ర ప్రయోజనాలే దెబ్బతింటాయి.

### అమరావతి: అయోమయ రాజకీయం

ఆంధ్రప్రదేశ్‌లో అమరావతి పరిస్థితి మరీ దారుణం. ఒక రాష్ట్రానికి రాజధాని అనేది కేవలం కార్యాలయాల సముదాయం కాదు, అది ఆ రాష్ట్ర గౌరవం మరియు ఆదాయ వనరు. 2019లో భారీ మెజారిటీతో 151 సీట్లు కట్టబెట్టిన ప్రజలకు జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన బహుమతి ఏంటి? ఐదేళ్ల పాటు 'మూడు రాజధానుల' పేరుతో కాలయాపన చేయడం, అభివృద్ధిని పడకేయించడం. అప్పుడు రాని 'మావిగన్' ఆలోచనలు ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రావడం చూస్తుంటే, అది కేవలం అమరావతిపై ఉన్న ద్వేషమే తప్ప రాష్ట్రంపై ఉన్న ప్రేమ కాదని స్పష్టమవుతోంది. రాజ్యాంగంలో రాజధాని అనే పదం లేదని చెప్పడం ద్వారా ఆయన తన రాజకీయ అజ్ఞానాన్ని లేదా అహంకారాన్ని ప్రదర్శిస్తున్నారు. ప్రజలు చైతన్యం వచ్చి గత ఎన్నికల్లో తగిన తీర్పు ఇచ్చారు. ఇప్పటికైనా వైఫల్యాల నుండి పాఠాలు నేర్చుకోకపోవడం ఆ పార్టీ నేతల దౌర్భాగ్యం. కేవలం అధికార దాహం తప్ప అభివృద్ధిపై వారికి అవగాహన లేదని వారి మాటలే స్పష్టం చేస్తున్నాయి.


### పాలకులు మేల్కోవాలి - ఆరోపణలు వీడాలి

ప్రస్తుత పాలకులు కూడా గతాన్ని గుర్తుంచుకోవాలి. కేవలం రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఉచిత బస్సు ప్రయాణాలు మాత్రమే అభివృద్ధి అని భ్రమపడకూడదు. ఇవి తాత్కాలిక ఊరటనిచ్చే సంక్షేమ పథకాలు మాత్రమే. శాశ్వత అభివృద్ధి అంటే మౌలిక వసతుల కల్పన, పారదర్శక పాలన. ముఖ్యంగా, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఆయన తనయుడిపై వస్తున్న భూకబ్జా ఆరోపణల విషయంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం మౌనం వీడాలి. ఈ ఆరోపణలను వెంటనే ఖండించడమో లేదా విచారణ జరిపించడమో చేయకపోతే, ప్రజల్లో అనుమానాలు బలపడతాయి. నిర్మాణాత్మక పనులు మొదలుపెట్టకుండా కేవలం ప్రచారానికే పరిమితమైతే, రేవంత్ రెడ్డి కూడా రాజకీయ మూసీలో కొట్టుకుపోవడం ఖాయం. రేవంత్ రెడ్డి 'ఫ్యూచర్ సిటీ' అంటున్నారు, కానీ నగరాలు వాటంతట అవే రావాలి తప్ప ఫోర్స్ చేస్తే రావు. అభివృద్ధి అనేది ఒక సహజ ప్రక్రియ అని గుర్తించాలి.

హైదరాబాద్ నగరం ఈ స్థాయికి చేరడానికి మూడు దశాబ్దాల నిరంతర కృషి ఉంది. అభివృద్ధి అనేది ఆగిపోయే ప్రక్రియ కాదు. ఆంధ్రప్రదేశ్‌కు విశాఖ నుంచి ఆదాయం వస్తున్నా, అమరావతి అభివృద్ధి చెందితేనే రాష్ట్రం ఆర్థికంగా నిలదొక్కుకుంటుంది. రైతులు ఇచ్చిన భూములను అభివృద్ధి చేసి, వాటి ద్వారా వచ్చే ఆదాయంతో మౌలిక వసతులు కల్పించడం సరైన మార్గం. పాలకులకు వందేళ్ల ముందుచూపు ఉండాలి. సంకుచిత ఆలోచనలు పక్కన పెట్టి, అభివృద్ధికి బాటలు వేసినప్పుడే రాష్ట్రాల భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుంది. భజనపరుల మాటలు నమ్మి వాస్తవాలను విస్మరిస్తే పతనం తప్పదని గత పాలకులు ఇప్పటికే నిరూపించారు.

# బెంగాల్‌పై కన్నేస్తే.. పాక్ ముక్కలే

- పాక్ రక్షణ మంత్రి ఖవాజా వ్యాఖ్యలకు కౌంటర్
- రెచ్చగొట్టే ప్రకటనలపై మండిపడ్డ రాజ్‌నాథ్ సింగ్



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 7:** పాకిస్థాన్‌కు రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్ట్రాంరగ్ వార్నింగ్ ఇచ్చారు. బెంగాల్‌పై కన్నేస్తే ఈసారి పాక్ ఎన్ని ముక్కలవుతుందో ఆ దేవుడికే తెలియాలంటూ హెచ్చరికలు చేశారు. భవిష్యత్తులో భారత్ ఏమైనా దాడులకు పాల్పడితే.. కోల్‌కతానూ లక్ష్యంగా చేసుకుంటామని పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ ఇటీవల కవ్వింపులకు పాల్పడ్డారు. కోల్‌కతాపై దాడి చేస్తామన్న పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ వ్యాఖ్యలపై కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఘాటుగా స్పందించారు. ఇలాంటి రెచ్చగొట్టే ప్రకటనలను ఆయన చేయకుండా ఉండాల్సిందని, బెంగాల్‌పై కన్నేస్తే పాకిస్థాన్ ఎన్ని ముక్కలుగా విడిపోతుందో భగవంతుడికే తెలియాలని అన్నారు. ఈ వ్యాఖ్యల పైనే తాజాగా రాజ్‌నాథ్ ఘాటుగా స్పందించారు. ఓ వార్తా సంస్థతో ఆయన మాట్లాడుతూ.. ఇలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యల వల్లనే 55 ఏళ్ల క్రితం పాక్ రెండుగా విడిపోయిన విషయాన్ని గుర్తుచేశారు. 1971లో జరిగిన యుద్ధంలో పాకిస్థాన్ నుంచి విడిపోయి బంగ్లాదేశ్ స్వతంత్ర దేశంగా ఏర్పడింది. నాడు బంగ్లా విముక్తి పోరాటానికి భారత సైన్యం అండగా నిలిచింది. ఉద్రిక్తతలను పెంచే ప్రకటనలు చేయవద్దని ఇస్లామాబాద్‌ను ఆయన హెచ్చరించారు. వారు బెంగాల్‌పై కన్నేస్తే.. ఈసారి పాక్ ఎన్ని ముక్కలవుతుందో ఆ దేవుడికే తెలియాలి అని వ్యాఖ్యానించారు. భారత్ భవిష్యత్తులో ఎలాంటి దుస్సాహసాలకు పాల్పడినా కోల్‌కతాపై దాడి చేస్తామని ఖవాజా ఆసిఫ్ గత శనివారంనాడు నోరుపారేసుకున్నారు. దీనిపై తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధినేత్ర మమతా బెనర్జీ, ఎంపీ అబిషేక్ బెనర్జీ కేంద్ర ప్రభుత్వంపై విమర్శలకు దిగింది. కోల్‌కతాపై దాడి చేస్తామని బహిరంగంగా బెదిరించినా ఖవాజా ఆసిఫ్ ప్రకటలను ఖండించే ధైర్యం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్‌షాకు లేకుండా పోయిందని అభిషేక్ బెనర్జీ విమర్శించారు. ఒక ఔన్సు ధైర్యం ఉన్నా కేంద్ర బలగాలకు, బీఎస్ఎఫ్, ఇండియన్ ఆర్మీకు పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను తిరిగి పట్టుకునేందుకు స్వేచ్ఛనివ్వాలని అన్నారు. మోదీ, అమిత్, రాజ్‌నాథ్ సింగ్‌కు ఆ సాహసం ఉందా? అని ప్రశ్నించారు. మమతా బెనర్జీ సైతం కోల్‌కతాపై దాడి చేస్తామన్న పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ వ్యాఖ్యలపై ప్రధాని మోదీ ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. భారత్ స్పందన తీవ్రంగా ఉంటుందని ఆయన ఎందుకు హెచ్చరించలేకపోతున్నారు? అని నిలదీశారు. ప్రధాని రాజీనామాకు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో రాజ్‌నాథ్ సింగ్ తాజాగా స్పందించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# శబరిమలలో మహిళల ప్రవేశంపై నిషేధం

- 9మంది జడ్జిల సుప్రీం విస్తృత ధర్మాసనం విచారణ
- ప్రాచీన ఆచారాలు కేవలం మత విశ్వాసాలకు సంబంధించినవే
- ఇందులో మహిళల పట్ల వివక్ష లేదని కేంద్రం వాదన



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 7:** ప్రాచీనకాలం నుంచి కొనసాగుతోన్న సంప్రదాయాలకు అనుగుణంగానే శబరిమల ఆలయంలో మహిళలకు ప్రవేశ నిషేధం విధించారు కానీ.. దీనికి సంబంధించి వివక్ష ఏమీ లేదని కేంద్రం సుప్రీంకోర్టుకు తెలిపింది. మహిళల ప్రవేశాన్ని అనుమతించడమనేది ఆరాధనా స్వరూపాన్నే మార్చివేస్తుంది. ఆలయ సంప్రదాయాలకు అనుగుణంగా శతాబ్దాలుగా భక్తులు స్వామిని పూజిస్తున్నారని కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వెల్లడించారు. శబరిమల ఆలయంలో మహిళల ప్రవేశానికి సంబంధించి గతంలో వెలువడిన తీర్పును మంగళవారం జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని 9 మంది జడ్జీల ధర్మాసనం సమీక్షిస్తోంది. ఈమేరకు పిటిషన్‌దారుల వాదనలు వింటోంది. దీనికి ముందు కేంద్రం తన వివరణను సమర్పించింది. ఈ అంశం పూర్తిగా మత విశ్వాసాలకు సంబంధించినదని పేర్కొన్నారు. న్యాయసమీక్షకు అతీతమైందని వాదించారు. శబరిమల ఆలయంలో మహిళల ప్రవేశానికి సంబంధించి ఉన్న ఆంక్షలు కొనసాగించాలని సుప్రీంకోర్టును కోరారు. శబరిమల అయ్యప్ప ఆలయంలోకి 10-50 ఏళ్ల వయసున్న మహిళల ప్రవేశంపై నిషేధాన్ని రద్దు చేస్తూ 2018లో సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు ఇచ్చింది. అయితే ఈ తీర్పుపై పలు రివ్యూ పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ క్రమంలోనే 9 మంది సభ్యుల విస్తృత ధర్మాసనం ఈ కేసును విచారిస్తోంది. శబరిమల ఆలయంలో మహిళల ఎంట్రీ అంశంపై ఇవాళ సుప్రీంకోర్టులో విచారణ జరుగుతున్నది. 9 మంది సభ్యుల ధర్మాసనం విభిన్న కోణాల్లో ఈ అంశాన్ని విచారిస్తున్నది. సుప్రీం ధర్మాసనంలో సీజేఐ సూర్యకాంత్‌తో పాటు జస్టిస్ బీవీ నాగరత్న, ఎంఎం సుందరేశ్, అషానుద్దిన్ అమానుల్లా, అరవింద్ కుమార్, ఆగస్టిన్ జార్జ్ మాసి, ప్రసన్న బి వర్లే, ఆర్ మహాదేవన్, జోయ్‌మాల్యా బాగ్చీ ఉన్నారు. 10 నుంచి 50 ఏళ్ల వయసున్న మహిళలకు శబరిమల ఆలయంలోకి ప్రవేశం లేదన్న అంశంతో పాటు మరికొన్ని అంశాలను సుప్రీంకోర్టు పరిశీలిస్తున్నది. అయితే సుప్రీం ధర్మాసనం ముందు కేంద్ర ప్రభుత్వం తన వైఖరిని స్పష్టం చేసింది. కేరళలోని శబరిమల ఆలయంలోకి మహిళల ప్రవేశం విషయంలో ఉన్న నిబంధనలను కేంద్ర ప్రభుత్వ సమర్థించింది. అయితే ఆ అంశం మత విశ్వాసాలకు చెందుతుందని, మతం పరిధిలోకి వస్తుందని, జుడిషియల్ పరిధిలోకి ఇది రాదని ప్రభుత్వం చెప్పింది. కేంద్రం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తన వాదనలు వినిపించారు. ఏదైనా అశాస్త్రీయ విధానం ఉంటే, దాన్ని శాసనాల ద్వారా పరిష్కరించుకోవచ్చు అన్నారు. ప్రతి మతపరమైన విధానాన్ని గౌరవించాలని, ప్రతి అంశాన్ని హుందాతనానికి, శరీర స్వేచ్ఛకు ఆపాదించలేమన్నారు. మసీదుకు వెళ్లినా, గురుద్వారకు వెళ్లినా.. ముఖాన్ని కప్పుకోవాల్సి వస్తుందని, అప్పుడు నా గౌరవాన్ని, హక్కును లాక్కున్నారని అనలేమని తుషార్ మెహతా చెప్పారు. మతపరమైన స్వేచ్ఛను రాజ్యాంగం రక్షిస్తుందన్నారు.

# వలస కార్మికులకు కేంద్రం శుభవార్త

### ఇక నుంచి 5 కేజీల రెండు సిలిండర్ల సరఫరా

### రాష్ట్రాలకు సూచించిన కేంద్రం



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 7:** వలస కార్మికులకు కేంద్రం ఊరట కలిగించింది. వారికి గ్యాస్ సరఫరాపై పెట్రోలియం మంత్రిత్వ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. వలస కార్మికులకు 5 కేజీల ఎఫ్‌టీఎల్ గ్యాస్ సిలిండర్ల సరఫరా రెట్టింపు చేయాలని రాష్ట్రాలను కేంద్రం కోరింది. ఈ మేరకు పెట్రోలియం శాఖ కార్యదర్శి నీరజ్ లేఖ రాశారు. ఓఎంసీల సహాయంతో పౌర సరఫరాల శాఖ ద్వారా గ్యాస్ పంపిణీ చేయాలని సూచించారు. ఎల్‌పిజి గ్యాస్ కొరత వల్ల దేశంలో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. వలస కార్మికుల సంగతి సరేసరి. ఈ నేపథ్యంలో వలస కార్మికులని దృష్టిలో ఉంచుకుని రోజుకి 5 కేజీల గ్యాస్ సిలిండర్ అడ్రస్ ప్రూఫ్ లేకుండా.. ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డు చూపించి కొనుగోలు చేయవచ్చని ఇటీవల కేంద్రం ప్రకటించింది. ఐదు కేజీల గ్యాస్ సిలిండర్ సమీపంలో ఎల్‌పిజి డిస్టిబ్యూటర్ల దగ్గర అందుబాటులో ఉంటుందని పెట్రోలియం శాఖ తెలిపింది. తాజాగా మంగళవారం వలసకార్మికులకు ఇచ్చే గ్యాస్ సిలిండర్ల సంఖ్యను కేంద్రం డబుల్‌కి పెంచింది. అంటే వలస కార్మికులు రోజుకి రెండు ఐదు కేజీల ఎల్‌పిజి సిలిండర్లను కొనుగోలు చేసేందుకు మంత్రిత్వశాఖ వీలు కల్పించింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులకు మంత్రిత్వశాఖ లేఖ రాసింది. మార్చి 21వ తేదీన రాష్ట్రాల చీఫ్‌లకు రాసిన లేఖలో వలస కార్మికులకు ఐదు కేజీ సిలిండర్‌లను ఓఎంసి (ఆయిల్ మార్కెటింగ్ కంపెనీ)ల సహాయంతో ఇవ్వాలని లేఖ రాసింది. అయితే ఈ లేఖలో రాసిన దానికంటే 20 శాతం పరిమితికి మించి పెంచడం జరిగిందని, వలస కార్మికులకు సిలిండర్లను అందుబాటులో ఉంచాలని పెట్రోలియం శాఖ తాజాగా రాష్ట్రాలకు రాసిన లేఖలో పేర్కొంది.

# కోమాలో ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ

### కోడై కూస్తున్న అంతర్జాతీయ మీడియా

**టెహ్రాన్, ఏప్రిల్ 7:** ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ చాలా రోజుల నుంచి కోమాలో ఉన్నారన్న వార్త ఇప్పుడు ప్రపంచమంతా దావానలంలా వ్యాపిస్తోంది. ప్రస్తుతం ఖోమ్ నగరంలో చికిత్స పొందుతున్నారని కోడై కూస్తోంది. ఇరాన్ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలలో మొజ్తాబా ప్రమేయం ఏమీ లేదని అంతర్జాతీయ మీడియా అంటోంది. మొజ్తాబా ప్రస్తుతం అపస్మారక స్థితిలో ఉన్నట్టు అమెరికా- ఇజ్రాయెల్ దేశాల నిఘా సంస్థలకు తెలుసని అంతర్జాతీయ మీడియా పేర్కొంది. సుప్రీం లీడర్ అయిన తర్వాత కూడా మొజ్తాబా ఎక్కడా కనిపించలేదు. మొజ్తాబా తీవ్రంగా గాయపడ్డారని, ప్రాణాలు కూడా కోల్పోయి ఉండొచ్చని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అప్పట్లో అన్నారు. ఖమేనీని చికిత్స నిమిత్తం రష్యాలోని మాస్కోకు తరలించారని కూడా వార్తలు వచ్చాయి. మొజ్తాబా ఖమేనీ ఇరాన్‌లోనే ఉన్నారని, బయటకు వెల్లడించలేని కారణాల వల్ల ఆయన బహిరంగంగా కనిపించడం లేదని రష్యా రాయబారి తెలిపారు. అయితే ఇప్పటివరకు ఇరాన్ ప్రభుత్వం లేదా అధికార వర్గాలు ఈ వార్తను అధికారికంగా ధ్రువీకరించలేదు.

# ఐదు రాష్ట్రాల్లో ఎగ్జిట్ పోల్స్ నిషేధం

### 9వ తేదీ నుంచి 29 వరకు అమలు

### కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటన విడుదల




**న్యూఢిల్లీ, ఏప్రిల్ 7:** ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఎగ్జిట్ పోల్స్‌పై ఎన్నికల కమిషన్ నిషేధం విధించింది. ఏప్రిల్ 9వ తేదీ ఉదయం 7 గంటల నుండి ఏప్రిల్ 29వ తేదీ సాయంత్రం 6.30గంటల వరకు ఎగ్జిట్ పోల్స్ సర్వే నిర్వహించడం, వాటి ఫలితాలను వెల్లడించకూ ఓడదని ఎన్నికల కమిషన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నిర్దిష్ట సమయంలో ఎగ్జిట్ పోల్స్ నిర్వహించడం లేదా వెల్లడించడం ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951లోని సెక్షన్ 126ఎను ఉల్లంఘించడమేనని హెచ్చరించింది. ఉల్లంఘించిన వారికి రెండేళ్ల కఠిన కారాగార శిక్ష లేదా జరిమానా , లేదా రెండూ అమలు చేయవచ్చని ఆ ప్రకటనలో తెలిపింది.కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరి సహా కేరళ, అస్సాం రాష్ట్రాల్లో ఏప్రిల్ 9న, తమిళనాడులో ఏప్రిల్ 23న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. పశ్చిమబెంగాల్‌లో రెండు దశల్లో ఏప్రిల్ 23, 29 తేదీల్లో పోలింగ్ జరగనుంది. ఎన్నికల ఫలితాలు ఏప్రిల్ 30 వెలువడనున్నాయి. కేరళ, పుదుచ్చేరిల్లో మంగళవారం సాయంత్రం 6గంటలకు ప్రచారాన్ని నిలిపివేయాల్సి వుండగా, అస్సాంలో సాయంత్రం 5 గంటల నుండి నిషేధం అమలు కానుంది. పరిమిత సంఖ్యలో పార్టీ కార్యకర్తలు లేదా అభ్యర్థి ఇంటింటికి వెళ్లి చేసే ప్రచారం మినహా, మరే ఇతర ప్రచారానికి అనుమతి లేదు.




## 104 వాహనాల్లో ఇక ఆన్‌లైన్ నిఘా

**మందుల సరఫరా వ్యవస్థ మరింత పటిష్టం.. 'ఇ-ఔషధి'లో వివరాల నమోదు తప్పనిసరి**

**మంగళగిరి, ఏప్రిల్ 7 (సమయం న్యూస్):** రాష్ట్రంలోని 104 సంచార వైద్య వాహనాల ద్వారా గ్రామీణ ప్రాంత రోగులకు అందే మందులు, సర్జికల్స్ సరఫరా వ్యవస్థను మరింత పటిష్టపర్చేందుకు ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. ఈ వాహనాల్లో గ్రామాలకు వెళ్లి రోగులకు పంపిణీ చేసే మందుల వివరాలను ఇకపై తప్పనిసరిగా 'ఇ-ఔషధి' పోర్టల్‌లో నమోదు చేయాలని వైద్యారోగ్య శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్ ఆదేశించారు. సెంట్రల్ డ్రగ్ స్టోర్స్ నుంచి అందే స్టాకు వివరాలను ఆన్‌లైన్ చేయడంతో సరఫరా వ్యవస్థలో పారదర్శకత పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నూతన విధానంపై అవగాహన కల్పించేందుకు మంగళగిరిలోని ఏపీఐఐసీ టవర్స్‌లో రెండు రోజుల పాటు రాష్ట్రస్థాయి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఐటీ విభాగం పర్యవేక్షించింది. రాష్ట్రస్థాయిలో శిక్షణ పొందిన మాస్టర్ ట్రైనర్లు జిల్లాల్లోని 104 వాహనాల డేటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణ ఇస్తారని సి-డాక్ సీనియర్ ప్రాజెక్ట్ ఇంజనీర్ పసుపులేటి అశ్విని ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణలో భాగంగా 104 సంచార వైద్య వాహనాల విభాగంలో పనిచేసే జిల్లా మరియు రీజినల్ మేనేజర్లు, ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్‌లు కలిపి మొత్తం 55 మందికి అవగాహన కల్పించారు. ఆన్‌లైన్‌లో స్టాకు వివరాలు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండటం వల్ల మందులు మరియు సర్జికల్స్ నిల్వలను తనిఖీ చేయడం సులభతరమవుతుందని అధికారులు పేర్కొన్నారు. దీనివల్ల ఏ ప్రాంతంలో ఏ మందుల అవసరముందో గుర్తించి, సకాలంలో సరఫరా చేసేందుకు వీలు కలుగుతుంది. ఇప్పటికే హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లలో ఈ ఆన్‌లైన్ విధానం విజయవంతంగా అమలు జరుగుతుండగా, ఇప్పుడు 104 వాహనాల్లో కూడా దీనిని ప్రవేశపెట్టడం ద్వారా మందుల కొరతను పూర్తిగా నివారించవచ్చని ప్రభుత్వం ఆశిస్తోంది.

## దేవాదాయ శాఖ కమిషనర్ శాంతి అరెస్ట్

**ఆదాయానికి మించి ఆస్తుల కేసులో ఎసిబి చర్యలు**



**విజయవాడ, ఏప్రిల్ 7(సమయం న్యూస్):** ఏపీ దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ కాళింగిరి శాంతి అరెస్టయ్యారు. ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నట్లు అందిన ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికారులు.. తాడేపల్లి, ఉండవల్లి సహా 4 ప్రాంతాల్లో మంగళవారం ఏకకాలంలో సోదాలు చేపట్టారు. తనిఖీల్లో భాగంగా భారీగా అక్రమ ఆస్తులను గుర్తించారు. విశాఖ ఎండాడలో లగ్జరీ ఎ÷-లాట్, తాడేపల్లి కుంచనపల్లిలో జీ ప్లస్ 2 భవనంతోపాటు 770 గ్రాముల బంగారు నగలు, 3 కిలోల వెండి గుర్తించారు. అంతేకాకుండా రూ.1.15 లక్షల నగదు, బ్యాంకు ఖాతాల్లో మరో రూ.3 లక్షలు ఉన్నట్లు తేల్చారు. వీటితోపాటు ఓ కారు, ద్విచక్ర వాహనం గుర్తించారు. అక్రమాల ఆరోపణలతో 2024 జులై నుంచి 2026 మార్చి వరకు శాంతి సస్పెన్షన్‌లో ఉన్నారు.

## వచ్చే మూడ్రోజులు తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు

**పిడుగులతో కూడిన వర్షాలు పడే అవకాశం**

**హైదరాబాద్, ఏప్రిల్ 7 (సమయం న్యూస్):** తెలుగు రాష్ట్రాల్లో వచ్చే మూడు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. తాజా వివరాల ప్రకారం.. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉంది. ఉత్తరాంధ్ర, కోస్తాంధ్ర ప్రాంతాల్లో మేఘావృత వాతావరణంతో పాటు ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయి. ఇక తెలంగాణలోనూ పలు జిల్లాల్లో వర్షాలు పడనున్నాయి. భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి, నల్గొండ, ఖమ్మం జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉండగా, సూర్యపేట, వరంగల్, జనగామ, సిద్దిపేట జిల్లాల్లో మోస్తరు వర్షాలు పడే సూచనలు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. పిడుగులు పడే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఉరుములు, మెరుపులు ఉన్న సమయంలో బహిరంగ ప్రదేశాల్లో తిరగకూడదని సూచించారు. రైతులు, ప్రయాణికులు సైతం వాతావరణ పరిస్థితులను గమనించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు. పిడుగులు తాటి చెట్లు, విద్యుత్ స్తంభాల మీద ఎకువగా పడుతుంటాయి. కాబట్టి వర్షం పడుతున్న సమయంలో విద్యుత్ తీగల కింద, ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో ఉండకూడదు. ఒక్కోసారి పిడుగు పడ్డ ప్రదేశంలోనే మరోసారి పడే అవకాశం ఉంటుంది. కాబట్టి ఆ ప్రాంతానికి వెళ్లకూడదు. వర్ష సూచన ఉన్నప్పుడు గొడుగులపై ఇనుప బోర్డులు, కెమెరాలు, సెల్‌ఫోన్లు దగ్గర ఉంచుకోక పోవడం చాలా మంచిది. పశువులను గుడిసెలు, కొట్టాలు, షెడ్లలో కట్టివేయాలి. చెట్ల కింద ఉంచొద్దు. ఉరుములు, మెరుపులతో వర్షం పడినప్పుడు రైతులు పొలాల వద్ద ఉండకూడదు.

# పథకాల అమలులో జాప్యం వద్దు




**అమరావతి, ఏప్రిల్ 7 (సమయం న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతగా చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను పక్కా ప్రణాళికలతో అమలు చేయాలని, ప్రజలకు అందించే సేవలలో ఎలాంటి జాప్యం జరగకూడదని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. మంగళవారం రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) వేదికగా వివిధ శాఖల పనితీరుపై ఆయన సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు సంతృప్తిని కలిగించే రీతిలో చేరినప్పుడే ఆశించిన ఫలితాలు వస్తాయని ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2 లక్షల మంది ఇళ్ల స్థలాల కోసం ఎదురుచూస్తున్నట్లు సర్వేలో తేలిందని, వీరికి స్థలాల పంపిణీ ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ ఏడాదిలోనే మరోసారి సామూహిక గృహ ప్రవేశాల కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించామని, టిడ్కో ఇళ్లు కాకుండానే మరో 5 లక్షల ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని లక్ష్యంగా నిర్దేశించారు. అలాగే వర్షాకాలంలో ఇసుక కొరత రాకుండా ఇప్పటి నుంచే జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం ఉచిత ఇసుక ద్వారా వచ్చే ఆదాయాన్ని వదులుకుంటున్న నేపథ్యంలో, రీచుల వద్ద రవాణా పేరుతో అధిక ఛార్జీలు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను హెచ్చరించారు. విద్యా రంగంలో కీలక మార్పులకు శ్రీకారం చుడుతూ, కాలేజీ విద్యను ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా 'రీ-ఓరియెంటేషన్' చేయాలని సీఎం ఆదేశించారు. సంప్రదాయ కోర్సులతో పాటు మార్కెట్‌లో డిమాండ్ ఉన్న కొత్త పాఠ్యాంశాలను ప్రవేశపెట్టేలా కరికులమ్‌ను రీ-స్ట్రక్చర్ చేయాలని సూచించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంతో సహా రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలు జాతీయ స్థాయిలో తమ ర్యాంకింగ్‌లను మెరుగుపరుచుకోవాలని, ఇందులో ఉన్నత విద్యామండలి క్రియాశీలక పాత్ర పోషించాలని స్పష్టం చేశారు. మధ్యాహ్న భోజన పథకం అమలులో ఎక్కడా ఫిర్యాదులకు తావుండకూడదని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ప్రజా భద్రతకు సంబంధించి పలు కీలక ఆదేశాలు జారీ చేస్తూ.. విద్యుత్ మరియు కేబుల్ తీగలు కిందకు వేలాడటం వల్ల జరిగే అగ్ని ప్రమాదాలను పూర్తిగా



## అగ్నిమాపక శాఖ ఆధునికీకరణ

**రూ. 253 కోట్లతో సరికొత్త వాహనాలు ప్రారంభించిన సీఎం చంద్రబాబు**

**అమరావతి పరేడ్ గ్రౌండ్‌లో జెండా ఊపి వాహనాల ప్రారంభం**

**అమరావతి, ఏప్రిల్ 7 (సమయం న్యూస్):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అగ్నిమాపక శాఖను దేశంలోనే ఆదర్శవంతమైన విభాగంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించింది. ఇందులో భాగంగా మంగళవారం అమరావతి పరేడ్ గ్రౌండ్ వేదికగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అగ్నిమాపక శాఖకు చెందిన నూతన వాహనాలు, అత్యాధునిక పరికరాలను జెండా ఊపి ప్రారంభించారు. మొత్తం రూ. 252.93 కోట్ల వ్యయంతో అగ్నిమాపక శాఖను ఆధునీకరిస్తున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. దీనిలో భాగంగా తొలి విడతలో రూ. 33.25 కోట్ల విలువైన పరికరాలను అందుబాటులోకి తెచ్చారు. రూ. 18 కోట్ల వ్యయంతో 25 ఫైర్ ఫైటింగ్ వాహనాలు, రూ. 10 కోట్ల వ్యయంతో హై ప్రెషర్ పంప్‌లు కలిగిన 40 క్విక్ రెస్పాన్స్ వాహనాలు, రూ. 2.49 కోట్లతో 50 ఇన్‌ఫ్లేటబుల్ రబ్బర్ బోట్లు, రూ. 2.08 కోట్లతో 30 బీఏ సెట్ కంప్రెసర్లను ప్రభుత్వం కొనుగోలు చేసింది. వాహనాలను పరిశీలించిన అనంతరం అధికారులతో మాట్లాడిన సీఎం చంద్రబాబు.. రాజధాని అమరావతితో పాటు ప్రధాన నగరాల్లో ఆకాశహర్మ్యాలు పెరుగుతున్నాయని, అందుకు అనుగుణంగా అగ్నిమాపక శాఖ సర్వసన్నద్ధంగా ఉండాలని సూచించారు. విపత్తుల సమయంలో ప్రజల ప్రాణాలను కాపాడడానికి ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. "ఒకప్పుడు ఆంధ్రప్రదేశ్ అగ్నిమాపక విభాగం ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఉండేది. పొరుగు రాష్ట్రాలకు కూడా సాయం చేసిన చరిత్ర మనది. ఇప్పుడు మళ్లీ ఆ స్థాయికి చేరుకోవాలి" అని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. కేంద్ర నిధులను, రాష్ట్ర నిధులను సమర్థంగా వినియోగించుకుని విభాగాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హోం మంత్రి వంగలపూడి అనిత, స్థానిక ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్, అగ్నిమాపక శాఖ డీజీ పీవీ రమణ, హోంశాఖ ముఖ్యకార్యదర్శి కుమార్ విశ్వజిత్ మరియు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అధికారులు వాహనాల పనితీరును మరియు సాంకేతిక అంశాలను ముఖ్యమంత్రికి వివరించారు.



## ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కార్యాలయంపై దాడి

**ఇది ఫ్యాక్షన్ రాజకీయాలకు పరాకాష్ట**

**తీవ్రంగా ఖండించిన చంద్రబాబు, లోకేశ్**

**అమరావతి, ఏప్రిల్ 7(సమయం న్యూస్):** హైదరాబాద్‌లో ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కార్యాలయంపై వైసీపీ దాడి యత్నాన్ని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్రంగా ఖండించారు. వైసీపీ నేతలు, రౌడీలు దాడికి దిగడం మీడియా స్వేచ్ఛపై దాడిగా సీఎం అభివర్ణించారు. సొంతంగా మీడియా సంస్థలను నడుపుతూ.. మీడియాను అడ్డుపెట్టుకుని అనైతిక చర్యలకు పాల్పడుతోన్న వైసీపీ.. తమను ప్రశ్నించిన ఆంధ్రజ్యోతిపై ఆరోపణలు, దూషణలు చేయడం అసంబద్ధం అన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో మీడియా సంస్థలపై, ఆంధ్రజ్యోతిపై అనేక వేధింపులకు, కుట్రలకు పాల్పడినా నిబ్బరంగా నిలిచాయి తప్ప భయపడలేదని చంద్రబాబు గుర్తుచేశారు. రౌడీ మూకలను వెంటేసుకుని స్వయంగా ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు మీడియా కార్యాలయంపైకి వెళ్లడం వైసీపీ రౌడీ సంస్కృతికి నిదర్శనమని ఈ సందర్భంగా చంద్రబాబు వ్యాఖ్యానించారు. వేమూరి రాధాకృష్ణ దశాబ్దాలుగా కేసులు, దాడులు, ఒత్తిళ్లకు భయపడ కుండా పత్రికను, ఛానల్‌ను నడుపుతున్నారన్నారు. దాడులు, నిరసనలు, బెదిరింపులతో మీడియాను భయపెట్టాలనే వైసీపీ రాజకీయాలకు కాలం చెల్లిందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అధికారంలో ఉండగా మహిళల పట్ల, సొంత కుటుంబ సభ్యుల పట్ల వైసీపీ నాయకులు, ఆ పార్టీ అధ్యక్షుడు వ్యవహరించిన తీరును మహిళా సమాజం ఎప్పటికీ మర్చిపోదన్నారు. రాజధానిపై వైసీపీ కుట్రలను ప్రశ్నించిన ఆంధ్రజ్యోతి సంపాదకీయానికి సమాధానం చెప్పలేక.. దాడులు నిరసనలతో వైసీపీ డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతోందని సీఎం చంద్రబాబు దుయ్యబట్టారు. ఈ దాడులను విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్రంగా ఖండించారు. ఫ్యాక్షన్ బెదిరింపులకు రాధాకృష్ణ భయపడే వ్యక్తి కాదని లోకేశ్ అన్నారు. 'జగన్ కళ్లలో ఆనందం చూడటం కోసం వైసీపీ రౌడీ మూకలు ఆంధ్రజ్యోతి కార్యాలయంపై దాడికి ప్రయత్నించడం ఆ పార్టీ విష సంస్కృతిని మరోసారి బయటపెట్టింది. నిజాన్ని నిర్భయంగా చెప్పగలిగే దమ్మున్న ఛానల్ ఏబీఎన్-ఆంధ్రజ్యోతిపై వైసీపీ దాడి యత్నాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాను. సాక్షి హైదరాబాద్ ఆఫీస్‌కు ఆంధ్రజ్యోతి ఎంత దూరమో.. ఆంధ్రజ్యోతికి సాక్షి కూడా అంతే దూరంలో ఉంది అన్న సంగతి మర్చిపోవద్దు జగన్. మీడియా కథనాల పట్ల నిరసనలు తెలియజేసే పద్ధతి ఇది కాదు' అని లోకేశ్ అన్నారు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభం అయిన మీడియా ప్రశ్నిస్తే జవాబు చెప్పాలి. కథనం ప్రచురిస్తే ఆధారాలతో ఖండించాలి. కథనం ప్రసారం చేస్తే తప్పయితే తప్పని చెప్పగలగాలి. ఇవేవీ మీ దగ్గర లేనప్పుడు ఇలాంటి దుర్మార్గపు దాడులకు తెగబడటం అలవాటుగా మార్చుకున్నారని మండిపడ్డారు..

# జల సంరక్షణ మనందరి బాధ్యత

**భవిష్యత్తు తరాల కోసం నీటిని కాపాడుకుందాం**

**100 రోజుల స్పెషల్ డ్రైవ్ ప్రారంభం**

**జల్ జీవన్ మిషన్ 2.0లో జలవనరుల స్థిరత్వానికి ప్రాధాన్యం**

**ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్**

**విజయవాడ/కానూరు, ఏప్రిల్ 7 (సమయం న్యూస్):** 'జలమే జీవం.. జీవమే జల సంరక్షణకు మూలం' అనే స్పృహ ప్రతి ఒక్కరిలో కలగాలని, నీటిని సంరక్షించుకోవడం ద్వారానే భవిష్యత్తు తరాలకు మనం భరోసా ఇవ్వగలమని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. మంగళవారం ఉదయం కానూరులోని ఏపీఎస్ఐఆర్డీ భవన్‌లో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన 'గ్రామీణ తాగునీటి సరఫరా వ్యవస్థలో జలవనరుల స్థిరత్వం' వర్క్ షాపును ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్‌మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి గోదావరి, కృష్ణా, పెన్నా, వంశధార వంటి నదులే జీవనాధారమని పేర్కొన్నారు. అయితే, ప్రస్తుతం ఉపరితల జలాలను కాపాడుకోవడంతో పాటు వేగంగా పడిపోతున్న భూగర్భ జల మట్టాలను పెంచడం మన ముందున్న అతిపెద్ద సవాల్ అని అన్నారు. ఇళ్లలో వాడే నీటిని తిరిగి భూమిలోకి పంపడం నుంచి, వృథాగా సముద్రంలో కలుస్తున్న నదీ జలాలను ఒడిసి పట్టడం వరకు ప్రతి అంశంలోనూ ప్రజల్లో చైతన్యం రావాలని ఆకాంక్షించారు. జల సంరక్షణను ఒక ఉద్యమంలా చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్ 6 నుండి జూలై 14 వరకు "100 రోజుల నీటి వినియోగ డ్రైవ్" కు శ్రీకారం చుట్టిందని ఉప ముఖ్యమంత్రి వెల్లడించారు. ఈ కాలంలో భూగర్భ జలాల పెంపుదల, వర్షపు నీటిని నిల్వ చేయడం, నీటి వృథాను అరికట్టడం వంటి అంశాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పిస్తామన్నారు. ప్రకృతిని మనం కాపాడుకుంటేనే, ప్రకృతి మనల్ని కాపాడుతుందని ఆయన గుర్తు చేశారు. ప్రతి కుటుంబానికి తాగునీరు అందించాలనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆశయానికి అనుగుణంగా, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో జల్ జీవన్ మిషన్ 2.0ను సమర్థంగా అమలు చేస్తామని తెలిపారు. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరి శిఖర గ్రామాల్లో వేసవి నీటి ఎద్దడిని నివారించేందుకు వాటర్ షెడ్ల పునరుద్ధరణకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. నీటి సంరక్షణ చర్యల్లో ఆధునిక సాంకేతికతను జోడించి, క్షేత్రస్థాయిలో ప్రజలను భాగస్వాములను




చేస్తామని స్పష్టం చేశారు. ఈ వర్క్ షాపులో పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్, కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ డాక్టర్ పి. కృష్ణయ్య, ఏపీఎస్ఐఆర్డీ కమిషనర్ ముత్యాల రాజు, అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కంకల్ జెడ్పిహెచ్ఎస్ స్కూల్ లో పరిగి డివిజన్ "షీ టీమ్" పోలీసుల అవగాహన కార్యక్రమం

● వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, పరిగి డిఎస్పీ శ్రీనివాస్ ఆదేశాల మేరకు







**పూడూర్ మండలం, ఏప్రెల్,07(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా చెంగ్యముల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కంకల్ గ్రామములోని జెడ్పిహెచ్ఎస్ స్కూల్ లో పరిగి "షీ" టీమ్ ఇంచార్జ్ నర్సిములు ఆధ్వర్యంలో విద్యార్థులు, విద్యార్థిని లకు మహిళలపై జరుగుతున్న నెరలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా "షీ" టీమ్ కార్యకలాపాలు అలాగే మహిళల భద్రతకు సంబంధించిన పలు అంశాలపై అవగాహన కల్పించారు. మహిళలపై జరిగే నేరాలు, నిర్భయ చట్టం, పోక్సో చట్టం, 100 డయల్, "షీ'టీమ్ నెంబర్-181, సీసీ కెమెరాల ప్రాముఖ్యత, బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, కమ్యూనిటీ పోలీసింగ్, మానవ అక్రమ రవాణా, మద్యపాన నిషేధం, బ్యాంకింగ్ ఆన్‌లైన్ మోసాలు, గంజాయి నిర్మూలన, డ్రగ్స్ నిషేధం తోపాటు సైబర్ నేరాల (హెల్ప్‌లైన్ నం: 1930)పై వివరణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్.ఎం. పుష్ప, ఉపాధ్యాయులు, విద్యార్థినులు, "షీ" టీమ్ సభ్యులు బి. సావిత్రి, శోభ ఉన్నారు.

# రేషన్ డీలర్ పై సబ్ కలెక్టర్ కు ఫిర్యాదు





**బాన్సువాడ, ఏప్రిల్ 7 (సమయం న్యూస్):** బాన్సువాడ మండలంలోని తాడ్కోల్ గ్రామంలో రేషన్ డీలర్ రేషన్ కార్డులు ఇప్పిస్తామని చెప్పి పేద ప్రజల నుండి ఒక్కొక్కరి వద్ద రూ.5 వేల వరకు వసూలు చేశాడని తాడ్కోల్ గ్రామస్తులు ఆరోపించారు. ఈ విషయమై మంగళవారం గ్రామస్తులు బిజెపి నాయకులతో కలిసి సబ్ కలెక్టర్ కిరణ్మయిని కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని రేషన్ షాప్ నంబర్ 2901006 డీలర్ అక్రమంగా డబ్బులు వసూలు చేశాడని, సంబంధిత రెవిన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపడితే నిజాలు బయటపడతాయని తెలిపారు. డీలర్‌పై కఠిన చర్యలు తీసుకొని డీలర్‌షిప్‌ను రద్దు చేయాలని, రేషన్ కార్డుల పేరుతో వసూలు చేసిన డబ్బులను బాధితులకు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన సబ్ కలెక్టర్ కిరణ్మయి వెంటనే విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షులు కోణాల గంగారెడ్డి, జిల్లా కార్యదర్శి శంకర్ గౌడ్, నాయకులు నాగరాజు, రాజారెడ్డి, సంతోష్, తుకారాం, సరిత, దత్తు, లక్ష్మణ్, రాజాసింగ్ తదితరులు మరియు బాధితులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ప్రసూతి వైద్యశాలను ఆకస్మిక తనిఖీచేసిన జిల్లా కలెక్టర్





**హన్మకొండ, ఏప్రిల్ 7( సమయం న్యూస్). :** హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మంగళవారం హన్మకొండలోని ప్రభుత్వ ప్రసూతి వైద్యశాలను ఆకస్మికంగా సందర్శించి, ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలను సమగ్రంగా పరిశీలించారు. మొదటగా ఓపీ కౌంటర్ల వద్ద సేవల పరిస్థితిని పరిశీలించిన కలెక్టర్, రిజిస్టర్ల నిర్వహణపై సమీక్ష చేశారు. అనంతరం ఫార్మసీని తనిఖీ చేసి, ఔషధాల నిల్వలు, పంపిణీ విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా లేబర్ రూమ్, వార్డులు మరియు ఇతర విభాగాలను సందర్శించి, అక్కడి పరిస్థితులను పరిశీలించారు. కొన్ని వార్డుల్లో స్వల్పంగా శుభ్రత లోపం గమనించిన కలెక్టర్, వెంటనే శుభ్రత ప్రమాణాలను మెరుగుపరచాలని సంబంధిత సిబ్బందికి ఆదేశించారు. వైద్య సేవల అమలు విధానంపై వివరాలు అడిగి తెలుసుకున్న కలెక్టర్, రోగులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారికి అందుతున్న సేవలపై అభిప్రాయాలను సేకరించారు. వైద్య సిబ్బంది విధులకు సమయానికి హాజరు కావడంతో పాటు, రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. ఆసుపత్రి క్యాంటీన్‌ను కూడా పరిశీలించిన కలెక్టర్, ఆహార పదార్థాల నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ముఖ్యంగా వంట నూనెను పునర్వినియోగం చేయవద్దని హెచ్చరించారు. మొత్తం ఆసుపత్రి నిర్వహణను మరింత సమర్థవంతంగా, శుభ్రతతో నిర్వహిస్తూ, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కట్టుబడి పనిచేయాలని అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి, ఆర్ఎంఓ డాక్టర్ మంజుల, డ్యూటీ డాక్టర్లు మరియు ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# బట్టీ కార్మికుల చెమట చుక్కకు... 'న్యాయ సేవ' ఆరోగ్య రక్ష!




**రామడుగు ఏప్రిల్7( సమయం న్యూస్). :** ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కరీంనగర్ జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో వెలిచాలలోని ఇటుక బట్టీల వద్ద ఉచిత వైద్య శిబిరంతో పాటు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కే. రాణి గారి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని సంస్థ సభ్యులు, న్యాయవాదులు పెరుక రంగయ్య పటేల్, ఏ. కిరణ్ కుమార్, చిట్టి చంద్ర ప్రకాష్ రెడ్డి, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ కే. ప్రసాద్, లేబర్ ఆఫీసర్ మొహమ్మద్ రఫీ మరియు వెలిచాల గ్రామ సర్పంచ్ వీర్ల నర్సింగ రావు, న్యాయవాది బండపల్లి శ్రీధర్ లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదరికంలో ఉండి ఇతర రాష్ట్రాల నుండి వలస వచ్చిన ఇటుక బట్టీ కార్మికులకు నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యంగా ఈ హెల్త్ క్యాంప్‌ను ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ఈ శిబిరంలో ఎముకల వ్యాధి నిపుణులు, శిశువైద్యులు, కంటి వైద్యులు మరియు మానసిక వైద్య నిపుణులు వందలాది మంది కార్మికులకు క్షుణ్ణంగా పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య శిబిరంలో ఉచితంగా మందులు పంపిణీ చేయడమే కాకుండా కార్మికుల మానసిక ఒత్తిడిని తగ్గించడానికి సైకాలజిస్టుల ద్వారా ప్రత్యేక కౌన్సెలింగ్ అందించారు. వైద్య పరీక్షలతో పాటు కార్మికులకు ఉండాల్సిన చట్టపరమైన హక్కులు, కనీస వేతనాలు మరియు భద్రతా నియమాలపై న్యాయ నిపుణులు అవగాహన కల్పించారు. ఏదైనా కష్టం వస్తే జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించి ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి వైద్యులు భరత్ రాజ్, హారిక, వినీత్, మాధురి, మొహమ్మద్ హారీస్, ఫార్మసీ ఆఫీసర్ ప్రసాద్, నర్సింగ్ ఆఫీసర్లు శ్రావణ్ కుమార్, ఉదయ్ కిరణ్, వెలిచాల మెడికల్ ఆఫీసర్ అశ్విత మరియు సిబిఆర్ ఇటుక బట్టీ యజమాని చిన్నకేశవులు, ఇటుక బట్టీ యజమానులు నారాయణ రావు, సురేందర్, అక్బర్, నవీన్ కార్మికులు పాల్గొన్నారు.

# గిరిజన ప్రాంతాల్లో ఉత్తమ వైద్య సేవలకు రాష్ట్ర స్థాయి గుర్తింపు

● భద్రాద్రి కొత్తగూడెం టీవీవీపీ ఆసుపత్రులకు అత్యధిక అవార్డులు



**కొత్తగూడెం/ హైదరాబాద్ ఏప్రిల్7( సమయం న్యూస్). :** 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన ఆరోగ్య వారోత్సవాల సందర్భంగా రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ప్రకటించిన అవార్డుల్లో గిరిజన జిల్లా భద్రాద్రి కొత్తగూడెం విశిష్ట స్థానం సంపాదించింది. జిల్లా డీసీహెచ్ఎస్ డా. రవి బాబు పరిధిలోని వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులు అత్యధిక అవార్డులు సాధించడం వి శేషం. గిరిజన ప్రాంతాల్లో ప్రజలకు నాణ్యమైన, సమయోచిత వైద్య సేవలు అందించడంలో చూపిన కృషికి గుర్తింపుగా ఈ అవార్డులు లభించాయి. రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ దామోదర రాజ నర్సింహ చేతుల మీదుగా ఈ రోజు అవార్డుల ప్రదానం హైదరాబాద్ లోని రవీంద్రభారతి లో జరిగింది. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యదర్శి శ్రీమతి క్రిస్టినా, కమిషనర్ ఫ్యామిలీ ఽ హెల్త్ శ్రీమతి సంగీత, టీవీవీపీ కమిషనర్ అజయ్ కుమార్ , హైదరాబాద్ జిల్లా కలెక్టర్ మరియు ఆరోగ్య శాఖకు సంబంధించిన పలు విభాగాధిపతులు పాల్గొన్నారు. ఈ అవార్డులు అందుకున్న వారిలో CHC పాల్వంచకు చెందిన డా. శైలేష్ కుమార్ (CAS-ఆర్థో), డా. పి. రామ్ ప్రసాద్ (DYCS-అనస్తీషియా), ఏరియా హాస్పిటల్ భద్రాచలం నుంచి డా. క్రిపా విజయ్ (DYCS-పెడియాట్రిక్స్), నర్సింగ్ ఆఫీసర్ శ్రీమతి కృష్ణవేణి, ABAS సేవలలో ఎ. వెంకట రావు (98%), అలాగే ల్యాబ్ సేవల విభాగంలో భద్రాచలం మెడి కల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ కృష్ణ ఉన్నారు. ఏరియా హాస్పిటల్ మనుగూరు నుంచి నర్సింగ్ ఆఫీసర్ శ్రీమతి మానస , సీఎంఎస్ ఇంచార్జ్ ఫార్మాసిస్ట్ గ్రేడ్--× శ్రీమతి ఏ. శారధ అవార్డులు అందుకున్నారు. అదనంగా భద్రాచలం, మను గూరు, చర్ల వంటి గిరిజన ప్రాంతాల్లో ఉత్తమ సేవలు అందిం చినందుకు "బెస్ట్ పెర్ఫార్మెన్స్ ఇన్ ట్రైబల్ ఏరియా" విభాగంలో డీసి హెచ్ ఎస్ డాక్టర్ జి రవి బాబు మూడు అవార్డులు ఆ యా సూపరింటెండెంట్లు అయిన రామ కృష్ణ, గౌరీప్రసాద్, సాయి వర్ధన్ లతో కలిసి అందుకున్నారు..జిల్లా టీవీవీపీ ఆసుపత్రులు ఇప్పటికే పలు సందర్భాల్లో రాష్ట్ర స్థాయిలో ప్రశంసలు పొందగా, ఈ అవార్డులు గిరిజన ప్రజలకు అందిస్తున్న ఉత్తమ వైద్య సేవలకు మరో గొప్ప గుర్తింపుగా నిలిచాయి

# పదోన్నతి ఉత్సాహంతో పాటు మరింత బాధ్యత పెంచుతుంది

● జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS



**నారాయణపేట, ఏప్రెల్,07(సమయం న్యూస్) :** ప్రజలకు బాధ్యతాయుతంగా సేవలు అందిస్తే సమాజంలో పోలీసుల పట్ల గౌరవం, మర్యాదలు మరింత పెరుగుతాయని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS పేర్కొన్నారు. పోలీసు సేవలు కేవలం విధి నిర్వర్తనకే పరిమితం కాకుండా ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించే విధంగా ఉండాలని ఆయన అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో, డిస్ట్రిక్ట్ క్రైమ్ రికార్డు బ్యూరో (ణజ=దీ)లో మహిళా కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీదేవి ఇటీవల హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందిన సందర్భంగా, జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ×ూూ ఆమెను అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ తన చేతుల మీదుగా శ్రీదేవికి హెడ్ కానిస్టేబుల్ హోదాకు సంబంధించిన పట్టీలు అలంకరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.... పదోన్నతి అనేది కేవలం ఉద్యోగంలో ఉన్నత స్థానానికి ఎదగడమే కాకుండా, బాధ్యతలు మరింత పెరగడానికి సూచిక అని తెలిపారు. పదోన్నతి పొందిన ప్రతి పోలీస్ సిబ్బంది తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి బాధితుడిని సానుభూతితో వినడం, వారికి తక్షణ సహాయం అందించడం, న్యాయం జరిగేలా కృషి చేయడం పోలీస్ సిబ్బంది ప్రధాన కర్తవ్యమని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా మహిళలు, పిల్లలు, నిరుపేదలు వంటి బలహీన వర్గాలకు పోలీసులు అండగా నిలవాలని సూచించారు. అలాగే, శాఖలో క్రమశిక్షణ, నిజాయితీ, సేవాభావం వంటి విలువలను పాటిస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని ఎస్పీ పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఉత్తమ పనితీరు కనబరిస్తే మరిన్ని అవకాశాలు, గుర్తింపు లభిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో DCRB డీఎస్పీ మహేష్, DCRB ఎస్సై సునీత, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# కామారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రాష్ట్ర స్థాయి అవార్డు.



**మహబూబాబాద్ ఏప్రిల్7( సమయం న్యూస్). :** రాష్ట్రవ్యాప్తంగా ఉత్తమ సేవలందించినందుకు కోమట్ల గూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కామారం సబ్ సెంటర్‌కు ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ గారు, ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీమతి క్రిస్టినా చొంగ్తు గారి చేతుల మీదుగా రాష్ట్ర స్థాయి అవార్డు ప్రదానం చేయబడింది. ఈ అవార్డు, గర్భిణీ స్త్రీల ముందస్తు నమోదు (Early Registration), నాలుగు తప్పనిసరి౹ాచీజ పరీక్షలు (4 ANC Check-ups), పూర్తి రోగనిరోధక టీకాలు (Full Immunization) కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడంలో కామారం సబ్ సెంటర్ చూపిన విశిష్ట ప్రతిభకు గుర్తింపుగా లభించింది. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రవి రాథోడ్ , మహబూబాబాద్ కామారం సబ్ సెంటర్ సిబ్బందిని అభినందించి, వారి కృషి ఇతర ఆరోగ్య కేంద్రాలకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలలో తల్లి-శిశు ఆరోగ్య సేవలను మెరుగుపరచడంలో సిబ్బంది నిబద్ధత ప్రశంసనీయమని తెలిపారు. ఈ విజయానికి కృషి చేసిన ఆశా కార్యకర్తలు, ౹ాచీవీలు మరియు సంబంధిత సిబ్బందికి ఆయన హృదయపూర్వక అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవలను కొనసాగిస్తూ ప్రజల ఆరోగ్యానికి మరింతగా తోడ్పడాలని ఆకాంక్షించారు.

# అపరిచితుల నుండి అప్రమత్తంగా ఉండాలి

- "షీ" టీమ్ పోలీసులు
- విద్యార్థినులకు అవగాహన కల్పించిన "షీ" టీమ్ పోలీసులు బాలరాజు,చేన్నప్ప
- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS ఆదేశాల మేరకు




**నారాయణపేట, ఏప్రిల్,07(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ గర్ల్స్ హై స్కూల్‌లో విద్యార్థినులకు "షీ" టీమ్ పోలీసులు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుతం జరుగుతున్న పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో విద్యార్థినులు పరీక్షా కేంద్రాలకు వెళ్లే సమయంలో, తిరిగి ఇంటికి వచ్చే సమయంలో అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా "షీ" టీమ్ సిబ్బంది విద్యార్థినులకు పలు ముఖ్య సూచనలు అందించారు. అపరిచితులు మాట్లాడేందుకు ప్రయత్నించినా, లిఫ్ట్ ఇవ్వమని అడిగినా, ఏవైనా అనుమానాస్పద ప్రవర్తన గమనించినా వెంటనే తల్లిదండ్రులకు లేదా పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. అవసరమైతే అత్యవసర హెల్ప్‌లైన్ నంబర్లను వినియోగించాలని సూచించారు .విద్యార్థినులు తమ భవిష్యత్తుకు పునాది వేసే ఈ పరీక్షలను ఆత్మవిశ్వాసంతో రాయాలని, ఎటువంటి భయాందోళనలకు గురి కాకుండా చదువుపై పూర్తి దృష్టి పెట్టాలని ప్రోత్సహించారు. పరీక్షలు జీవితంలో ఒక భాగమే తప్ప అంతిమ లక్ష్యం కాదని, ఉన్నత విద్య మరియు మంచి కెరీర్ సాధన కోసం ఇప్పటినుంచే లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. అదేవిధంగా, టెన్త్ తరగతి అనంతరం ఇంటర్మీడియట్‌లో ఏ కోర్సు ఎంచుకోవాలో ముందుగానే ఆలోచించి, తమ ఆసక్తులు, సామర్థ్యాలు, భవిష్యత్తు అవకాశాలను దృష్టిలో పెట్టుకుని సరైన సబ్జెక్టులను ఎంచుకోవాలని వివరించారు. సరైన అవగాహన లేకుండా కోర్సులు ఎంచుకుంటే తరువాత ఇబ్బందులు ఎదురవుతాయని హెచ్చరించారు. ఈ సందర్భంగా "షీ" టీమ్ పోలీసులు బాలరాజు, చేనప్ప మాట్లాడుతూ...విద్యార్థినులు తమ భద్రతపై ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని, వ్యక్తిగత వివరాలను అపరిచితులతో పంచుకోకూడదని సూచించారు. ఏదైనా వేధింపులు, అనుమానాస్పద పరిస్థితులు ఎదురైతే వెంటనే "షీ" టీమ్‌ను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా గుడ్ టచ్ -- బ్యాడ్ టచ్, సైబర్ భద్రత, మహిళల హెల్ప్‌లైన్ సేవలపై కూడా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో "షీ" టీమ్ పోలీసులు కవిత, జ్యోతి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# గర్భిణీల సంక్షేమమే లక్ష్యం

- మాతా--శిశు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి
- వైద్యులు రోగులకు సమయానికి అందుబాటులో ఉండాలి
- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ



**జనగాం ఏప్రిల్7( సమయం న్యూస్). :** గర్భిణీల సంక్షేమమే లక్ష్యంగా వైద్యులు మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ అన్నారు. మంగళవారం, జిల్లా కేంద్రంలోని చంపక్ హిల్స్ పరిధిలో గల మాతా – శిశు ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ సందర్శించి, ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఓపీ విభాగాన్ని తనిఖీ చేసి, ఓపీ సేవలను మరింతగా మెరుగుపరచాలని సూచించారు. ఆసుపత్రిలోని ప్రతి వార్డును సందర్శించి, అక్కడ అందుతున్న వైద్య సేవలు, సదుపాయాలను స్వయంగా పరిశీలించి, గర్భిణీలకు చేయించే వ్యాయామం సరిగా నిర్వహించాల న్నారు. అలాగే గర్భిణీ స్త్రీలతో కలెక్టర్ మాట్లాడి, ఎక్కడ నుంచి వచ్చారు? ఎలా ఉంది? హీమోగ్లోబిన్ ఎంత ఉంది? ఆసుపత్రిలో అందిస్తోన్న ఆహారం బాగుందా? ఏం ఇస్తున్నారు? సమయానికి మందులు అందిస్తున్నారా? అని వారి ఆరోగ్య పరిస్థితి గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు గర్భిణీలు క్రమం తప్పకుండా అన్ని రకాల పరీక్షలు చేయించుకోవాలని, పోషకాహారం తీసుకోవాలని సూచించారు. అలాగే చిన్న పిల్లల ఆరోగ్యం పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని, పోషక విలువలతో కూడిన నాణ్యమైన ఆహారాన్ని ఇవ్వాలన్నారు. ఆసుపత్రిలో పరిశు భ్రత, మందుల లభ్యత, వైద్య సిబ్బంది హాజరు, రోగులకు అందుతున్న సేవలపై కలెక్టర్ ఆరా తీశారు. ఈ నేపథ్యంలో గర్భిణీలు, శిశువుల ఆరోగ్యం అత్యంత ప్రాధాన్యంగా తీసుకొని సమగ్ర వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. గర్భిణీ స్త్రీలు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకునేలా అవగాహన కల్పించాలని, ప్రసవాల సమయంలో తగిన వైద్య సదుపాయాలు సిద్ధంగా ఉండేలా చూడాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య మరింతగా పెంచాలని, ఆసుపత్రుల్లో పరిశుభ్రతను ఖచ్చితంగా పాటించాలని, అవసరమైన మందులు, పోషకాహారం అందుబాటులో ఉంచాలని, ప్రతి వైద్యులు బాధ్యతగా పని చేయాలని స్పష్టం చేశారు. రోగులతో సానుకులంగా వ్యవహరిస్తూ, వారికి మెరుగైన సేవలు అందించాలన్నారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ విధులు నిర్వర్తించాలని తెలిపారు. ఆసుపత్రి రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఈ పరిశీలనలో ఎంసీహెచ్ సూపరింటెండెంట్ రాజలింగం, ఇతర సంబంధిత అధికారులు, వైద్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఆపదలో సూర్యాపేట బిడ్డ కథనానికి స్పందించిన రాచర్ల కుటుంబం.

- జర్నలిస్ట్ చందన్ కుటుంబానికి ఒక లక్ష 25 వేళ ఆర్థిక సాయం అందజేసిన రాచర్ల కమలాకర్-లక్ష్మి దంపతులు.




**సూర్యాపేట ఏప్రిల్7( సమయం న్యూస్). :** సమాజ సేవలోనే కాకుండా ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడానికి మేము సైతం ముందుంటాము అంటూ రాచర్ల కమలాకర్ లక్ష్మి దంపతులు ముందుకు వచ్చారు. సూర్యాపేట పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ తల్లాడ చందన్ కుమారుడు హయాన్ చంద్ర ఆటిజం సమస్యతో బాధపడుతుండగా అతనికి వైద్య ఖర్చులకు గాను ఎక్కువ మొత్తంలో ఖర్చు చేయాల్సి వస్తుందని గుర్తించి ఒక లక్ష 25 వేళ రూపాయల ఆర్థిక సహాయాన్ని బాబుకు మెరుగైన వైద్యం అందించడానికి గాను కమలాకర్ లక్ష్మి ల వివాహ వార్షికోత్సవం సందర్భంగా హయన్ చంద్ర తల్లిదండ్రులు తల్లాడ చందన్-మంజుల దంపతులకు అందజేశారు. అమెరికాలో స్థిరపడ్డ హీరో షోరూం అధినేత రాచర్ల కమలాకర్-లక్ష్మిల కూతురు అల్లుడు నరేంద్రుల కావ్య-శివశంకర్ దంపతులు ఒక లక్ష, వారి బావమరిది రాయపూడి లక్ష్మీనారాయణ-శోభ దంపతులు ద్వారా 25 వేలు మొత్తం లక్ష 25 వేళ రూపాయల చెక్కులను సోమవారం జిల్లా కేంద్రంలోని హీరో షోరూం లో అందజేసారు. ఈ సందర్భంగా రాచర్ల కమలాకర్ మాట్లాడుతూ.. జర్నలిజంలో రాణిస్తూ అందరి మన్ననలు పొందుతున్న చందన్ కుమారుడు హయన్ చంద్ర త్వరగా కోలుకుని అందరి పిల్లల్లాగా ఆడుకుంటూ ఉండేవిధంగా మారి వచ్చే వివాహ వార్షికోత్సవం నాటికి మంచిగా తిరిగి రావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సూర్యాపేట పట్టణానికి చెందిన ప్రముఖులు, లయన్స్ క్లబ్ సభ్యులు, వాసవి క్లబ్ సభ్యులు ఇంతటి గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టి గొప్ప దాతృత్వాన్ని చాటుకున్న కమలాకర్-లక్ష్మి దంపతులను అభినందించారు.

# తెలంగాణ విద్యావ్యవస్థలో సరికొత్త అధ్యాయం మొదలుకాబోతోంది.

**ఉమ్మడి వరంగల్ జిల్లా ఏప్రిల్ 7 2026 మంగళవారం :** అట్టడుగు వర్గాల పిల్లలకు కూడా కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం 'ప్రీ-ప్రైమరీ' (పూర్వ ప్రాథమిక) విద్యపై భారీ అడుగులు వేస్తోంది. ప్రైవేటు స్కూళ్లకు వెళ్లలేని పేద విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లోనే ఎల్‌కేజీ, యూకేజీ తరగతులను అందు బాటులోకి తెస్తూ విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. వచ్చే విద్యా సంవత్సరం (2026-27) నుంచి రాష్ట్రవ్యాప్తంగా అదనంగా 3,000 ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ విద్యను ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే 1,000 పాఠశాలల్లో విజయవంతంగా నడుస్తున్న ఈ విధానాన్ని ఇప్పుడు మరింత విస్తరిస్తున్నారు. బడ్జెట్‌లో ప్రకటించిన దానికంటే మిన్నగా, సుమారు 3,000 స్కూళ్లలో యూకేజీ తరగతులను ప్రారంభించేందుకు విద్యాశాఖ కసరత్తు ముమ్మరం చేసింది. త్వరలోనే డిస్ట్రిక్ట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ల (ఐజుూ) నుంచి



అందిన నివేదికల ఆధారంగా ఈ పాఠశాలల జాబితాను ఖరారు చేయనున్నారు.

# అంగన్వాడి టీచర్లకు స్మార్ట్ ఫోన్స్ అందజేసిన కొడంగల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఏ. తిరుపతిరెడ్డి





**కోస్గి మున్సిపాలిటీ, ఏప్రిల్,07(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా కోస్గి మున్సిపల్ పరిధిలో కొడంగల్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఏనుముల తిరుపతిరెడ్డి చేతులమీదుగా అంగన్వాడి టీచర్లకు స్మార్ట్ ఫోన్స్ ఇవ్వడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో కడా ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, నారాయణపేట గ్రంథాలయ చైర్మన్ వార్ల విజయకుమార్, కోస్గి మున్సిపల్ చైర్మన్ నాగులపల్లి నరేందర్, కోస్గి మున్సిపల్ కమిషనర్ నాగరాజ్, కోసిగి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రఘువరన్ రెడ్డి, అలాగే కోసిగి మున్సిపల్ కౌన్సిలర్లు, కోస్గి మండల మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## , ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకం (PMIS) -- మూడవ విడత కు దరఖాస్తుకు ఆహ్వానం.

**మహబూబాబాద్ ఏప్రిల్7( సమయం న్యూస్).. :** భారత ప్రభుత్వం కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకం (ౡవీ×ూ) -- మూడవ విడత ప్రారంభించబడినది. ఈ పథకం ద్వారా 6 లేదా 9 నెలల పాటు ప్రముఖ కంపెనీలలో ఇంటర్న్‌షిప్ చేసే అవకాశం లభిస్తుంది. ఎంపికైన వారికి నెలకు రూ. 9,000/- స్టైపెండ్ మరియు రూ. 6,000/- గ్రాంట్ ఇవ్వబడుతుంది. 18 నుండి 25 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన, 10వ తరగతి నుండి డిగ్రీ/పీజీ చదివిన లేదా చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. కుటుంబ వార్షిక ఆదాయం రూ. 12 లక్షల లోపు ఉండాలి. అర్హులైన యువత ఆన్‌లైన్ ద్వారా వెంటనే దరఖాస్తు చేసుకొని ఈ అవకాశాన్ని వినియోగించుకోవలసిందిగా కోరడమైనది. మరింత సమాచారం కోసం టోల్ ఫ్రీ నంబర్: 1800 11 6090 ను సంప్రదించగలరు. జనరల్ మేనేజర్ ..జిల్లా పరిశ్రమల కేంద్రం (DIC) ,,మహబూబాబాద్

## యాలాల పోలీసుల సమర్థత: 4 గంటల్లోనే చైన్ స్నాచింగ్ కేసు ఛేదన.

- పోలీస్ సిబ్బంది కి అబినందించిన జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా IPS,

**యాలాల మండలం, ఏప్రిల్,07(సమయం న్యూస్) :** యాలాల పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన చైన్ స్నాచింగ్ కేసును పోలీసులు అత్యంత వేగంగా ఛేదించారు. కోకట్ గ్రామంలో మహిళ మెడలోని రెండున్నర తులాల బంగారు గొలుసును దుండగులు లాక్కెళ్లగా, అదే సమయంలో తాండూరులో మరో మహిళా కండక్టర్‌పై దాడికి ప్రయత్నించారు. బాధితుల ఫిర్యాదు మేరకు స్పందించిన పోలీసులు,జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా (ఖూూ) ఆదేశాల మేరకు సాంకేతిక పరిజ్ఞానంతో నిందితుల ఆచూకీని కనిపెట్టారు. కేవలం 4 గంటల వ్యవధిలోనే నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా సమర్థవంతంగా పనిచేసిన యాలాల ఎస్సై విట్టల్ రెడ్డి మరియు సిబ్బందిని ఎస్పీ అభినందించారు. మహిళల భద్రత విషయంలో జిల్లా పోలీస్ యంత్రాంగం అప్రమత్తంగా ఉందని, నేరస్థులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె భరోసా ఇచ్చారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎస్పీ స్పష్టం చేశారు.

## భూ భారతి పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

- ఈ - ఆఫీస్ వినియోగాన్ని పెంచి, పరిపాలనలో పారదర్శకత సాధించాలి
- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ





**జనగాం ఏప్రిల్7( సమయం న్యూస్). :** మంగళవారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో భూ భారతి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్ తో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా మండలాల వారీగా పెండింగ్ దరఖాస్తుల ప్రక్రియపై క్షుణ్ణంగా సమీక్షించి, పలు సూచనలు చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. భూ భారతిలో గల వివిధ మాడ్యూల్స్ లోని సక్సెషన్, మ్యుటేషన్, ఖాతా సమీకరణ, డేటా కరెక్షన్, అర్బన్ ల్యాండ్, కోర్టు కేసులు, జీపీపీ, పీపీబీ, నాలా, తదితరాల పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అలాగే పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంలో వేగం పెంచాలని, త్వరగా పూర్తి చేయాలని సూచించారు. అదే విధంగా ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో ఈ - ఆఫీసు విధానాన్ని అమలు చేయాలని సూచించారు. ఈ - ఆఫీస్ వినియోగాన్ని పెంచి, పరిపాలనలో పారదర్శకత, వేగాన్ని సాధించాలన్నారు. ఈ - ఆఫీసుపై శిక్షణ పొంది, వివిధ అంశాలలో అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఈ-ఆఫీస్ వ్యవస్థను పూర్తిస్థాయిలో అమలు చేసి, సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో ఆర్డీఓలు గోపీరాం, వెంకన్న, అన్ని మండలాల తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధురాలిని రక్షించిన క్షేత్రస్థాయి అధికారి

- "అనాధగా లేదా సహాయం అవసరమైన వృద్ధులు ఎక్కడ కనిపించినా.....
- వెంటనే మాకు సమాచారం అందిస్తే తగిన సహాయం అందిస్తాం"
- క్షేత్రాస్థాయి అధికారి సాయి



**నారాయణపేట, ఏప్రెల్,07(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లాలో గురిముల్లా సత్యమ్మ (భర్త: గోపాల్ రెడ్డి) అనే వృద్ధురాలు రోడ్డుపై ఒంటరిగా తిరుగుతున్నట్లు గమనించిన స్థానిక ట్రాఫిక్ పోలీస్ ఎస్సై ఆమెను సురక్షితంగా ఆర్డీఓ కార్యాలయానికి తీసుకువెళ్లారు. ఆర్డీఓ వృద్ధురాలి వివరాలు తెలుసుకొని వెంటనే క్షేత్రస్థాయి అధికారి సాయికి సమాచారం అందించారు. అనంతరం ఆర్డీఓ ఆదేశాల మేరకు వృద్ధురాలిని వయోవృద్ధుల ఆశ్రమంలో తాత్కాలికంగా చేర్పించడం జరిగింది. వృద్ధురాలికి కుమారుడు ఉన్నట్లు తెలిసిన ఒదున, ఆయనను పిలిపించి తల్లిదండ్రుల సంరక్షణ చట్టం ప్రకారం తల్లిదండ్రులను చూసుకోవాలని సూచిస్తూ, అవసరమైతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ హెచ్చరించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయి అధికారి సాయి మాట్లాడుతూ, "అనాధగా లేదా సహాయం అవసరమైన వృద్ధులు ఎక్కడ కనిపించినా వెంటనే మాకు సమాచారం అందిస్తే తగిన సహాయం అందిస్తామని" తెలిపారు.

## రైస్ మిల్లర్లు నిర్ణిత గడువులోపు సీఎంఆర్ బియ్యం ప్రభుత్వానికి సమర్పించాలి.

- అదనపు కలెక్టర్ (రెవెన్యూ)శ్రీను ఆదేశం




**నారాయణపేట, ఏప్రెల్,07(సమయం న్యూస్) :** రైస్ మిల్లర్లు నిర్ణీత గడువులోపు సిఎంఆర్ బియ్యం ప్రభుత్వానికి సమర్పించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీను ఆదేశించారు. మంగళవారం వీసీ హాల్ లో అదనపు కలెక్టర్ డిఎం సిఎస్‌సి, రైస్ మిల్లర్లందరితో, డిటి సిఎస్‌సితో సమావేశం నిర్వహించారు. ఖరీఫ్ 2025-26 కోసం సిఎంఆర్ డెలివరీలపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో రబీ 2025-26 కోసం వరిని కేటాయించడానికి బ్యాంక్ గ్యారెంటీలు, ఒప్పందాలను సమర్పించాలని అలాగే మిగిలిపోయిన గోనె సంచులను వెంటనే తిరిగి ఇవ్వాలని ఆదేశాలు జారీ అయ్యాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎం సివిల్ సప్లై సైదులు, సివిల్ సప్లై అధికారి బాల్ రాజ్, రైస్ మిల్లర్లు, తదితరులు పాల్గొన్నారు......

## రాష్ట్రస్థాయి ఉత్తమ గైనకాలజిస్ట్‌గా డాక్టర్ అన్నపూర్ణకు పురస్కారం

గజ్వేల్ ఆసుపత్రిలో రికార్డు స్థాయి ప్రసవాలు నిర్వహించినందుకు గౌరవం

వైద్య ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ దామోదర రాజనర్సింహ చేతుల మీదుగా అవార్డు ప్రదానం



**సమయం న్యూస్ గజ్వేల్, 07 ఏప్రిల్ 2026 :** ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని వైద్య ఆరోగ్య రంగంలో విశేష ప్రతిభ కనబరిచిన వారికి అందజేసే రాష్ట్రస్థాయి పురస్కారాలలో భాగంగా, గజ్వేల్ జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ ప్రతిష్టాత్మక అవార్డులను అందుకున్నారు. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ దామోదర రాజనర్సింహ చేతుల మీదుగా ఆమె ఈ పురస్కారాన్ని స్వీకరించారు. డాక్టర్ అన్నపూర్ణ గజ్వేల్ డిస్ట్రిక్ట్ హాస్పిటల్ సూపరింటెండెంట్‌గా సేవలు అందిస్తూ, రికార్డు స్థాయిలో అత్యధిక సంఖ్యలో ప్రసవాలు (డెలివరీసు) నిర్వహించినందుకు గాను ఉత్తమ గైనకాలజిస్ట్ గా ఎంపికయ్యారు. అలాగే సిద్దిపేట జిల్లాలో డి.సి.హెచ్.ఎస్ మెడికల్ సూపరింటెండెంట్‌గా ఆమె అందించిన అత్యుత్తమ సేవలను గుర్తిస్తూ ప్రభుత్వం ఈ పురస్కారాన్ని అందించింది. ఈ సందర్భంగా డాక్టర్ అన్నపూర్ణ మాట్లాడుతూ ఈ అవార్డు రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ పురస్కారం కేవలం నా ఒక్కరి కృషి వల్ల సాధ్యం కాలేదని, ఆసుపత్రిలో పనిచేసే వైద్యులు, నర్సింగ్ ఆఫీసర్స్, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టులు, పారామెడికల్ సిబ్బంది, శానిటేషన్ సిబ్బంది ఇలా ప్రతి ఒక్కరి సహాయ సహకారాలు, సమిష్టి కృషి వల్లే ఈ గుర్తింపు లభించిందన్నారు. వారందరికీ ఈ సందర్భంగా ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. రాష్ట్రస్థాయి అవార్డు రావడం వల్ల తనపై బాధ్యత మరింత పెరిగిందన్నారు. భవిష్యత్తులో మరింత కష్టపడి పనిచేస్తానని, సిద్దిపేట జిల్లాను వైద్య ఆరోగ్య రంగంలో రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలిపేందుకు తన వంతు కృషి చేస్తామన్నారు.

## కొడంగల్ KGBV స్కూల్ కి యూత్ ఫర్ సేవ ఫౌండేషన్ సహాయంతో... హై క్వాలిటీ కంప్యూటర్ అందజేసిన ఆర్.జె.డి సోమిరెడ్డి



**కొడంగల్ మున్సిపల్, ఏప్రెల్,07(సమయం న్యూస్) :** యూత్ ఫార్ సేవ ఫౌండేషన్ సహాయంతో సుమారు 4 లక్షల విలువైన ఒక హై క్వాలిటీ కంప్యూటర్‌ను కె.జి.బి.వి స్కూల్ కి ఆర్.జె.డి సోమిరెడ్డి అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.... అదేవిధంగా స్టూడెంట్స్ కి భవిష్యతులో మంచి గా చదువుకొని వాళ్ళు అనుకొన్న లక్ష్యం ను చేరుకోవాలని అన్నారు. వారికి పాఠశాల ప్రిన్సిపాల్ (రూా) కె.స్రవంతి మరియు సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

# రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సమర్థవంతంగా కొనుగోలు ప్రక్రియను నిర్వహించాలి.

- ఏ ఉపాధి హామీ పనులను సమర్థవంతంగా నిర్వహించాలి
- ఏ జిల్లాలో వేసవిలో త్రాగునీరు ఎద్దడి లేకుండా చూడాలి
- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్




**సూర్యాపేట ఏప్రిల్7( సమయం న్యూస్) :** జిల్లాలో వేసవిలో త్రాగు నీరు ఎద్దడి లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. మంగళవారం వి సి కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లాలోని ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, తహసిల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీ ఓలు, మిషన్ భగీరథ, ఆర్డబ్ల్యూ ఎస్ అధికారులతో వివిధ శాఖల పనితీరు, చేపట్టవలసిన పనుల పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ కు అధికారులు రబీ 2025--26 సీజన్‌కు సంబంధించిన వరి ధాన్యం కొనుగోలు (ఝుసుసఎ్రాతీశిఎబతీవఎవత్) లో భాగంగా ఇప్పటివరకు జిల్లాలో మొత్తం 280 ర్రాజ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు, వీటిలో దాదాపు అన్ని సెంటర్లు ప్రారంభించి, ధాన్యం కొనుగోలుకు సిద్ధంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పిపిసి సెంటర్ ఇన్‌చార్జిలకు సూచిస్తూ, ధాన్యం కొనుగోలుకు అవసరమైన అన్ని రకాల సామగ్రిని టీపీ సెంటర్లలో సిద్ధంగా ఉంచుకోవాలని, కొనుగోలు ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమర్థవంతంగా కొనుగోలు ప్రక్రియ నిర్వహించాల న్నారు. జిల్లాలోని అన్ని సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేసి, రైతులకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ కోరారు. ఉపాధి హామీ పథకం పనుల గురించి మాట్లాడుతూ గ్రామపంచాయితీలలో సరాసరి 100 మంది కూలీలతో పనిచేయించాలని . ఉపాధి హామీలో పనిచేస్తున్న కూలీల అందరికీ Face Recognition NMMS App ద్వారా హాజరు తీసుకోవాలని. నర్సరీలల్లో 100% +వతీఎఱఅఫ్అశీఅ వుండేలా చూడాలని. నర్సరీలకు షేడ్ నెట్ లు ఏర్పాటు చేయాలని, అన్నీ రకాల రిజిస్టర్లు నిర్వహించాలని ఉపాధి హామీనందు అన్నీ పనులు యుక్తదార పోర్టల్ నందు Identify చేయవలెనని, ముఖ్యంగా నీటి సంరక్షణ పనులు గుర్తించాలి అని ఆదేశించారు. జిల్లాలో తాగునీటి ఎద్దడి రాకుండా పట్టించమైన చర్యలు తీసుకోవాలని, ఎక్కడైనా సమస్యలు, ఇబ్బందులు కలిగితే తన దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ అన్నారు అలాగే ఎఫ్ఐఆర్ మ్యాపింగ్ వేగవంతం చేయాలని, బి ఎల్ ఓ వెరిఫై చేసి మ్యాపింగ్ ప్రోగ్రాం చేయాలని, బూత్ లెవెల్ ఏజెన్సీలను నియమించాలని, ఫారం పెండెన్సీ పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె సీతారామారావు, డిఎస్ఓ మోహన్ బాబు, సిపిఓ కిషన్, డిపిఓ యాదగిరి ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు

## గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం

- రక్తదాన శిబిరం ద్వారా 32 యూనిట్ల సేకరణ
- ఆర్.ఎం.వో డాక్టర్ రాము




**సమయం న్యూస్ గజ్వేల్, 07 ఏప్రిల్ 2026 :** ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని సిద్దిపేట జిల్లా గజ్వేల్ జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం భారీ రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఆసుపత్రి ఆర్.ఎం.వో డాక్టర్ రాము ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆర్.ఎం.వో డాక్టర్ రాము మాట్లాడుతూ రక్తదానం మహాదానమని, అన్ని దానాల కంటే ప్రాణదానం మిన్న అని పేర్కొన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు, శస్త్రచికిత్సల సమయంలో మరియు ప్రసవ సమయాల్లో రక్తం అందక ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని, అటువంటి వారిని కాపాడటానికి ఇలాంటి శిబిరాలు ఎంతో దోహదపడతాయని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. రక్తాన్ని కృత్రిమంగా తయారు చేయలేమని, కేవలం దానం ద్వారానే సేకరించగలమని చెబుతూ, రక్తదానం సురక్షితమైనదని మరియు ఆరోగ్యకరమైనదని ఆయన అవగాహన కల్పించారు. నేటి శిబిరంలో మొత్తం 32 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ కుమార్ స్వామి మాట్లాడుతూ ప్రజల్లో రక్తదానంపై ఇంకా అవగాహన పెరగాలని, ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ప్రాణదాతలు కావాలని పిలుపునిచ్చారు. లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ తరపున రక్తదాతలకు పండ్లు, జ్యూస్ పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఎం.వో-2 డాక్టర్ ప్రణీత, బ్లడ్ బ్యాంక్ ఇన్చార్జ్ డాక్టర్ భవాని, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ సుమన్, హెల్త్ ఇన్స్పెక్టర్ లక్ష్మి, హెడ్ నర్సులు ఉ మామహేశ్వరి, రోజులిన్, బ్లడ్ బ్యాంక్ ఇన్చార్జ్ దేవేందర్, నర్సింగ్ ఆఫీసర్లు బాలకిషన్, శ్రీనివాస్, నవీన్, ల్యాబ్ టెక్నీషియన్లు రాజు, కరుణాకర్, గౌతమ్, మహేందర్, నజీర్ అహ్మద్, హెల్త్ అసిస్టెంట్ దేవసాని వాసుదేవ్, ఆరోగ్యమిత్ర సురేందర్, జిల్లా పద్మశాలి యువజన సంఘం అధ్యక్షులు గాడిపల్లి అనూప్, గజ్వేల్ యువజన సంఘం అధ్యక్షులు తలకొక్కుల ప్రేమ్ కుమార్, అపర్ణ హస్తం ప్రధాన కార్యదర్శి కటుకం శ్రీనివాస్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు దొంతుల సత్యనారాయణ, దూబకుంట లచ్చాలు, శానిటేషన్ సూపర్వైజర్ శేఖర్, ఇతర పారామెడికల్, శానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వరి ధాన్యం కొనుగోలును పారదర్శకంగా చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ.



**వికారాబాద్, ఏప్రెల్,07(సమయం న్యూస్) :** కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో యాసంగి (రబీ) 2025-26 ధాన్యం కొనుగోళ్లపై పౌర సరఫరా సంస్థ ఆధ్వర్యంలో సన్నాహక మరియు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతూ... రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వరి ధాన్యం కొనుగోలు చేపట్టాలన్నారు. ఏ-గ్రేడ్ వరి ధాన్యానికి క్వింటాలుకు 2389 రూపాయలు,సాధారణ వరి ధాన్యానికి 2369 రూపాయల మద్దతు ధరను నిర్దేశించడం జరిగిందని అదే విధంగా సన్న రకం ధాన్యానికి 500 రూపాయల బోనస్ ను ఇవ్వడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ తెలిపారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని టెంట్లు, త్రాగు నీరు సమకూర్చాలని ఆయన తెలిపారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో విద్యుత్తు సరఫరా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ధాన్యం 17 శాతం కంటే తక్కువ తేమ ఉన్న రైతులకు టోకెన్ లు ఇచ్చి ధాన్యాన్ని సేకరించాలని కలెక్టర్ తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో సరిపడా టార్పాలిన్లు, తూకం, తేమ, తూర్పార యంత్రాలు, గోనే సంచులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. దొడ్డు, సన్నరకం ధాన్యం కొనుగోలు కేంద్రాలను గుర్తించే విధంగా ప్రత్యేకంగా ఫ్లెక్సీలు ప్రదర్శించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. దొడ్డు, సన్నరకం ధాన్యాన్ని తరలించేందుకు ప్రత్యేక వాహనాలను సమకూర్చుకోవాలని కలెక్టర్ సూచించారు. ఏవైనా పిర్యాదులు స్వీకరించే విదంగా హెల్ప్ లైన్ ను ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. అకాల వర్షాల వల్ల ధాన్యం తడవకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ రాజేశ్వరి, డిఆర్డీఓ శ్రీనివాస్, డిఎంసిఎస్ మోహన్ కృష్ణ, డిసిఎస్ఓ సుదర్శన్, డిసిఎస్ఓ నాగార్జున, డిఏఓ రాజా రత్నం, డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ శ్యామ్ రెడ్డి, జిల్లా మార్కెటింగ్ అధికారి మహ్మద్ రియాజ్, అదనపు డీఆర్డిఓ నర్సింలు, డిపిఎం కొమురయ్య, మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షులు బాలేశ్వర్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

## పురపాలక సంఘం ఆదేశానుసారంగా బహిరంగ వేలం

- రూ.20 లక్షలకు చికెన్ మటన్ వేస్టేజ్ వేలం పోటాపోటీగా సాగిన వేలం పాట.
- తాండూర్ వాసికి దక్కిన వేలం
- తాండూర్ మున్సిపల్ కమిషనర్ మధుసూధన్ రెడ్డి





**తాండూర్ మున్సిపల్, ఏప్రెల్,07(సమయం న్యూస్) :** తాండూర్ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మంగళవారం చికెన్, మటన్, మరియు ఫిష్ వ్యర్థాల సేకరణ, రవాణాకు సంబంధించి, స్లాటర్ హౌస్ లకు సంబంధించి బహిరంగ వేలం పాట నిర్వహించడం జరిగింది. ఈ వేలం పాటలో తాండూర్ కు చెందిన ఎండి హమీద్ అత్యధికంగారూ. 20 లక్షలకు పాట పాడి దక్కించుకున్నారు. ఈ వేలంపాటలో ఎజాజ్, అబ్దుల్ రహీం లు పాల్గొన్నారు. ఇందులో అబ్దుల్ రహీం రూ 17 లక్షల7 వేలకు పాట పాడగా, ఎండీ. హమీద్ రూ. 20వేలకు హెచ్చు పాట పాడి దక్కించుకున్నారు. స్లాటర్ హౌస్. స్లాటర్ హౌస్ బహిరంగ వేలంలో ఎండీ. మజీద్, ఖురేషులు పాల్గొన్నారు. ఇందులో ఎండి మజీద్ అత్యధికంగారూ. 64 వేలు పాట పాడి వేలాన్ని దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో చైర్ పర్సన్ పట్లోళ్ల నీరజ, వైస్ చైర్మన్ అబ్దుల్ రజాక్, కమిషనర్ మధుసూదన్ రెడ్డి,మేనేజర్ నరేందర్ రెడ్డి, ఇన్స్పెక్టర్ జి రాములు, పలువురు కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు. నిబంధన మేరకు నడుచుకోవాలి :- టెండర్ నిబంధనలు అనుగుణంగా టెండర్ గెలుపొందిన వారు నడుచుకోవాలని, నిబంధన మేరకు నడుచుకోకపోతే టెండర్లు రద్దు చేయడం జరుగుతుందని కమిషనర్ వెల్లడించారు. 31మార్చ్ 2027 వరకు ఈ టెండర్ ఉంటుందని, ఏడు పని దినాలలో టెండర్ల పాట పాడిన అమౌంటును మున్సిపాలిటీకి జమ చేయాలని సూచించారు.

# ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ చేరాలి

● కలెక్టర్ స్నేహ శబరీష్

**మహబూబాబాద్ ఏప్రిల్7(సమయం న్యూస్). :** ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రతి ఒక్కరికి చేరేలా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ మరియు మెజిస్ట్రేట్ శ్రీమతి స్నేహ శబరీష్ సూచించారు.టీ ప్రైడ్, తెలంగాణ ఐపాస్ వంటి పథకాల ద్వారా ఎస్సీ, ఎస్టీ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించి, ఆర్థికంగా అభివృద్ధి చెందేలా చేయాలని తెలిపారు.మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా స్థాయి పరిశ్రమల పెట్టుబడుల ప్రమోషన్ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఐపాస్ చట్టం, టీ ప్రైడ్ పథకాల అమలుపై సమీక్ష నిర్వహించారు.కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ు+ఆూూూ చట్టం కింద వివిధ శాఖల నుండి అనుమతులు పొందేందుకు 30 యూనిట్లు ₹36.90 కోట్ల పెట్టుబడితో దరఖాస్తు చేసుకున్నాయని తెలిపారు. అందులో 64 అనుమతులు ఇప్పటికే మంజూరు చేసినట్లు చెప్పారు.టీ ప్రైడ్ పథకం ద్వారా 2025 నవంబర్ 1 నుండి 2026 ఏప్రిల్ 7 వరకు కాలంలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు వాహనాల మంజూరు చేపట్టినట్లు తెలిపారు. ఇందులో ఎస్టీ వర్గానికి 42 యూనిట్లకు ₹1,34,18,564 సబ్సిడీ, ఎస్సీ వర్గానికి 1 యూనిట్‌కు ₹1,36,500 సబ్సిడీ మంజూరు చేసినట్లు చెప్పారు.అలాగే మొత్తం 43 పరిశ్రమలకు పెట్టుబడి రాయితీలకు కమిటీ అనుమతి మంజూరు చేసినట్లు తెలిపారు.ప్రభుత్వం నుండి ఎస్సీ,ఎస్టీ, బీసీ,మైనారిటీ అన్ని



వర్గాల యువత కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తుందని, అట్టి అవకాశాలను యువతీ యువకులు వినియోగించుకుని ఆర్థికంగా ఎదగాలని ఆమే సూచించారు, అందుకోసం సంబంధిత విభాగాల సిబ్బంది ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని తెలిపారు,ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీమన్నారాయణ రెడ్డి, విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ విజయేందర్ రెడ్డి, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ అధికారులు దేశీ రామ్ నాయక్, శ్రీనివాస్ రావు, కాలుష్య నియంత్రణ మండలి ఇంజనీర్, ఫ్యాక్టరీస్ శాఖ, కమర్షియల్ టాక్స్ శాఖ, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ సాయి చరణ్, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ ప్రతినిధులు, టౌన్ ప్లానింగ్ అధికారి తారక్ సాయి, సిబ్బంది ముకేష్ తదితరులు పాల్గొన్నారు

# ఆసుపత్రిలో రోగులకు నాణ్యమైన వైద్య సేవలు ఉచితంగా అందించాలి

● జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష
● నిర్లక్ష్యం వహించినా, డబ్బులు ఆశించినా కఠిన చర్యలు
● పోస్టుమార్టం ప్రక్రియలు పూర్తిగా ఉచితం --- ఎవరూ డబ్బులు తీసుకోకూడదు
● ఆసుపత్రిలో పరిశుభ్రత, సదుపాయాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి
● అవసరమైన పరికరాలు, సిబ్బంది సమకూర్చి సేవలను విస్తరించాలి



**పెద్దపల్లి, ఏప్రిల్ 07( సమయం న్యూస్). :** ఆసుపత్రిలో రోగులకు నాణ్యమైన వైద్య సేవలు ఉచితంగా అందించాలని, ఆసుపత్రి విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించినా, డబ్బులు ఆశించినా కఠిన చర్యలు ఉంటాయని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష స్పష్టం చేశారు.మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో గోదావరిఖని జనరల్ ఆసుపత్రి పని తీరు పై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే అరుణ శ్రీ , రామగుండం నగరపాలక సంస్థ మేయర్ మహంకాళి స్వామి తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతి రోగికి సమయానికి నాణ్యమైన వైద్యం అందేలా చూడాలని సూచించారు. అవసరమైన మందులు ఎల్లప్పుడూ స్టాక్‌లో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.రోగుల సౌకర్యాల కోసం గోదావరిఖని జనరల్ ఆసుపత్రిలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఆర్.ఓ ప్లాంట్ ఏర్పాటు, ఆసుపత్రి అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణం, రోగులు మరియు వారి సహాయకుల కోసం అదనపు షెడ్ల నిర్మాణం చేపట్టినట్లు పేర్కొన్నారు.సదారం శిబిరాన్ని ప్రత్యేక భవనానికి మార్చినట్లు తెలిపారు. అదే విధంగా జిల్లా మెడికల్ బోర్డు తరలింపును కూడా సమగ్ర ప్రణాళికతో అమలు చేయాలని సూచించారు. ఆసుపత్రిలో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అన్ని విభాగాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.వైద్యులు సమయానికి హాజరు కావడం నిర్ధారించుకోవాలని, వివిధ విభాగాలలో ఉన్న ఖాళీలను అవుట్‌సోర్సింగ్ విధానంలో త్వరితగతిన భర్తీ చేయాలని తెలిపారు. ఆసుపత్రి సేవలు మరింత మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.రాష్ట్ర స్థాయిలో డయాగ్నస్టిక్ హబ్ ద్వారా ఆరోగ్య పరీక్ష ఫలితాల అందజేతలో పెద్దపల్లి జిల్లా అగ్రస్థానంలో నిలిచిందని కలెక్టర్ తెలిపారు. ఈ స్థాయిని మరింత మెరుగుపర్చేందుకు గోదావరిఖని జనరల్ ఆసుపత్రికి అవసరమైన పరికరాల జాబితాను అంచనాలతో సిద్ధం చేసి సమర్పించాలని ఆదేశించారు. ఈఎన్‌టి విభాగానికి సంబంధించి అవసరమైన పరికరాలు సమకూర్చి, ఓపీ సేవలు ఆలస్యం లేకుండా రోగులకు అందించాలని సూచించారు. డాటా ఎంట్రీ ఆపరేటర్ల నియామకంపై ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించారు. ఆసుపత్రిలో లిఫ్ట్ సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వార్డులకు సంబంధించిన వైద్యులు ఎట్టి పరిస్థితుల్లోనూ డబ్బులు తీసుకోకుండా ఉచిత వైద్య సేవలు అందించాలని స్పష్టం చేశారు. పోస్టుమార్టం ప్రక్రియలు పూర్తిగా ఉచితంగా జరగాలని, ఎవరైనా డబ్బులు తీసుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఫోరెన్సిక్ విభాగంలో వైద్యుల కొరత ఉన్నందున అవసరానికి అనుగుణంగా సిబ్బందిని నియమించుకోవాలని సూచించారు.ఆరోగ్యశ్రీ పథకం కింద వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలని, ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రతి రోగికి ఉచితంగా మరియు మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు.ఆసుపత్రి పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని, వ్యర్థాల నిర్వహణ సక్రమంగా ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఆసుపత్రికి కలెక్టర్ అందజేసిన 20 ఏసీలు, 23 ఫ్రిజ్‌లను రోగుల అవసరాలకు అనుగుణంగా సమర్థవంతంగా వినియోగించుకోవాలని, రోగులు, వారి బంధువులు ఎవరూ నిల్చోకుండా అందరూ కూర్చునే విధంగా తగిన సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.

ఆసుపత్రి నుంచి వచ్చే బయోడిగ్రేడబుల్ చెత్త నిబంధనల ప్రకారం డిస్పోస్ చేయాలని కలెక్టర్ సూచించారు. వివిధ విభాగాల హెచ్ ఓ డి లు ప్రతి నెల ఎన్ని ఆపరేషన్స్ చేస్తున్నారో రికార్డు అందించాలని కలెక్టర్ తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# మా పిల్లలకు భద్రత అవసరం లేదా...?

● టెంకంపేటలో విద్యార్థుల తల్లిదండ్రుల ప్రశ్న.

**రాయపోల్, ఏప్రిల్ 7:** ఒకే మండలం... ఒకే విధానాలు... కానీ అమలు మాత్రం అసమానంగానా.....! రాయపోల్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీ గోడల కోసం పంపిన ప్రతిపాదనలు ఫలితమిచ్చిన తీరు... మండలంలో ప్రహరీ గోడలు లేని అన్ని పాఠశాలలకు గోడలు మంజూరయ్యాయి. అయితే టెంకంపేట గ్రామంలోని ప్రాథమిక పాఠశాల మాత్రం ఈ జాబితాలో లేకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

పాఠశాల చుట్టూ ప్రహరీ గోడ లేకపోవడంతో చిన్నారులు భద్రతా సమస్యల మధ్య చదువులు కొనసాగించాల్సి వస్తోంది.పాఠశాల ప్రాంగణంలోకి ఎవరైనా సులభంగా ప్రవేశించగలగడం, పశువులు తిరగడం వంటి పరిస్థితులు నిత్యకృత్యంగా మారాయి.దీంతో తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇక ఇతర గ్రామాల్లో పిల్లలు భద్రతతో చదువుకుంటుంటే, టెంకంపేట పిల్లలు మాత్రం అసురక్షిత వాతావరణంలో విద్యను అభ్యసించడం ఎంతవరకు సమంజసం? "మా పిల్లలు కూడా అదే ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు కదా...

మరి వారికి ఈ నిర్లక్ష్యం ఎందుకు?"అని గ్రామస్థులు నిలదీస్తున్నారు.

ఇది కేవలం ఒక గోడ సమస్య కాదు... చిన్నారుల భద్రత, వారి భవిష్యత్తుకు సంబంధించిన అంశం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, టెంకంపేట ప్రాథమిక పాఠశాలకు తక్షణమే ప్రహరీ గోడ మంజూరు చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.




# ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా రాయపోలకు రాష్ట్ర స్థాయి గౌరవం

**రాయపోల్, ఏప్రిల్ 7:** ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని రాయపోల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రాష్ట్ర స్థాయిలో విశేష గుర్తింపు పొందింది.మాతాశిశు ఆరోగ్య సంరక్షణ, అసంక్రామిక వ్యాధుల సేవలు మరియు ×ఎ×ూ ఆన్‌లైన్ సేవలలో ఉత్తమ సేవలు అందించినందుకు రాష్ట్రంలోనే ఉత్తమ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంగా ఎంపికైంది.

ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతి లో నిర్వహించిన కార్యక్రమంలో గౌరవ ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజ నరసింహ మరియు కుటుంబ సంక్షేమ కమిషనర్ క్రిష్టినా చోంగతు చేతుల మీదుగా ఈ అవార్డును రాయపోల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మహారాజు బల్లా కు ప్రదానం చేశారు.అలాగే గజ్వేల్ డివిజన్ పరిధిలో ఉత్తమ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌గా రాయపోల్ మండలంలోని లింగారెడ్డిపల్లి ఎంపికైంది. ఈ సందర్భంగా లింగారెడ్డిపల్లి ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌కు చెందిన మీనా డాక్టర్ ప్రియాంక మరియు హెల్త్ అసిస్టెంట్ ప్రేమ కు కూడా గౌరవ ఆరోగ్య శాఖ మంత్రి చేతుల మీదుగా పురస్కారాలు అందజేశారు.

# జర్మనీ దేశ కే ఎస్ డబ్ల్యూ బృందం గ్రేటర్ వరంగల్ సందర్శన.

**గ్రేటర్ వరంగల్ ఏప్రిల్7( సమయం న్యూస్). :** జర్మనీ దేశానికి చెందిన కే ఎఫ్ డబ్ల్యూ బృంద ప్రతినిధులతో మంగళవారం గ్రేటర్ వరంగల్ ప్రధాన కార్యాలయంలోని మేయర్ కాన్ఫరెన్స్ హాల్ లో ఏర్పాటు చేసిన దృశ్య మాధ్యమ సమీక్షా సమావేశం నకు ముఖ్య అతిథిగా హాజరైన నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్... ఈ సందర్భం గా నగరానికి చెందిన అండర్ డ్రైనేజీ, వేస్ట్ టు ఎనర్జీ, సి అండ్ డి ప్రాజెక్టుల సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)లను దృశ్యరూప ప్రదర్శన ద్వారా కే ఎఫ్ డబ్ల్యూ ప్రతినిధులకు అధికారులు వివరించారు. ఈ కార్యక్రమం లో ఇంచార్జి ఎస్ ఈ శ్రీనివాస్ రావు, అదనపు కమిషనర్ చంద్రశేఖర్, సి ఎం హెచ్ ఓ డా.రాజారెడ్డి, సి హెచ్ ఓ రమేష్ ఇంచార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్ డిప్యూటీ కమిషనర్ లు ప్రసన్న రాణి సమ్మయ్య (అడ్మిన్), బిర్రు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

# జిల్లాలో పరిపాలన సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు

● జిల్లా పరిషత్ భవన నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలి

● జిల్లా కలెక్టర్ దీపక్ తివారి



**వికారాబాద్,ఏప్రిల్,07(సమయం న్యూస్) :** జిల్లాలో పరిపాలన సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు జిల్లా పరిషత్ భవన నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలనీ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు.మంగళవారం జిల్లా పరిషత్ భవన నిర్మాణ పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భవనం నిర్మాణం ద్వారా అన్ని విభాగాలను ఒకే చోట సమీకరించి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అవకాశం ఉంటుందని,నిర్మాణ పనుల పురోగతిని సమీక్షిస్తూ, పనులు నాణ్యతతో పాటు నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.భవనంలో ఆధునిక సౌకర్యాలు, సమావేశ మందిరాలు, కార్యాలయ గదులు ఏర్పాటు చేస్తున్నట్లు,భవనం నిర్మాణంలో భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని, అవసరమైన మౌలిక సదుపాయాలు విద్యుత్, నీటి సరఫరా, పార్కింగ్ వసతులు కల్పించాలని అన్నారు.ఈ భవనం పూర్తయిన తరువాత ప్రజలకు పరిపాలనా సేవలు వేగవంతంగా, సులభంగా అందుతాయని అన్నారు. మొదటి అంతస్తు పనులు పూర్తి అయిన వాటికీ పేంటింగ్ పనులు పూర్తి చేయాలనీ అధికారులకు ఆదేశించారు.కలెక్టర్ తో పాటు జడ్ పి సి ఇ ఓ సుదీర్, ఉమేష్ కుమార్, డిప్యూటీ ఇ ఇ శ్రీనివాస్, సంబంధిత అధికారులు ఉన్నారు.

# జిల్లా అంబేడ్కర్ జాతర కమిటి ఎన్నిక




**ఊట్కూరు మండలం, ఏప్రిల్,07(సమయం న్యూస్) :** తిప్రసపల్లి గ్రామంలో జిల్లా అంబేడ్కర్ జాతర కమిటి మంగళవారం ఎన్నుకోవడం జరిగింది. జిల్లా అంబేడ్కర్ జాతర కమిటి మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి హజమ్మ. ఉమా అధ్వర్యంలో గ్రామ కమిటీ ని ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులుగా బాలప్ప ఉపాధ్యక్షులుగా చిన్న. నర్సింలుప్రధాన కార్యదర్శిగా వెంకటేష్ కోశాధికారిగా కనకప్ప సలహాదారులుగా గ్రామ పెద్దలు పాల్గొన్నారు. జిల్లా అంబేడ్కర్ జాతర కమిటి నీ సర్పంచ్ మాజి సర్పంచ్ అధ్వర్యంలో వేయడం జరిగింది. నారాయణపేట జిల్లాలో అంబేడ్కర్ జాతర ను గ్రామం నుండి అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అంబేద్కర్ ఆలోచన విధానాన్ని అన్నీ గ్రామాల్లో ప్రచారం చేసి అణగారిన వర్గాల ప్రజలు సంఘటితం కోసం జాతరను నిర్వహిస్తున్నామని గ్రామ ప్రజలు మహిళలు యువకులు అందరు పాల్గొని విజయవంతం చేయాలని హజమ్మ కమిటీ నీ ఉద్దేశించి మాట్లాడటం జరిగింది

# ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఉచిత దంత వైద్య శిబిరం




**బాన్సువాడ, ఏప్రిల్ 7 (సమయం న్యూస్):** ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ కామారెడ్డి శాఖ ఆధ్వర్యంలో బాన్సువాడ మండలంలోని ఎంపీపీఎస్ కోన బాన్సువాడ పాఠశాలలో విద్యార్థులకు ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించి, పళ్ళ సమస్యలు ఉన్న వారికి ఉచితంగా చికిత్స అందించడంతో పాటు అవసరమైన మందులను పంపిణీ చేశారు.

**చిన్నారుల్లో పెరుగుతున్న దంత సమస్యలు:** ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు డాక్టర్ జీవన్ మాట్లాడుతూ చిన్ననాటి నుంచే పళ్ళ సమస్యలు అధికమవుతున్నాయని, దీని ప్రభావంతో విద్యార్థులు సరైన ఆహారం తీసుకోలేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచిత వైద్య సేవలు అందించడం తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ శిబిరం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా నిలిచిందని అన్నారు.ఈ కార్యక్రమంలో దంత వైద్యులు డాక్టర్ అచ్చుకట్ల జీవన్, డాక్టర్ ఎం. అనిల్ రెడ్డి, డాక్టర్ రాకేష్, డాక్టర్ సందీప్, డాక్టర్ శ్రావణ్ పాల్గొన్నారు. అలాగే పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహేందర్ మరియు ఉపాధ్యాయ బృందం కూడా హాజరయ్యారు.

# రెండు తులాల పుస్తెలతాడు లాక్కొని పారిపోయిన దొంగ

● కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాం- యాలాల ఎస్సై విఠల్ రెడ్డి



**యాలాల మండలం, ఏప్రిల్,07(సమయం న్యూస్) :** మంగళవారం అందాజా ఉదయం ఎనిమిది గంటల సమయంలో ఫిర్యాదురాలు అయిన మండల శ్యామమ్మ భర్త మండల ఎల్లారెడ్డి వయసు 60 సంవత్సరాలు నివాసం సంగమేశ్వర కాలనీ కూకట్ రోడ్ యాలాల మండలం బాధితులు తెలిపిన వివరాల ప్రకారం రోజు మాదిరిగానే ఉదయం ఆరు గంటల సమయంలో నేను మా ఇంటి ముందటి వాకిలిలో జాడు కొడుతుండగా ఎవరో గుర్తు తెలియని వ్యక్తి తెల్లని షర్ట్ నల్లని ప్యాంటు ధరించిన వ్యక్తి వెనకాల నుండి వచ్చి నా మెడలో ఉన్న రెండు(02) తులాల పుస్తెలతాడు లాక్కొని పారిపోతుండగా నేను అరవగా రైల్వే ట్రాక్ వైపు పారిపోయినట్లు బాధితురాలు తెలపడం జరిగింది. అట్టి వ్యక్తిని చూస్తే నేను గుర్తుపట్టగలను నా మెడలో రెండు తులాల వస్తువులతాడు లాక్కెళ్ళిన దొంగిలించిన వ్యక్తిపై చర్య తీసుకోవాలని పోలీసు లకు ఫిర్యాదు ఇవ్వడం జరిగింది ఇట్టి ఫిర్యాదు పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విఠల్ రెడ్డి తెలిపారు.

# మధ్యవర్తులను నమ్మవద్దు ప్రజల సమస్యలకు నేరుగా పరిష్కారం.

● జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

● ప్రజావాణి ద్వారా నేరుగా సమస్యల పరిష్కారం



**పెద్దపల్లి, ఏప్రిల్ 07:( సమయం న్యూస్):** ప్రజల సమస్యల పరిష్కారానికి ఎటువంటి మధ్యవర్తులు అవసరం లేదని జిల్లా కలెక్టర్ శ్రీ కోయ శ్రీ హర్ష మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు సేవలు అందించే పేరుతో కొంతమంది మధ్యవర్తులు మోసాలకు పాల్పడుతున్నట్లు గమనించామని పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా కొందరు వ్యక్తులు భూ భారతి సమస్యలు పరిష్కరిస్తామని, ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు వంటి ప్రభుత్వ పథకాలలో ఎంపిక చేస్తామని చెప్పి డబ్బులు వసూలు చేస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. ఇలాంటి వ్యక్తులకు ఎటువంటి అధికారిక గుర్తింపు లేదని, వారు ప్రజలను మోసం చేస్తున్నారని స్పష్టం చేశారు. ఎవరైనా సమస్య పరిష్కారం పేరుతో డబ్బులు డిమాండ్ చేస్తే ఒక్క పైసా కూడా ఇవ్వవద్దని ప్రజలకు సూచించారు. అలాంటి ఘటనలు ఎదురైతే వెంటనే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని కోరారు. ప్రజలు తమ సమస్యలను ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో నేరుగా జిల్లా కలెక్టర్ లేదా ఉన్నతాధికారులకు తెలియజేయవచ్చని తెలిపారు. అలాగే బుధవారం నుండి శుక్రవారం వరకు మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు జిల్లా కలెక్టర్ ప్రజలను కలుసుకునే అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ సమయాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మధ్యవర్తులను నమ్మి డబ్బులు కోల్పోకుండా జాగ్రత్తగా ఉండాలని జిల్లా ప్రజలకు కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

# తరచుగా జరిగే ప్రమాదాలను అరికట్టేందుకు ఎస్సైకి వినతి పత్రం

● ప్రమాదాలు కాకుండా ఒక కానిస్టేబుల్ ను నియమించమని విన్నపం

● రెండో వార్డు మాజీ కౌన్సిలర్ మధుసూదన్ యాదవ్...



**కొడంగల్ మున్సిపల్, ఏప్రిల్,07(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా కొడంగల్ పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ కూడలి వెడల్పు తక్కువగా ఉన్నందువలన తరచుగా ప్రమాదాలు సంభవిస్తున్నాయి తరచుగా జరిగే ప్రమాదాలు అరికట్టేందుకు ప్రతిరోజు అంబేద్కర్ కూడలిలో ఒక కానిస్టేబుల్ కేటాయించాలని స్థానిక పోలీస్ స్టేషన్ లో ఎస్సైని కోరడం జరిగింది. నిన్న పాఠశాలకు వెళ్తున్న పసిపాప లారీ ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోయిన ఘటన హృదయ విధారకం కాబట్టి ప్రజల ప్రాణాలకు రక్షణగా ప్రమాదాల నివారణకు అరికట్టగా మీ వంతు బాధ్యతగా అంబేద్కర్ కూడలిలో ప్రతిరోజు ఒక కానిస్టేబుల్ ను నియమించగలరని ఎస్సై సత్యనారాయణ ను కలిసి వినతి పత్రం అందించి,విన్నవిస్తున్న రెండో వార్డు మాజీ కౌన్సిలర్ మధుసూదన్ యాదవ్, తదితరులు

# ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందేలా పని చేయాలి

● జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష
● విద్య, ఆరోగ్యం, రెవెన్యూ సేవల్లో నాణ్యతపై ప్రత్యేక దృష్టి
● పెండింగ్ దరఖాస్తులు తక్షణమే పరిష్కరించాలి
● విద్యార్థుల ఆరోగ్యం అత్యంత ప్రాధాన్యత అంశం
● జూలపల్లి మండలంలో విస్తృతంగా పర్యటించిన జిల్లా కలెక్టర్





**జూలపల్లి, ఏప్రిల్ 07(సమయం న్యూస్) :** జూలపల్లి మండలంలో ప్రభుత్వ కార్యాలయాలు ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించేలా పనిచేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష జూలపల్లి మండలంలోని తేలుకుంట గ్రామం లోని కేజీబీవీ పాఠశాల, కళాశాల, పెద్దాపూర్ తెలంగాణ మోడల్ స్కూల్, జూలపల్లి తహసిల్దార్ కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పి. హెచ్.సి. )లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష,కేజీబీవీలో విద్యార్థినులతో ముచ్చటించి, విద్యా బోధన, భోజన నాణ్యతపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు ఉన్నాయా అని విచారించగా, ఎటువంటి ఇబ్బందులు లేవని తెలిపారు. పెద్దాపూర్ తెలంగాణ మోడల్ స్కూల్ లో వంటశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, వంట సిబ్బంది ఆరోగ్యకరమైన, పోషకాహారంతో కూడిన ఆహారం సిద్ధం చేయాలని ఆదేశించారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల ఆరోగ్యాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకోవాలని సూచించారు. జూలపల్లి తహసిల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. భూ భారతి దరఖాస్తులను సమయానికి డిస్పోజ్ చేయాలని, రిజిస్ట్రేషన్ ప్రక్రియను స్లాట్ వారీగా పూర్తి చేయాలని సూచించారు. ప్రజలకు సేవలందించడంలో ఆలస్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జూలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఓపీ వివరాలను పరిశీలించిన కలెక్టర్, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. విధుల్లో సమయపాలన పాటించడం తో ముఖ్యంగా ఓపీ సమయాల్లో వైద్యులు తప్పనిసరిగా హాజరై ఉండాలని ఆదేశించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రేటర్ వరంగల్ అభివృద్ధికి అంతర్జాతీయ భాగస్వామ్యం కీలకం

● నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి
● కేఎఫ్‌డబ్ల్యూ ప్రతినిధులతో దృశ్య మాధ్యమ సమీక్షా సమావేశం
● యూజీడి ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి



**గ్రేటర్ వరంగల్ ఏప్రిల్7( సమయం న్యూస్). :** గ్రేటర్ వరంగల్ అభివృద్ధికి అంతర్జాతీయ భాగస్వామ్యం అత్యంత కీలకమని నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి అన్నారు. జర్మనీ దేశానికి చెందిన కేఎఫ్‌డబ్ల్యూ సంస్థ ప్రతినిధులతో మంగళవారం గ్రేటర్ వరంగల్ ప్రధాన కార్యాలయంలోని మేయర్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన దృశ్య మాధ్యమ సమీక్షా సమావేశంలో మేయర్, హన్మకొండ జిల్లా కలెక్టర్/జీడబ్ల్యూఎంసీ ఇన్‌చార్జ్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్‌తో కలిసి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడి) ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను అధికారులు దృశ్యరూప ప్రదర్శన ద్వారా కేఎఫ్‌డబ్ల్యూ ప్రతినిధులకు వివరించారు. మేయర్ మాట్లాడుతూ, వరంగల్ నగరం కాకతీయుల వైభవాన్ని ప్రతిబింబించే చారిత్రక ప్రాధాన్యత కలిగిన నగరమని, తెలంగాణలో హైదరాబాద్ తర్వాత రెండవ అతిపెద్ద నగరంగా వేగంగా అభివృద్ధి చెందుతోందని తెలిపారు. నగరాన్ని శుభ్రమైన, సుస్థిర నగరంగా తీర్చిదిద్దేందుకు ఆధునిక మౌలిక వసతుల విస్తరణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దూరదృష్టితో వరంగల్ నగర అభివృద్ధికి అపారమైన నిధులు కేటాయిస్తూ, నగరాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తున్నారని మేయర్ పేర్కొన్నారు. ముఖ్యంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మరియు స్ట్రామ్ వాటర్ డ్రైన్ ప్రాజెక్టులకు రూ. 5,725.40 కోట్ల నిధులు మంజూరు చేయడం ఆయన సంకల్పానికి నిదర్శమని తెలిపారు. యూజీడి ప్రాజెక్టుకు సంబంధించిన టెండర్ ప్రక్రియ పూర్తి అయి, త్వరలోనే పనులు ప్రారంభం కానున్నాయని మేయర్ వెల్లడించారు. ఈ ప్రాజెక్టు నగర పారిశుధ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. అంతర్జాతీయ స్థాయి సంస్థ అయిన కేఎఫ్‌డబ్ల్యూ సహకారంతో యూజీడి ప్రాజెక్టును సమ-ర్థవంతంగా అమలు చేయగలమని, వారి సాంకేతిక పరిజ్ఞానం మరియు అనుభవం నగరాభివృద్ధికి ఎంతో ఉపయోగపడుతుందని మేయర్ ఆశాభావం వ్యక్తం చేశారు. హన్మకొండ జిల్లా కలెక్టర్/జీడబ్ల్యూఎంసీ ఇన్‌చార్జ్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ, యూజీడి ప్రాజెక్టు విజయవంతమైన అమలుకు శాఖల మధ్య సమన్వయం కీలకమని అన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందిస్తూ, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. కేఎఫ్‌డబ్ల్యూ బృందం అందించిన సూచనలు ప్రాజెక్టు నాణ్యతను మరింత మెరుగుపరచడంలో సహాయపడతాయని పేర్కొన్నారు. కేఎఫ్‌డబ్ల్యూ ప్రతినిధులు మాట్లాడుతూ, యూజీడి ప్రాజెక్టుపై సమగ్రంగా వివరాలు అందించారని, రాబోయే రోజుల్లో మరిన్ని సాంకేతిక అంశాలను పరిశీలించి అవసరమైన సూచనలు అందిస్తామని తెలిపారు. అనంతరం కేఎఫ్‌డబ్ల్యూ ప్రతినిధుల బృందాన్ని మేయర్ కలెక్టర్ లు శాలువాలు, పూల మొక్కలతో సత్కరించి నగర కీర్తిని చాటే కాకతీయ కళా తోరణాలతో కూడిన ప్రతిమలను బహుకరించారు. ఈ కార్యక్రమం లో కే ఎఫ్ డబ్ల్యూ ప్రతినిధులు పరిమల్, రుచి, నితిన్ తో పాటు ఇంచార్జి ఎస్ ఈ శ్రీనివాస్ రావు సి ఎం హెచ్ ఓ డా. రాజారెడ్డి సి హెచ్ ఓ రమేష్ ఇంచార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్ డిప్యూటీ కమిషనర్ లు ప్రసన్న రాణి సమ్మయ్య (అడ్మిన్) బిర్రు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో మిరప తోటల సందర్శన

-- రైతులకు శాస్త్రీయ యాజమాన్య పద్ధతులపై అవగాహన




**చిర్యాల ఏప్రిల్7( సమయం న్యూస్) :** మహబూబాబాద్ జిల్లా, మల్యాల ఉద్యాన పరిశోధన స్థానం నుండి జిల్లా ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో శాస్త్రవేత్త మరియు హెడ్ డా. ఏ. అడ్లూరి ప్రశాంత్ కుమార్ గారు చిట్యాల మండలం గోపాలపురం గ్రామంలో సాగవుతున్న మిరప తోటలను క్షేత్రస్థాయిలో సందర్శించారు. ఈ సందర్భంగా మిరప కోత అనంతరం చేపట్టాల్సిన సమగ్ర యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు విపులంగా వివరించారు. మిరప పంటలో దిగుబడి మరియు నాణ్యతను పెంచేందుకు సరైన పద్ధతుల్లో పంట అవశేషాల నిర్వహణ, నేల ఆరోగ్య సంరక్షణ, ఎరువుల సమతుల్య వినియోగం, కీటక-వ్యాధి నియంత్రణ చర్యల ప్రాముఖ్యతను వివరించారు. రైతులు ఆధునిక పద్ధతులను అనుసరించడం ద్వారా ఖర్చులను తగ్గించి లాభాలను పెంచుకోవచ్చని సూచించారు. అనంతరం జిల్లా ఉద్యానవన శాఖ కార్యాలయంలో కూరగాయల వాలంటీర్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణలో మెరుగైన సాగు పద్ధతులు, పంటల ఎంపిక, నీటి నిర్వహణ, మరియు పంటల రక్షణ అంశాలపై అవగాహన కల్పించారు. రాష్ట్రంలో కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అందిస్తున్న మార్గదర్శకాలను వివరించారు. ఈ సందర్భంగా రైతులకు కూరగాయల మినీ విత్తనాల ప్యాకెట్లను పంపిణీ చేసి, తోటల విస్తరణ చేపట్టాల్సిన సంరక్షణ చర్యలపై అవగహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి ఏ. సునీల్ కుమార్, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస రెడ్డి, ఉద్యాన అధికారి మణి, ఉద్యాన విస్తరణ అధికారులు మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజారోగ్య పరిరక్షణలో ఆశా కార్యకర్తల సేవలు అమూల్యమైనవని

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**భూపాల పల్లి ఏప్రిల్7( సమయం న్యూస్).** మంగళవారం టేకుమట్ల మండలం వెలిశాల గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆశా కార్యకర్తలకు ఆశా డే శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈ నెల 11వ తేదీ వరకు ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, వాటిని పక్కద్బందీగా అమలు చేయాలని వైద్య సిబ్బందికి ఆయన సూచించారు. ఆశా కార్యకర్తలు గ్రామ, మండల స్థాయిలో గర్భిణిలు సుఖ ప్రసవాలు జరిగేలా, ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తూ మాతా శిశు మరణాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రతి ఆసుపత్రిలో ఎంతమందికి వైద్య సేవలు అందిస్తున్నారు, ఏ ఏ ప్రాంతాల నుండి వైద్య సేవలకు వస్తున్నారని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు 70 మంది వరకు వైద్య సేవలకు వస్తున్నారని వైద్యులు తెలుపగా ఓపి సేవలు పెంచాలని సూచించారు. ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో పోషణ లోపం ఉన్న చిన్నారులు ఎంత మంది ఉన్నారు అని అడిగి తెలుసుకున్నారు. పోషణ లోపం ఉన్న చిన్నారులు లేరని తెలుపగా అభినందించారు. గ్రామం, మండలం వారిగా పోషణ లోపం ఉన్న చిన్నారుల జాభితా తయారు చేయాలని సూచించారు. బాల్యం నుండి ఆరోగ్యవంతమైన సమాజం తయారు కావాలని స్పష్టం చేసారు. ప్రజలకు ఆరోగ్యం పట్ల అవగహన కల్పించాలని సూచించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ల్యాబొరేటరీని పరిశీలించి, అందుబాటులో ఉన్న సౌకర్యాలు, పరీక్షల నిర్వహణపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ స్వరూప రాణి, ఎంపీడీవో అనిత, వైద్యులు డాక్టర్ నాగరాణి, హారిక, సర్పంచ్ తిరుపతి పాల్గొన్నారు.



# అర్ష్‌దీప్ సింగ్ 'ప్రేమ' జపం..

## మైదానంలో మెరిసిన సమ్రీన్ కౌర్!

## ఐపీఎల్ వేళ నెట్టింట వైరల్ అవుతున్న ఫోటోలు

**ముంబై:** మైదానంలో తన పదునైన యార్కర్లతో ప్రత్యర్థి బ్యాటర్ల వికెట్లను కూల్చే ఆ 'యార్కర్ కింగ్'.. ఇప్పుడు తనే ఒక అందగత్తె విసిరిన ప్రేమ వలలో చిక్కుకున్నాడా? టీమ్ ఇండియా యువ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ గురి ఇప్పుడు వికెట్ల మీద కంటే.. ఒక పంజాబీ ముద్దుగుమ్మ మీదనే ఎక్కువగా ఉందా? ప్రస్తుతం సోషల్ మీడియాలో వినిపిస్తున్న గుసగుసలు వింటే ఇది నిజమేననిపిస్తోంది. ఐపీఎల్ హడావిడిలో ఉన్న ఈ స్టార్ క్రికెటర్, ఒక పంజాబీ నటితో పీకల్లోతు ప్రేమలో మునిగితేలుతున్నాడనే వార్త ఇప్పుడు క్రీడా, సినీ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది.

### ఎవరీ సమ్రీన్ కౌర్?:

అర్ష్‌దీప్ మనసు గెలుచుకున్న ఆ అందగత్తె పేరు సమ్రీన్ కౌర్. పంజాబీ చిత్ర పరిశ్రమలో వర్ధమాన నటిగా రాణిస్తున్న సమ్రీన్.. తన నటనతోనే కాకుండా సోషల్ మీడియాలో తన గ్లామరస్ ఫోటోలతోనూ భారీగా ఫాలోయింగ్‌ను సంపాదించుకుంది. సంగీత వీడియోల్లో మెరుస్తూ కుర్రకారు గుండెల్లో సెగలు పుట్టిస్తున్న ఈ భామ, ఇప్పుడు అర్ష్‌దీప్ సింగ్ 'లేడీ లక్' గా మారిందని ఫ్యాన్స్ ఫిక్స్ అయిపోయారు.

### ప్రేమాయాణం బయటపడిందిలా..:

వీరిద్దరి మధ్య సంథింగ్ సంథింగ్ నడుస్తోందని అనుమానాలు రావడానికి ప్రధాన కారణం.. అర్ష్‌దీప్ ఇటీవల సోషల్ మీడియాలో పంచుకున్న ఒక ఫోటో. సమ్రీన్ చేతిలో చేయి వేసి ఉన్న ఫోటోను ఆయన పోస్ట్ చేయడంతో అభిమానుల కళ్లు బైర్లు కమ్మాయి. దానికి తోడు, పంజాబ్ కింగ్స్ మ్యాచ్‌లు జరుగుతున్నప్పుడు సమ్రీన్ గ్యాలరీలో ప్రత్యక్షం కావడం, పంజాబ్ జెర్సీ ధరించి అర్ష్‌దీప్‌ను ఉత్సాహపరచడం ఈ వార్తలకు మరింత బలాన్ని చేకూర్చింది.

### మౌనమే సమాధానమా?

అటు అర్ష్‌దీప్ కానీ, ఇటు సమ్రీన్ కానీ తమ రిలేషన్‌షిప్ గురించి ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. వీరిద్దరూ కేవలం డేటింగ్‌లో ఉన్నారా లేక సీరియస్ ప్రేమలో ఉన్నారా అనేది ప్రస్తుతానికి సస్పెన్సే! ఏదేమైనా, సినిమా తారలు – క్రికెటర్ల మధ్య ప్రేమాయాణాలు కొత్తేమీ కాకపోయినా.. ఈ పంజాబీ జోడీ కెమిస్ట్రీ మాత్రం నెట్టింట తెగ వైరల్ అవుతోంది. మరి ఈ 'యార్కర్ కింగ్' తన ప్రేమ విషయాన్ని ఎప్పుడు క్లీన్ బౌల్డ్ చేస్తాడో వేచి చూడాల్సిందే!







# విజృంభించిన రాజస్థాన్!

## ముంబైపై విజయం

## 11 ఓవర్లలో పరుగుల వరద

**చెలరేగి ఆడిన యశస్వి జైస్వాల్ • లక్ష్య ఛేదనలో చతికిలబడ్డ ముంబై • సత్తా చాటిన బౌలర్లు**

**గువహాటీ:** ఐపీఎల్ తాజా సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ తన జోరును ఏమాత్రం తగ్గించకుండా కొనసాగిస్తోంది. గువహాటీలోని బర్సపరా స్టేడియం వేదికగా మంగళవారం జరిగిన ఉత్కంఠభరిత పోరులో ముంబై ఇండియన్స్ ను చిత్తు చేసి అద్భుత విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. వర్షం కారణంగా ఇరు జట్లకు 11 ఓవర్ల చొప్పున కుదించిన ఈ మ్యాచ్‌లో అభిమానులకు అసలు సిసలైన పరుగుల పండగ దొరికింది. ఓపెనర్ యశస్వి జైస్వాల్ విధ్వంసకర ఇన్నింగ్స్‌కు తోడు బౌలర్లు సైతం కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో రాజస్థాన్ 27 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఐపీఎల్ లీగ్ దశలో భాగంగా జరిగిన ఈ మ్యాచ్‌లో బ్యాట్‌తో బంతితో సమిష్టిగా సత్తా చాటిన రాజస్థాన్ సొంత మైదానంలో దుమ్మురేపింది.

### వీరబాదుడు బాదారు

ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ముంబై ఇండియన్స్ కెప్టెన్ ముందుగా బౌలింగ్ ఎంచుకున్నాడు. వర్షం వల్ల ఓవర్లు తగ్గడంతో రాజస్థాన్ బ్యాటర్లు మొదటి బంతి నుంచే ముంబై బౌలర్లపై విరుచుకుపడ్డారు. ఓపెనర్లు క్రీజులో అడుగుపెట్టినప్పటి నుంచే బౌండరీల వర్షం కురిపించారు. ముఖ్యంగా యశస్వి జైస్వాల్ ముంబై బౌలర్లకు చుక్కలు చూపించాడు. అతడు కేవలం 32 బంతుల్లోనే అజేయంగా 77 పరుగులు చేసి జట్టుకు భారీ స్కోరు అందించాడు. అతనికి జతగా యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ కేవలం 14 బంతుల్లో 39 పరుగులు చేసి ఎడాపెడా షాట్లతో అలరించాడు. చివర్లో రియాన్ పరాగ్ సైతం 10 బంతుల్లో 20 పరుగులు చేయడంతో రాజస్థాన్ నిర్ణీత 11 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 150 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. ముంబై బౌలర్లలో అల్లా ఘజన్ఫర్ 2 ఓవర్లలో 21 పరుగులు ఇచ్చి రెండు వికెట్లు పడగొట్టాడు. శార్దూల్ ఠాకూర్ భారీగా పరుగులు సమర్పించుకున్నాడు.



### లక్ష్య ఛేదనలో చతికిల

రాజస్థాన్ నిర్దేశించిన 151 పరుగుల కఠినమైన లక్ష్యంతో బరిలోకి దిగిన ముంబై ఇండియన్స్‌కు ప్రత్యర్థి బౌలర్లు ఆదిలోనే భారీ షాక్ ఇచ్చారు. లక్ష్య ఛేదనలో కావాల్సిన రన్ రేట్ చాలా ఎక్కువగా ఉండటంతో ముంబై బ్యాటర్లు తీవ్ర ఒత్తిడికి గురై వరుసగా వికెట్లు పారేసుకున్నారు. షెర్ఫాన్ రూథర్‌ఫర్డ్ కేవలం 8 బంతుల్లో 25 పరుగులు చేసి కాసేపు ఆశలు రేపినా ఎక్కువ సేపు క్రీజులో నిలవలేకపోయాడు. నమన్ ధీర్ 13 బంతుల్లో 25 పరుగులు, తెలుగోడు తిలక్ వర్మ 10 బంతుల్లో 14 పరుగులు మాత్రమే చేసి పెవిలియన్ చేరారు. మిగతా బ్యాటర్లు ఎవరూ క్రీజులో కనీసం నిలదొక్కుకోలేకపోవడంతో ముంబై నిర్ణీత 11 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 123 పరుగులకే పరిమితమై ఓటమి పాలైంది. కట్టుదిట్టమైన బౌలింగ్ రాజస్థాన్ బౌలర్లు అత్యద్భుతమైన ప్రణాళికతో బౌలింగ్ చేసి ముంబై బ్యాటర్లను ముప్పుతిప్పలు పెట్టారు. నాంద్రే బర్గర్ 2 ఓవర్లలో 21 పరుగులు ఇచ్చి రెండు వికెట్లు పడగొట్టాడు. స్పిన్నర్ రవి బిష్ణోయ్ సైతం 2 ఓవర్లలో 25 పరుగులు మాత్రమే ఇచ్చి రెండు కీలక వికెట్లు సాధించాడు. అనుభవజ్ఞుడైన పేసర్ సందీప్ శర్మ 3 ఓవర్లలో 26 పరుగులిచ్చి రెండు వికెట్లతో ముంబై పతనాన్ని శాసించాడు. బౌలర్లందరూ సమిష్టిగా రాణించడంతో రాజస్థాన్ రాయల్స్ మరో అద్భుత విజయాన్ని అందుకుని పాయింట్ల పట్టికలో తన స్థానాన్ని మరింత పదిలం చేసుకుంది.

# సిడ్నీ వీధుల్లో 'వార్నర్' స్కిడ్..

**సిడ్నీ:** మైదానంలో బౌలర్ల గుండెల్లో వణుకు పుట్టించే ఆస్ట్రేలియా విధ్వంసకర బ్యాటర్, 'డేవిడ్ భాయ్'గా పిలుచుకునే డేవిడ్ వార్నర్ ఇప్పుడు పోలీసులకు చిక్కారు. అది కూడా మద్యం మత్తులో కారు నడుపుతూ అడ్డంగా దొరికిపోయారు. సిడ్నీలోని మరౌబ్రాలో జరిగిన ఈ ఘటన ఇప్పుడు అంతర్జాతీయ క్రికెట్ సర్కిల్స్‌లో సంచలనంగా మారింది. డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షల నుండి తప్పించుకోవాలని వార్నర్ వేసిన 'మాస్టర్ ప్లాన్' రివర్స్ కావడంతో ఆయన కటకటాల వెనక్కి వెళ్లాల్సి వచ్చింది.

- మద్యం మత్తులో చిక్కిన క్రికెట్ దిగ్గజం!
- రెండింతలు దాటిన ఆల్కహాల్ రీడింగ్
- పోలీసులను చూసి కారు పార్క్ చేసినా దొరికిపోయిన డేవిడ్ భాయ్
- పీఎస్ఎల్ ఆడే అవకాశంపై నీలినీడలు



### అసలేం జరిగిందంటే?

సిడ్నీలోని మరౌబ్రా ప్రాంతంలో న్యూ సౌత్ వేల్స్ పోలీసులు ఆదివారం సాయంత్రం సాధారణ తనిఖీలు చేపట్టారు. అయితే, పోలీసుల తనిఖీ కేంద్రాన్ని దూరం నుండే గమనించిన వార్నర్, పట్టుబడకుండా ఉండేందుకు తన కారును కొంచెం దూరంలోనే నిలిపివేసి పార్క్ చేశాడు. వార్నర్ ప్రవర్తనపై అనుమానం వచ్చిన పోలీసులు వెంటనే కారు వద్దకు వెళ్లి ఆయనకు శ్వాస పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలో ఆయన మద్యం సేవించినట్లు తేలడంతో పోలీసులు వెంటనే అదుపులోకి తీసుకున్నారు.

### రెండింతలు దాటిన రీడింగ్

మరౌబ్రా పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన రెండో పరీక్షలో వార్నర్ రక్తంలో ఆల్కహాల్ శాతం 0.104 గా నమోదైంది. ఆస్ట్రేలియా చట్టాల ప్రకారం ఉండాల్సిన పరిమితి కంటే ఇది రెండింతలు ఎక్కువ. దీంతో పోలీసులు ఆయనపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. అనంతరం బెయిల్‌పై విడుదలైనప్పటికీ, వచ్చే మే 7వ తేదీన ఆయన సిడ్నీలోని డౌనింగ్ సెంటర్ లోకల్ కోర్టులో హాజరుకావాల్సి ఉంది.

### పీఎస్ఎల్ ఆడేనా?:

ప్రస్తుతం పాకిస్థాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్ 2026)లో కరాచీ కింగ్స్ జట్టుకు సారథ్యం వహిస్తున్న వార్నర్, ఈస్టర్ సెలవుల నిమిత్తం స్వదేశానికి వచ్చారు. గురువారం పెషావర్ జల్మీతో జరగనున్న మ్యాచ్ కోసం ఆయన తిరిగి పాకిస్థాన్ వెళ్లాల్సి ఉంది. అయితే ఈ కేసుకు సంబంధించి కోర్టు విచారణలు ఉండటంతో ఆయన పీఎస్ఎల్ లీగ్‌లో తిరిగి ఆడతారా? లేదా? అనే దానిపై సందిగ్ధత నెలకొంది. కరాచీ కింగ్స్ కెప్టెన్ ఇలా వివాదంలో చిక్కుకోవడంతో ఆ జట్టు యాజమాన్యం కూడా పునరాలోచనలో పడింది.



# అవును పెళ్లయ్యింది.. నలుగురు పిల్లలు

**విమర్శకులకు నటి త్రిష ఘాటు రిప్లై**

కొన్ని రోజులుగా నటి త్రిష పేరు సోషల్ మీడియాలో వైరలవుతోన్న విషయం తెలిసిందే. నటుడు, టీవీకే అధినేత విజయ్‌తో ఆమె రిలేషన్‌లో ఉన్నట్లు వార్తలు వచ్చాయి. తాజాగా త్రిష సినిమాలు మానేస్తున్నారని నటుడు చిత్రా లక్ష్మణన్ ఓ యూట్యూబ్ ఇంటర్వ్యూలో చెప్పడం తీవ్ర చర్చకు దారితీసింది. దీనిపై ఆమె తనదైన స్టైల్‌లో కౌంటర్ ఇచ్చారు. ఇన్‌స్టా స్టోరీలో ఈ వ్యాఖ్యలపై పరోక్షంగా స్పందించారు. అవును సినిమాలు మానేశాను. ఒక పెద్ద వ్యాపారవేత్తను పెళ్లి చేసుకొని నలుగురు పిల్లల్ని కన్నాను. మీ ఊహాగానాలకు ఇది సరిపోతుందా?. ఈరోజు మీరు వార్తలు రాసుకోవడానికి ఇది చాలా.. మరేదైనా జోడించమంటారా' అంటూ వ్యంగ్యంగా రాసుకొచ్చారు.. దీంతో ఆమె సినిమాలు మానేయనున్నారంటూ వస్తోన్న వార్తలకు చెక్ పడినట్లైంది. అసలేం జరిగిందంటే.. యూట్యూబ్ వేదికగా ఓ నెటిజన్ అడిగిన ప్రశ్నకు చిత్రా లక్ష్మణన్ బదులిచ్చారు. ఇకపై సినిమాల్లో కొనసాగాలని త్రిష అనుకోవడం లేదని.. అవకాశాలనూ అందిపుచ్చుకోవడం లేదన్నారు. దీంతో ఎన్నో ఊహాగానాలు మొదలయ్యాయి. ఆమె పాలిటిక్స్‌పై ఫోకస్ పెట్టనున్నారని వార్తలు వచ్చాయి. తాజా పోస్ట్‌తో వీటికి తనదైన స్టైల్‌లో త్రిష బదులిచ్చారు. ప్రస్తుతం ఆమె సూర్య 'కరుప్పు'(తెలుగులో 'వీరభద్రుడు'), 'విశ్వంభర'లో నటిస్తున్నారు.



# ప్రభాస్‌తో ఆదిత్య ధర్ మూవీ

'ధురంధర్ 2' ఘన విజయం తర్వాత దర్శకుడు ఆదిత్య ధర్ పేరు ఇండియన్ సినిమా ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు సాధించి, రికార్డుల సునామీ సృష్టించడంతో ఆయన తదుపరి ప్రాజెక్ట్‌పై ఆసక్తి మరింత పెరిగింది. తాజా సమాచారం ప్రకారం, ఆదిత్య ధర్ ఇప్పుడు మరో భారీ ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుడుతున్నారని తెలుస్తోంది. టాలీవుడ్, కోలీవుడ్ ఇండస్ట్రీలను కలిపి పాన్ ఇండియా స్థాయిలో ఇండియన్ సినిమాను షేక్ చేసేలా ఓ మల్టీస్టారర్‌ను తెరకెక్కించాలనే ఆలోచనలో ఉన్నారట. ఆ చిత్రంలో ప్రభాస్,సూర్య కలిసి నటించబోతున్నారని బాలీవుడ్ సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ ప్రాజెక్ట్ హై వోల్టేజ్ మాస్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఉండబోతోందని టాక్. ఇద్దరు స్టార్ హీరోలు కావడంతో వారి పాత్రలకు సమాన ప్రాధాన్యం ఉండేలా పవర్‌ఫుల్ క్యారెక్టర్స్‌ను రూపొందిస్తున్నారని సమాచారం. కథ కూడా పాన్ ఇండియా రేంజ్‌లో ఉండి, దేశ విదేశాల్లోని పలు ఇంటర్నేషనల్ లొకేషన్స్‌లో షూటింగ్ ఎ÷-లాన్ చేస్తున్నారట.ప్రభాస్‌కు ఉన్న పాన్ ఇండియా మార్కెట్, సూర్యకు ఉన్న నటనా ప్రతిభ ఈ రెండు కలిస్తే బాక్సాఫీస్ వద్ద భారీ సంచలనం ఖాయం అని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. ముఖ్యంగా యాక్షన్ సీక్వెన్స్‌లు, ఎమోషనల్ డ్రామా మధ్య మంచి బ్యాలెన్స్ ఉండేలా స్క్రిప్ట్ సిద్ధం చేస్తున్నారట. అయితే ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. అయినప్పటికీ ఈ వార్తలు సోషల్ మీడియా, సినీ వర్గాల్లో వైరల్ అవుతూ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. ప్రభాస్, సూర్య కాంబినేషన్ నిజమైతే ఇది ఇండియన్ సినిమా చరిత్రలోనే ఒక క్రేజీ ప్రాజెక్ట్‌గా నిలుస్తుందని ఫ్యాన్స్ ఇప్పటికే అంచనాలు పెంచుకుంటున్నారు. ఇక అధికారిక ప్రకటన ఎప్పుడు వస్తుందో చూడాలి.






# అనన్య పాండే మూవీ చాంద్ మేరా దిల్

బాలీవుడ్ యువ నటి అనన్యా పాండే, 'కిల్' సినిమాతో మెప్పించిన లక్ష్య జంటగా నటిస్తున్న కొత్త సినిమా 'చాంద్ మేరా దిల్'. ఈ సినిమా మే 22న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా తాజాగా టీజర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. హైదరాబాద్ నేపథ్యంలో రాబోతున్న ఈ టీజర్ చూస్తుంటే.. ఇదొక స్వచ్ఛమైన క్యాంపస్ లవ్ స్టోరీ అని అర్థమవుతోంది. ముఖ్యంగా ఇంజనీరింగ్ కాలేజీలో ఆరవ్, చాందిని అనే ఇద్దరు విద్యార్థుల మధ్య మొదలైన ప్రేమ, ఆ తర్వాత వారి జీవితాల్లో ఎదురైన మలుపులు, బాధాకరమైన సంఘటనలను ఈ సినిమాలో చాలా ఎమోషనల్‌గా చూపించబోతున్నారు. మరో విశేషమేమిటంటే, ఈ సినిమా షూటింగ్ ఎక్కువ భాగం హైదరాబాద్‌లోనే జరిగింది, ఇది తెలుగు ప్రేక్షకులకు సినిమాపై మరింత ఆసక్తిని కలిగిస్తోంది. సచిన్-జిగర్ అందించిన మ్యూజిక్ సినిమాకు పెద్ద ప్లస్ కానుంది. నిజానికి ఈ సినిమా ఏప్రిల్‌లోనే రిలీజ్ కావాల్సి ఉంది, కానీ కొన్ని కారణాల వల్ల వాయిదా వేసి, ఇప్పుడు మే 22న థియేటర్లలోకి తీసుకురాబోతున్నారు.

Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. 98660 19778, 89789 60131



# ఆంధ్రజ్యోతి కథనాలు సరికాదు

**నేడు వాటి కార్యాలయాల ముందు నిరసనలు**

**ఏపీ శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స**

**విశాఖపట్నం, ఏప్రిల్ 7(సమయం న్యూస్):** ఏబీఎన్ ఆంధ్రజ్యోతి సంస్థల ఎండీ వేమూరి రాధాకృష్ణ వార్తా వ్యాఖ్యలను తాము ఖండిస్తున్నామని ఏపీ శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. ఎవరైనా విమర్శ చేస్తే విధాన పరంగా ఉండాలన్నారు. ఇందుకు నిరసనగా బుధవారం ఏపీలోని అన్ని జిల్లాల్లో ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కార్యాలయాల ఎదుట నిరసన కార్యక్రమం చేపడతామని స్పష్టం చేశారు. మంగళవారం విశాఖపట్నంలోని వైసీపీ కార్యాలయంలో బొత్స సత్యనారాయణ మీడియాతో మాట్లాడారు. మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు కలిపి మావిగాన్ అని వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చెప్పారని అన్నారు. రాజధాని పరిధిలో వీటిని తీసుకురమ్మని తాము అంటున్నామని.. ఇందులో తప్పు ఏం ఉందని చెప్పారు. తమ నాయకుడు అభిప్రాయాన్ని తాము గౌరవిస్తున్నామన్నారు. అమరావతికి తాము వ్యతిరేకం కాదని...అక్కడ దోపిడీకి మాత్రమే తాము వ్యతిరేకమని చెప్పుకొచ్చారు. కూటమి కృషితోనే భోగాపురం వచ్చిందని ఒప్పు కొంటున్నానని అన్నారు. తాము ఈ ఎయిర్‌పోర్టుకి అన్ని అనుమతులు తెచ్చామని..కానీ ఇప్పుడు ఎయిర్‌పోర్ట్‌కి దారి లేదని ప్రస్తావించారు. అందుకే తాము భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కి దారేదని అడుగుతున్నామన్నారు. రుషికొండ భవనాలు తమ కోసం ఉంచుతున్నారేమోనని అన్నారు. ఏపీలో పరిస్థితులు ఘోరంగా ఉన్నాయని చెప్పారు. మహిళలు రోజుకోకరు హత్యకు గురవుతున్నారని, వారిపై అత్యాచారాలు జరుగుతున్నాయని బొత్స సత్యనారాయణ ఆరోపించారు.

# ఆంధ్రజ్యోతిపై దాడి దుర్మార్గం

**తీవ్రంగా ఖండించిన మీడియా సంఘాలు**

**అమరావతి, ఏప్రిల్ 7(సమయం న్యూస్):** హైదరాబాద్‌లోని ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కార్యాలయంపై వైసీపీ నాయకులు దాడికి ప్రయత్నించడంపై మీడియా సంఘాలు స్పందించాయి. ఈ దాడిని ఐకేయూ, ఏపీయూడబ్ల్యూజే, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ అసోసియేషన్, ఆర్ఎన్ఏ న్యూఏజెన్సీలు తీవ్రంగా ఖండించాయి. ఒక మీడియా సంస్థను నిర్వహిస్తున్న వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఇలాంటి చర్యలకు సొంత పార్టీలోని వారిని ఉసిగొల్పటం మీడియా స్వేచ్ఛపై దాడిగా భావించక తప్పదని జర్నలిస్టు సంఘాల నేతలు డి.సోమసుందర్, ఐ.వి.సుబ్బారావు, ఏచూరి శివ (ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ అసోసియేషన్), ఆర్ఎన్ఏ చీఫ్ ఎడిటర్ అవ్వారు రఘు స్పష్టం చేశారు. ఏపీ రాజధానిగా మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు నగరాలను కలుపుతూ కొత్త రాజధానిని ఏర్పాటు చేయాలని.. దానికి మావిగన్ అనే పేరు పెట్టాలని వైసీపీ అధినేత వైఎస్ జగన్ ప్రతిపాదించారు. అది కూడా రాజధాని అమరావతి బిల్లు పార్లమెంట్ ఉభయ సభల్లో ఆమోదం పొందే క్రమంలో వైఎస్ జగన్ ఈ ప్రతిపాదన చేయడం విమర్శలకు తావిచ్చింది. నేపథ్యంలో ఆంధ్రజ్యోతి ఎండీ వేమూరి రాధాకృష్ణ తన కొత్త పలుకులో ప్రత్యేక కథనాన్ని రాశారు. దీనిపై వైసీపీ శ్రేణులు పెద్ద ఎత్తున మండిపడ్డాయి. అంతేకాకుండా రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఆదేశాలతో ఆ పార్టీలోని కీలక నేతలు వరుసగా ప్రెస్ మీట్లు పెట్టి.. స్పందించారు. అందులోభాగంగా మంగళవారం హైదరాబాద్ ఫిలింనగర్‌లోని ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కార్యాలయం వద్ద వైసీపీ శ్రేణులు ఆందోళన చేపట్టాయి.

# రూ.39,436 కోట్లతో విలువైన 31 ప్రాజెక్టులు

**చంద్రబాబు అధ్యక్షతన ఎస్ఐపీబీ ఆమోదం**

**అమరావతి, ఏప్రిల్ 7(సమయం న్యూస్):** సీఎం అధ్యక్షతన 16వ పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు ఎస్ఐపీబీ సమావేశం జరిగింది. రూ.39,436 కోట్ల విలువైన 31 ప్రాజెక్టులకు ఎస్ఐపీబీ ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టుల ద్వారా ప్రత్యక్షంగా 1,11,278 మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయి. అమరావతి క్వాంటం వ్యాలీలో 3 సంస్థల ఏర్పాటుకు ప్రోత్సాహక బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఏపీలో ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల తయారీపై ప్రత్యేక దృష్టి సారించాలని ఈ సందర్భంగా చంద్రబాబు సూచించారు. సాగు వ్యర్థాల సద్వినియోగం కోసం యూనిట్ల ఏర్పాటుకు ఎస్ఐపీబీ ఆమోదం తెలిపింది. ఆధునిక భద్రతా ప్రమాణాలతో పారిశ్రామిక ప్రాజెక్టులు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. రాయలసీమను సౌరవిద్యుత్ ఉత్పత్తి కేంద్రంగా తీర్చిదిద్దాలని ఈ సందర్భంగా అధికారులకు చంద్రబాబు దిశానిర్దేశర చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో 325 గిగావాట్ల సౌరవిద్యుత్ ఉత్పత్తికి అవకాశం ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. రానున్న రోజుల్లో సౌరవిద్యుత్ ఉత్పత్తి మరింత పెరిగేలా చర్యలు తీసుకోవాలని, సౌరవిద్యుత్ సామర్థ్యానికి అనుగుణంగా పెట్టుబడులు ఆకర్షించాలని సీఎం సూచించారు.

# ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ ఆస్పత్రుల సమ్మె విరమణ

**అమరావతి, ఏప్రిల్ 7(సమయం న్యూస్):** ఆంధ్రప్రదేశ్‌లో ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలోని స్పెషాలిటీ ఆసుపత్రుల్లో జరుగుతున్న సమ్మెను విరమించినట్లు స్పెషాలిటీ ఆసుపత్రుల అసోసియేషన్ ప్రకటించింది. ప్రభుత్వం కొద్దిసేపటి క్రితం ఇచ్చిన హామీల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు అసోసియేషన్ తెలిపింది. 10 రోజుల్లో వెయ్యి కోట్ల రూపాయలు చెల్లిస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీని ఆమోదించి సమ్మెను విరమించినట్లు ఆసుపత్రుల యాజమాన్య సంఘం ప్రకటించింది. 10 రోజుల్లో బకాయిలు చెల్లించని పక్షంలో మళ్లీ వైద్య సేవలను పూర్తిగా నిలిపివేస్తామని అసోసియేషన్ హెచ్చరించింది. ప్రభుత్వంతో జరిపిన చర్చల సమావేశం మినిట్స్‌ను కూడా కొద్ది సేపటి క్రితం అసోసియేషన్‌కు అధికారులు పంపించారు. ఈ మినిట్స్‌లో ఇచ్చిన హామీలు, చర్చల వివరాలు స్పష్టంగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం సమ్మె విరమణతో ఎన్టీఆర్ వైద్య సేవ పథకం కింది అన్ని సేవలు పునఃప్రారంభం కానున్నాయి.

# నీటి సంరక్షణకు 'జలధార' ఉద్యమం

- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత
- రాష్ట్ర వ్యాప్తంగా వంద రోజుల కార్యాచరణ
- కాలువలు, చెరువుల్లో పూడికతీతలు, మరమ్మతులు
- అమరావతిపై విషం కక్కుతున్న జగన్
- ఇది తప్పు అన్నందుకు పెట్రేగిపోతున్న జగన్ బ్యాచ్
- మీడియా సంస్థలు, ప్రజలపై వైసీపీ -దాడులు గర్హనీయం
- చూస్తూ ఊరుకునేది లేదు
- మంత్రి సవిత హెచ్చరిక




**అనంతపురం, ఏప్రిల్ 7 (సమయం న్యూస్):** నీటితోనే సంపద సృష్టించొచ్చాలనేది సీఎం చంద్రబాబు సంకల్పమని, అందుకనే ప్రతి నీటి బొట్టునూ సద్వినియోగం చేసుకోవాలన్న లక్ష్యంతో జలధార కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చెరువులు, సాగునీటి కాలువల్లో పూడికతీత, మరమ్మతులు, ఇంకుడు గుంతల నిర్మాణం వంటి పనులను ఈ కార్యక్రమంలో చేపట్టనున్నారు. రాష్ట్రంలో నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపుదలకు రైతులు, సాగునీటి సంఘాల భాగస్వామ్యంతో కలిసి వంద రోజుల ప్రణాళికలను రూపొందించారన్నారు. శ్రీసత్యసాయి జిల్లా సోమందేపల్లి మండలం చాలకూరు గ్రామం సమీపంలోని చెరువులో సోమవారం ఏర్పాటు చేసిన జలధార కార్యక్రమంలో మంత్రి సవిత పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో నీటి సంరక్షణకు పెద్ద ఎత్తు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా నీటి సంరక్షణకు 100 రోజుల పాటు జలధార ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఈ కార్యాచరణ ద్వారా రాష్ట్రంలో నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపుదలతో ప్రతి ఎకరాకూ సాగునీరందించాలన్నది ప్రధాన ఉద్దేశమన్నారు. వంద రోజుల పాటు సాగే ఈ కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చెరువులు, సాగునీటి కాలువల్లో పూడికతీతలతో పాటు మరమ్మతులు, ఇంకుడు గుంతలు తవ్వుతామన్నారు. ప్రతి నీటి బొట్టునూ ఒడిసిపట్టి, భూగర్భ జలాలను పెంచడం, తక్కువ నీటితో ఎక్కువ పంట పండించే విధానాన్ని (డ్రిప్ ఇరిగేషన్) ప్రోత్సహించడం, చెరువుల్లోని మట్టిని పొలాలకు తరలించడం, పంట కుంటల నిర్మించడం వంటి కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. నీటి సంరక్షణను ఉద్యమం చేపట్టామని, రైతులు, సాగునీటి సంఘాల భాగస్వామ్యంతో నీటి సంరక్షణ ఉద్యమం చేపట్టామన్నారు. రాష్ట్రాన్ని కరవు రహిత ప్రాంతంగా తీర్చిదిద్దాలన్నదే కూటమి ప్రభుత్వం ప్రధాన ఉద్దేశమన్నారు. అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంట్ ఆమోదించడం, ఆ వెంటనే రాష్ట్రపతి గెజిట్ నోటిఫికేషన్ విడుదల కావడంతో జగన్, ఆయన పార్టీ నేతలుసహించలేకపోతున్నారని మంత్రి సవిత మండిపడ్డారు. మావిగన్ అంటూ అమరావతిపై జగన్ మరోసారి విషం కక్కారన్నారు. రాజధానిపై పూటకో మాట, గంటకో మాట ఆడుతుండడంతో ప్రజలు జగన్ పై తీవ్రంగా విరుచుకుపడుతున్నారన్నారు. అమరావతిపై కుట్రలు పన్నడం తప్పు అని చెప్పడంతో, వైసీపీ బ్యాచ్ సహించలేకపోతోందన్నారు. మీడియా సంస్థలపైనా, ప్రజలపైనా దాడులకు దిగుతున్నారని మండిపడ్డారు. ప్రజాభీష్టానికి అనుగుణంగా వ్యవహరించాల్సిందేపోయి, జగన్, ఆయన అనుచరులు చేస్తున్న దౌర్జన్యాలను, దాడులను చూస్తూ ఊరుకునేది లేదని మంత్రి సవిత హెచ్చరించారు. జలధార కార్యక్రమం అనంతరం చెరువు పక్కనే ఉన్న వేరు శనగ పంట భూములను మంత్రి సవిత పరిశీలించారు. ఎంతమేర సాగు చేశారు... పంట దిగుబడి గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతుల సంక్షేమానికి సీఎం చంద్రబాబు అధిక ప్రాధాన్యమిస్తున్నారన్నారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు తీసుకొంటున్నారన్నారు. అన్నదాత సుఖీభవ నిధులతో డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు అందజేస్తున్నారన్నారు. రూ.30 వేల కోట్లతో రాయలసీమను హార్టీకల్చర్ హబ్ గా అభివృద్ధి చేస్తున్నారని, రాయసీమలో సాగునీటి ప్రాజెక్టులకు నిధులు వెచ్చిస్తున్నారని మంత్రి సవిత వెల్లడించారు. కూటమి ప్రభుత్వ పాలనపై రైతులు సంతృప్తి వక్తంచేయడంతో మంత్రి ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆరోగ్యశ్రీ బకాయిలు తక్షణం చెల్లించాలి

- 'ఆశ' ప్రతినిధులను చర్చలకు పిలవాలి
- ఇన్సూరెన్స్ మోడల్ వెనుక కమీషన్ల కుట్ర
- మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు



**శ్రీకాకుళం, ఏప్రిల్ 7 (సమయం న్యూస్):** రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోయి పేద రోగుల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నా కూటమి ప్రభుత్వంలో చలనం లేదని వైయస్సార్‌సీపీ డాక్టర్స్ సెల్ అధ్యక్షుడు, మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ధ్వజమెత్తారు. మంగళవారం శ్రీకాకుళంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ (ఆశ) ప్రతినిధులను చర్చలకు పిలిచి, పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కూటమి అధికారంలోకి వచ్చిన ఈ కొద్ది కాలంలోనే రెండుసార్లు ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోవడం దురదృష్టకరమని అప్పలరాజు పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం 45 రోజుల్లో చెల్లించాల్సిన బిల్లులు.. 450 రోజులు దాటినా చెల్లించకపోవడంతో బకాయిలు రూ. 3,200 కోట్లకు చేరాయని విమర్శించారు. అత్యవసర సేవలు అందక ప్రజలు అల్లాడుతుంటే, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అవేవీ పట్టించుకోకుండా 'అమరావతి భజన'లో మునిగిపోయారని మండిపడ్డారు. ఆరోగ్యశ్రీని ప్రస్తుతం ఉన్న ట్రస్ట్ మోడల్ నుంచి ఇన్సూరెన్స్ మోడల్‌లోకి మార్చాలనే ప్రభుత్వ ప్రతిపాదనను ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. ఇది కేవలం బినామీ కంపెనీలకు కమీషన్లు కట్టబెట్టేందుకేనని ఆరోపించారు. ఇన్సూరెన్స్ కంపెనీలు క్లెయిమ్‌లను రిజెక్ట్ చేస్తే రోగులు ఎవరికి చెప్పుకోవాలని ప్రశ్నించారు. వైయస్సార్‌సీపీ హయాంలో ప్రొసీజర్లను 2 వేల నుండి 3,257కి పెంచామని, ఇన్సూరెన్స్ మోడల్‌లో ఇవన్నీ సాధ్యం కాదని ఆయన స్పష్టం చేశారు. చంద్రబాబు చెప్పే అమరావతి మోడల్ ఆచరణ సాధ్యం కాదని, అది పూర్తవ్వడానికి వందేళ్లు పడుతుందని విమర్శించారు. లక్షల కోట్ల అప్పులతో రాజధాని కడతాననడం అవివేకమని, దానికి ప్రత్యామ్నాయంగా వైయస్ జగన్ గారు సూచించిన 'మావిగన్' (మచిలీపట్నం-విజయవాడ-గుంటూరు) కారిడార్ రాష్ట్రానికి నిజమైన గ్రోత్ ఇంజిన్ అవుతుందని పేర్కొన్నారు. వంశధార ట్రిబ్యునల్ విషయంలో టీడీపీ నేతలు అనవసర సంబరాలు చేసుకుంటున్నారని అప్పలరాజు ఎద్దేవా చేశారు. ఒడిశా ప్రభుత్వం సుప్రీంకోర్టులో వేసిన ఎస్ఎల్‌పీలపై కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయలేదని, నేరడి బ్యారేజీ సాధనలో ప్రభుత్వం విఫలమైందని ధ్వజమెత్తారు. తక్షణమే ఆరోగ్యశ్రీ సమస్యలను పరిష్కరించి పేదలకు వైద్యం అందేలా చూడాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# సీమ నడిబొడ్డున టిప్పు సుల్తాన్ పేరా?

**బీజేపీ నేత విష్ణువర్ధన్ రెడ్డి ధ్వజమెత్తం**


**కడపలో సర్కిల్ పేరు ప్రతిపాదనపై తీవ్ర అభ్యంతరం**

**ప్రొద్దుటూరు తరహాలోనే అడ్డుకుంటామని హెచ్చరిక**

**కడప, ఏప్రిల్ 7 (సమయం న్యూస్):** కడప నగరంలోని ఒక ప్రధాన సర్కిల్‌కు టిప్పు సుల్తాన్ పేరు పెట్టాలనే ప్రయత్నాలపై భారతీయ జనతా పార్టీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ ప్రతిపాదనను తాము గట్టిగా వ్యతిరేకిస్తున్నామని బీజేపీ సీనియర్ నేత విష్ణువర్ధన్ రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం ఆయన మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో ప్రభుత్వం మరియు మున్సిపల్ అధికారుల తీరుపై మండిపడ్డారు. భారత చరిత్రలో టిప్పు సుల్తాన్ ఒక వివాదాస్పద వ్యక్తి అని విష్ణువర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. ముఖ్యంగా హిందూ సమాజంపై దాడులు, బలవంతపు మత మార్పిడులకు పాల్పడిన చరిత్ర కలిగిన వ్యక్తి పేరును బహిరంగ ప్రదేశాలకు పెట్టడం ఏమాత్రం సమంజసం కాదని ఆయన హితవు పలికారు. అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న రాష్ట్రంలో, కావాలనే మతపరమైన విభేధాలు సృష్టించేందుకు కొందరు కుట్రలు పన్నుతున్నారని, దీనిపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని కోరారు. గతంలో ప్రొద్దుటూరులో కూడా ఇలాంటి ప్రయత్నమే జరిగిందని, అప్పట్లో స్థానిక హిందూ సమాజంతో కలిసి బీజేపీ ఆ కుట్రను అడ్డుకుందని ఆయన గుర్తు చేశారు. ఇప్పుడు కడపలో కూడా అదే తరహా పోరాటం చేస్తామని హెచ్చరించారు. "సీమ నడిబొడ్డున టిప్పు సుల్తాన్ పేరు పెట్టడం అంటే స్థానిక ప్రజల మనోభావాలను దెబ్బతీయడమే" అని ఆయన వ్యాఖ్యానించారు. కడప మున్సిపల్ కమిషనర్, కలెక్టర్ ఈ ప్రతిపాదనకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి ఇవ్వకూడదని విష్ణువర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఒకవేళ అధికారులు పక్షపాతంతో వ్యవహరించి అనుమతులు ఇస్తే, బీజేపీ క్షేత్రస్థాయిలో ఆందోళనలు చేపట్టి తీరుతుందని స్పష్టం చేశారు. మతసామరస్యాన్ని దెబ్బతీసే ఇటువంటి చర్యలను అడ్డుకోవడంలో తాము వెనకడుగు వేయబోమని ఆయన హెచ్చరించారు.

# ఇరాన్ నాగరికత అంతమైపోవడం ఖాయం

- ఇష్టం లేకపోయినా చర్యలు తప్పడం లేదు
- హర్మూజ్‌ను తెరవకపోతే విధ్వంసం తప్పదు
- మరోమారు ఘాటుగా హెచ్చరించిన ట్రంప్



**వాషింగ్టన్, ఏప్రిల్ 7:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి ఇరాన్‌కు తీవ్ర హెచ్చరికలు చేశారు. ఇరాన్ నాగరికత మొత్తం నేటి రాత్రితో అంతమైపోతుందని అన్నారు. దానిని మళ్లీ ఎప్పటికీ పునరుద్ధరించలేరని 'ట్రూత్ సోషల్' వేదికగా పోస్టు పెట్టారు. ఇరాన్‌లో 47 ఏళ్లుగా ఉన్న అవినీతి, అరాచక పాలన అంతం కానుందని.. ప్రపంచ చరిత్రలో ఈ రాత్రి ఓ మైలురాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. ఆ దేశాన్ని తుడిచిపెట్టడం నిజానికి తనకు ఇష్టం లేదని.. కానీ ఆ విధంగా చేయక తప్పట్లేదని పేర్కొన్నారు. అయితే, ఇరాన్‌లో కొత్త, తెలివైన నాయకత్వం వచ్చిందని, దాని వల్ల అద్భుతాలు జరిగే అవకాశం కూడా ఉందన్నారు. మరికొన్ని గంటల్లో ఇరాన్ హర్మూజ్‌ను తెరవకపోతే ఆ దేశంలోని ఇరాన్‌లో వంతెనలు, విద్యుత్ కేంద్రాలను లక్ష్యం చేసుకుంటామని సోమవారం ట్రంప్ హెచ్చరించిన విషయం తెలిసిందే. అయినప్పటికీ అమెరికా ప్రతిపాదనలను ఇరాన్ తిరస్కరించడంతో.. ట్రంప్ తాజాగా మరోసారి హెచ్చరికలు చేశారు. ఇరాన్‌లోని పౌర, మౌలిక సదుపాయాలపై దాడులు చేస్తే.. అంతర్జాతీయ నేరంగా పరిగణిస్తామని ఐక్యరాజ్య సమితి చీఫ్ ఆంటోనియో గుటెరస్ హెచ్చరించినప్పటికీ అమెరికా దాడులు కొనసాగిస్తోంది. ఇరాన్‌లోని ఖర్గ్ ఐలాండ్ లో ఉన్న దాదాపు 50 లక్ష్యాలపై తమ దళాలు దాడులు జరిపినట్లు అమెరికా వెల్లడించింది. అక్కడి రక్షణ వ్యవస్థలపై కూడా దాడులు చేసినట్లు తెలిపింది. ఈ ద్వీపాన్ని స్వాధీనం చేసుకోవడానికి మెరైన్‌లతో ఆపరేషన్ చేపట్టడానికి అగ్రరాజ్యం యోచిస్తున్నట్లు సమాచారం. ఇరాన్‌లోని పలు ప్రాంతాల్లోనూ అమెరికా-ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్నాయి. ట్రంప్ వ్యాఖ్యలపై ఇరాన్ స్పందించింది. ఈ రాత్రికి ఇరాన్ నాగరికత తుడిచి పెట్టుకోబోతోందంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలను తిప్పికొట్టింది. అమెరికా, దాని మిత్రదేశాలే పురాతన నాగరికత కలిగిన ఇరాన్ నుంచి మరిచిపోలేని దెబ్బను రుచి చూస్తారంటూ పేర్కొంది. ఈ మేరకు దక్షిణ ఆఫ్రికాలోని ఇరాన్ ఎంబసీ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టింది.

# కాకతీయ వర్సిటీ ఓఎస్డీగా వెంకట్రామ్ రెడ్డి

ఏడాది పాటు పదవిలో కొనసాగింపు

వీసీ ప్రతాప్ రెడ్డి కీలక నిర్ణయం

టీజీ ఎడ్‌సెట్ కన్వీనర్‌గానూ బాధ్యతలు

ప్రొఫెసర్ నియామకంపై హర్షాతిరేకాలు

**వరంగల్, ఏప్రిల్ 7 (సమయం న్యూస్):** కాకతీయ విశ్వవిద్యాలయ ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్డీ)గా భౌతికశాస్త్ర విభాగ ఆచార్యులు ప్రొఫెసర్ బీ.వెంకట్రామ్ రెడ్డి నియమితులయ్యారు. ఒక సంవత్సర కాలానికి ఆయనను నియమిస్తూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్ రెడ్డి ఆదేశాలు ఇచ్చారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. వెంకట్రామ్ రెడ్డి నియామకం పట్ల విశ్వవిద్యాలయంలో సంతోషం వ్యక్తమవుతోంది. పలువురు బోధనా, బోధనేతర సిబ్బందితో పాటు పరిశోధకులు ఆయనను కలిసి అభినందనలు తెలిపారు. ప్రస్తుతం వెంకట్రామ్ రెడ్డి టీజీ ఎడ్‌సెట్ కన్వీనర్‌గా కూడా వ్యవహరిస్తున్నారు. విద్యా రంగంలో ఆయనకు ఉన్న సుదీర్ఘ అనుభవం వర్సిటీ పరిపాలనలో కీలక మార్పులకు, అభివృద్ధికి దోహదపడుతుందని తోటి ప్రొఫెసర్లు అభిప్రాయపడ్డారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో వర్సిటీ ప్రతిష్టను మరింత పెంచుతారని సహచరులు ఆకాంక్షించారు.

# ఏసీబీ వలలో అగ్రి వర్సిటీ డీన్!

లక్ష లంచం తీసుకుంటూ పట్టివేత.. విత్తన కంపెనీ నుంచి డిమాండ్

రాజేంద్రనగర్ వర్సిటీలో కలకలం.. ఇల్లు, ఆఫీసులో అధికారుల సోదాలు

**హైదరాబాద్, ఏప్రిల్ 7 (సమయం న్యూస్):** ఎన్ని దాడులు జరుగుతున్నా లంచగొండుల తీరు మారడం లేదు. నిత్యం ఎక్కడో ఒకచోట అవినీతి అధికారులు ఏసీబీకి చిక్కుతూనే ఉన్నారు. తాజాగా ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం అసోసియేట్ డీన్ గోవర్ధన్ అవినీతి నిరోధక శాఖ అధికారులకు పట్టుబడ్డారు. ఒక విత్తన కంపెనీ నుంచి లక్ష రూపాయల లంచం తీసుకుంటుండగా అధికారులు ఆయన్ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. గోవర్ధన్ పట్టుబడటంతో రాజేంద్రనగర్‌లోని అగ్రికల్చర్ కళాశాలలో ఏసీబీ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఆయన కార్యాలయంలోని రికార్డులను పరిశీలిస్తున్నారు. దీనితో పాటు ఎల్బీనగర్‌లోని గోవర్ధన్ నివాసంలోనూ సోదాలు కొనసాగుతున్నాయి. ఈ ఘటన వర్సిటీ వర్గాల్లో పెద్ద ఎత్తున కలకలం సృష్టించింది. పట్టుబడిన లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్న ఏసీబీ.. కేసు నమోదు చేసి లోతుగా దర్యాప్తు చేస్తోంది.

# పంటలకు సాగునీటి విడుదల!

ఈ నెల చివరి వరకు నీళ్లివ్వాలని ఆదేశం

సెక్రటరీ శ్రీధర్ ఐఏఎస్ కీలక నిర్ణయం

గౌడ విద్యార్థి సంఘం వినతితో స్పందన

ఎండిపోతున్న పొలాలకు ఊరట

ఎస్ఆర్ఎస్పీ రెండో దశకు నీటి గండం తొలగింపు



**హైదరాబాద్, ఏప్రిల్ 7 (సమయం న్యూస్):** శ్రీరామ్ సాగర్ రెండవ దశ ఆయకట్టు ప్రాంతాలకు ఈ నెల చివరి వరకు నీళ్లు అందించాలని తెలంగాణ గౌడ విద్యార్థి సంఘం నాయకులు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (నీటి పారుదల) శ్రీధర్ ఐఏఎస్ ను కోరారు. మంగళవారం సచివాలయంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు మొల్కపురి శ్రీకాంత్ గౌడ్, ప్రధాన కార్యదర్శి చిత్తలూరి కృష్ణమూర్తి గౌడ్ ఆయనను కలిసి వినతిపత్రం సమర్పించారు. పంట చేతికొచ్చే సమయంలో నీళ్లు లేక రైతులు ఇబ్బంది పడుతున్నారని, పొలాలు ఎండిపోతున్నాయని నేతలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సానుకూలంగా స్పందించిన శ్రీధర్ వెంటనే సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేశారు. పంటలు ఎండిపోకుండా తక్షణమే నీటిని విడుదల చేయాలని సూచించారు. సకాలంలో స్పందించినందుకు గౌడ విద్యార్థి సంఘం నేతలు సెక్రటరీకి కృతజ్ఞతలు తెలిపారు.

# తమిళనాడు ఎన్నికల్లో తెలంగాణ త్రయం!

స్టార్ కంపెయినర్లుగా రేవంత్, భట్టి, ఉత్తమ్

ఉత్తమ్‌కు అదనంగా సీనియర్ అబ్జర్వర్ బాధ్యత

12 నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి

డీఎంకేతో కలిసి కాంగ్రెస్ సమరశంఖం

ఈ నెల 23న తమిళనాట పోలింగ్

**హైదరాబాద్, ఏప్రిల్ 7 (సమయం న్యూస్):** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల పోరులో తెలంగాణ కాంగ్రెస్ అగ్ర నేతలు తమ సత్తా చాటనున్నారు. ఏఐసీసీ అధిష్టానం సోమవారం విడుదల చేసిన స్టార్ కంపెయినర్ల జాబితాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలకు స్థానం కల్పించింది. పొరుగు రాష్ట్రంలో కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి వీరు ప్రచార సారథులుగా వ్యవహరించనున్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి అధిష్టానం మరిన్ని కీలక బాధ్యతలను అప్పగించింది. తమిళనాడులో కాంగ్రెస్ పార్టీ పోటీ చేస్తున్న 28 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 12 స్థానాలకు ఆయనను సీనియర్ అబ్జర్వర్‌గా నియమించింది. క్షేత్రస్థాయిలో ప్రచార వ్యూహాలను పర్యవేక్షించడంతో పాటు అభ్యర్థుల గెలుపులో కీలక పాత్ర పోషించాలని సూచించింది. ఆయన తన సుదీర్ఘ రాజకీయ అనుభవంతో తమిళనాట కాంగ్రెస్ శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్నారు. తమిళనాడులో డీఎంకేతో కలిసి కాంగ్రెస్ పొత్తులో పోటీ చేస్తున్న సంగతి తెలిసిందే. తెలంగాణలో కాంగ్రెస్ సాధించిన విజయాన్ని, అక్కడ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను తమిళనాడు ప్రజలకు వివరించేందుకు ఈ నేతలు సిద్ధమవుతున్నారు. ఈ నెల 23న జరగనున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా తెలంగాణ కాంగ్రెస్ బృందం తమిళనాట రంగంలోకి దిగనుంది. ప్రచారంలో రేవంత్ రెడ్డి మార్కు ప్రసంగాలు, భట్టి విక్రమార్క హుందాతనం పార్టీకి కలిసొస్తాయని శ్రేణులు భావిస్తున్నాయి.

# "కాంగ్రెస్ కోసం సైనికుల్లా పనిచేయాలి"

- బీఆర్ఎస్, బీజేపీలకు అధికారం కల్ల
- నాగర్ కర్నూల్ సభలో టీ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్
- బీసీలకు 52 శాతం రిజర్వేషన్లు ఇచ్చాం
- బీఆర్ఎస్ చేసిన రూ. 8 లక్షల కోట్ల అప్పులు తీరుస్తున్నాం
- బావా బామ్మర్దుల కొట్లాటతో బీఆర్ఎస్ ఖాళీ




**నాగర్ కర్నూల్, ఏప్రిల్ 7 (సమయం న్యూస్):** తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి రావాలంటే కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని టీ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలో బీఆర్ఎస్, బీజేపీలు అధికారంలోకి రావడం అసాధ్యమని ఆయన జోస్యం చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ అధ్యక్ష పదవి కోసం బావా బామ్మర్దులు హరీష్ రావు, కేటీఆర్ కొట్లాడుకుంటున్నారని విమర్శించారు. నాగర్ కర్నూల్‌లో కొత్తగా ఏర్పాటైన జిల్లా కాంగ్రెస్ నేతల ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

### గ్రామాలే పార్టీకి గుండెకాయ

కాంగ్రెస్ పార్టీకి గ్రామాలే బలమని, అక్కడికి వెళ్లి పార్టీని మరింత బలోపేతం చేయాలని మహేష్ కుమార్ గౌడ్ కేడర్‌కు సూచించారు. ప్రధాని మోదీ పేదలకు చేసిందేమీ లేదని, అలాంటి బీజేపీకి తెలంగాణలో తావులేదని మండిపడ్డారు. కులమతాలకు అతీతంగా పనిచేసే కాంగ్రెస్‌లో కష్టపడే ప్రతి ఒక్కరికీ అవకాశాలు వస్తాయని హామీ ఇచ్చారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును త్వరగా పూర్తి చేసి లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని చెప్పారు. ఈ ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు.

### హామీల అమలులో వెనకడుగు లేదు

రాహుల్ గాంధీ పాదయాత్రలో ప్రజల సమస్యలు తెలుసుకున్నారని, అందుకే స్థానిక ఎన్నికల్లో బీసీలకు 52 శాతం రిజర్వేషన్లు కల్పించామని పీసీసీ చీఫ్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి పేదవాడికి రేషన్ కార్డు మంజూరు చేసిందని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ళు, సన్న బియ్యం, ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యం వంటి పథకాలు కాంగ్రెస్ ఘనతేనని పేర్కొన్నారు. సోనియా గాంధీ ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణ ఇచ్చారని గుర్తు చేశారు.

### బీఆర్ఎస్ అప్పుల భారం

నీళ్లు, నిధులు, నియామకాల కోసం వచ్చిన తెలంగాణలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో చేసిందేమీ లేదని మహేష్ కుమార్ గౌడ్ ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని రూ. 8 లక్షల కోట్ల అప్పుల్లో ముంచిందని, ఆ భారాన్ని ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం తీరుస్తోందని వెల్లడించారు. ఎన్ని కష్టాలున్నా ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ముందుకు వెళ్తున్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే వంశీకృష్ణ, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు రాజేష్ రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, ఏఐసీసీ నేతలు సావర్కర్, వంశీచంద్ రెడ్డి పాల్గొన్నారు.

# గిరిజన వైద్యానికి అవార్డుల పంట!

- కొత్తగూడెం టీవీవీపీ ఆసుపత్రుల జోరు
- మంత్రి చేతుల మీదుగా పురస్కారాలు
- రాష్ట్ర స్థాయిలో జిల్లాకు గుర్తింపు
- ఉత్తమ సేవలకు దక్కిన ఫలితం



**హైదరాబాద్, ఏప్రిల్ 7 (సమయం న్యూస్):** ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన ఆరోగ్య వారోత్సవాల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు రాష్ట్ర స్థాయి గుర్తింపు లభించింది. గిరిజన ప్రాంతాల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో చూపిన కృషికి గాను జిల్లా వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులు అత్యధిక అవార్డులను సాధించాయి. హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చేతుల మీదుగా ఈ పురస్కారాలను ప్రదానం చేశారు. జిల్లా డీసీహెచ్ఎస్ డాక్టర్ రవి బాబు పరిధిలోని వైద్యులు, సిబ్బంది తమ ప్రతిభతో జిల్లా ప్రతిష్టను చాటారు.

పురస్కారాలు అందుకున్న వారిలో సీహెచ్‌సీ పాల్వంచకు చెందిన డాక్టర్ శైలేష్ కుమార్, డాక్టర్ రామ్ ప్రసాద్ ఉన్నారు. అదేవిధంగా భద్రాచలం ఏరియా ఆసుపత్రి నుంచి డాక్టర్ క్రపా విజయ్, నర్సింగ్ ఆఫీసర్ కృష్ణవేణి, ఏబీఏఎస్ సేవల విభాగంలో వెంకట రావు, ల్యాబ్ సేవల విభాగంలో డాక్టర్ రామకృష్ణ అవార్డులు స్వీకరించారు. మనుగూరు ఏరియా ఆసుపత్రి నుంచి నర్సింగ్ ఆఫీసర్ మానస, సీఎంఎస్ ఇంచార్జ్ ఫార్మాసిస్ట్ శారధలకు కూడా పురస్కారాలు దక్కాయి. భద్రాచలం, మనుగూరు, చర్ల వంటి మారుమూల గిరిజన ప్రాంతాల్లో అత్యుత్తమ పనితీరు కనబరిచినందుకు "బెస్ట్ పెర్ఫార్మెన్స్ ఇన్ ట్రైబల్ ఏరియా" విభాగంలో డాక్టర్ రవి బాబు మూడు అవార్డులను ఆయా ఆసుపత్రుల సూపరింటెండెంట్లతో కలిసి అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా, కమిషనర్ సంగీత, టీవీవీపీ కమిషనర్ అజయ్ కుమార్ తోపాటు పలువురు విభాగాధిపతులు పాల్గొన్నారు. గిరిజన ప్రాంతాల్లోని రోగులకు సమయోచితంగా, మెరుగైన వైద్యం అందిస్తున్నందుకు జిల్లా యంత్రాంగాన్ని మంత్రి అభినందించారు. ఈ అవార్డులు తమ బాధ్యతను మరింత పెంచాయని, భవిష్యత్తులోనూ ప్రజలకు అండగా ఉంటామని వైద్యులు సంతోషం వ్యక్తం చేశారు.

# వరంగల్ ప్రగతికి జర్మనీ బాసట!

- కేఎఫ్‌డబ్ల్యూ బృందంతో మేయర్ సుధారాణి భేటీ
- యూజీడీ ప్రాజెక్టుపై అంతర్జాతీయ సహకారం
- నగర అభివృద్ధికి భారీగా నిధుల కేటాయింపు
- త్వరలోనే డ్రైనేజీ పనుల ప్రారంభం
- పర్యావరణ హితమే లక్ష్యం: కలెక్టర్



**గ్రేటర్ వరంగల్, ఏప్రిల్ 7 (సమయం న్యూస్):** గ్రేటర్ వరంగల్ అభివృద్ధికి అంతర్జాతీయ భాగస్వామ్యం అత్యంత కీలకమని నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. జర్మనీ దేశానికి చెందిన కేఎఫ్‌డబ్ల్యూ సంస్థ ప్రతినిధులతో మంగళవారం వరంగల్ మున్సిపల్ కార్యాలయంలో ఆమె ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. హన్మకొండ జిల్లా కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ ఇన్ ఛార్జ్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ తో కలిసి ఈ సమావేశంలో పాల్గొన్నారు. నగరంలోని అండర్ గ్రౌండ్



డ్రైనేజీ (యూజీడీ) ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర నివేదికను (డీపిఆర్) అధికారులు ప్రతినిధులకు వివరించారు. వరంగల్ నగరం చారిత్రక ప్రాధాన్యత కలిగిన నగరమని, హైదరాబాద్ తర్వాత తెలంగాణలో రెండో అతిపెద్ద నగరంగా వేగంగా ఎదుగుతోందని మేయర్ పేర్కొన్నారు. నగరాన్ని పరిశుభ్రంగా, సుస్థిరంగా తీర్చిదిద్దేందుకు ఆధునిక వసతులపై దృష్టి పెట్టామన్నారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరంగల్ అభివృద్ధి కోసం సుమారు 5,725.40 కోట్ల రూపాయల భారీ నిధులు కేటాయించారని మేయర్ తెలిపారు. ఈ నిధులతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, స్టామ్ వాటర్ డ్రెయిన్ పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే టెండర్ ప్రక్రియ పూర్తయిందని, త్వరలోనే పనులు మొదలు కానున్నాయని వివరించారు. కేఎఫ్‌డబ్ల్యూ సంస్థ సాంకేతిక పరిజ్ఞానం నగరానికి ఎంతో ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ ప్రాజెక్టు అమలులో శాఖల మధ్య సమన్వయం అవసరమని సూచించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. కేఎఫ్‌డబ్ల్యూ ప్రతినిధులు పరిమల్, రుచి, నితిన్ మాట్లాడుతూ ప్రాజెక్టు వివరాలను పరిశీలించామని, భవిష్యత్తులో మరిన్ని సాంకేతిక సూచనలు అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం విదేశీ ప్రతినిధులకు కాకతీయ కళాతోరణం ప్రతిమలను బహుకరించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఇన్ ఛార్జ్ ఎస్ ఈ శ్రీనివాస్ రావు, సీ ఎం హెచ్ ఓ డాక్టర్ రాజారెడ్డి, సీ హెచ్ ఓ రమేష్ పాల్గొన్నారు. సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్న రాణి, సమ్మయ్య, బిర్రు శ్రీనివాస్ కూడా ఈ భేటీలో భాగస్వాములయ్యారు.